గిన్నిస్ బుక్‌లోకి

మెగాస్టార్



156 సినిమాలు.. 537 పాటలు..
24వేల స్టెప్పులతో రికార్డు

చిరంజీవికి విశిష్ట గౌరవం › 12

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

నిపుణ — పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

సోమవారం MONDAY 23.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 109 ‖ వెల (Price) రూ.6.50 | షష్ఠి

సోమవారం, సూర్యోదయం: 6-05, సూర్యాస్తమయం: 6-11. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: షష్ఠి పగలు 3-51 వరకు. నక్షత్రం: రోహిణి రాత్రి 10-07 వరకు. వర్జ్యం: పగలు 2-26 నుంచి పగలు 3-58 వరకు, పునర్ వర్జ్యం: తెల్లవారుజామున 3-41 నుంచి తెల్లవారుజామున 5-16 వరకు. రాహుకాలం: ఉదయం 7-36 నుంచి ఉదయం 9-07 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-32 నుంచి పగలు 1-20 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 2-57 నుంచి పగలు 3-45 వరకు. అమృతకాలం: రాత్రి 7-02 నుంచి రాత్రి 8-34 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

సామాన్యుడి గుండెల్లో హైడ్రా గునపం

'దేవుడా! ఇంత అన్యాయమా! నిన్ను నమ్మి ఓట్లేసి గెలిపిస్తే ఇంత అన్యాయం చేస్తావా రేవంత్? నా కొడుకు లక్షల్లో అప్పులు తెచ్చి రేకుల షెడ్డు నిర్మించుకుని, క్యాటరింగ్ పనులు చేస్తూ అప్పు తీర్చేందుకు రూపాయి రూపాయికి గోసపడుతున్నం. ఇప్పుడు చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నం. జీవితాంతం కోలుకోలేని దెబ్బవేశారు. ఈ సర్కారు మా సావుకొచ్చింది.

- ఆదిలక్ష్మి







దేవుడా.. ఈ సర్కారు మా సావుకొచ్చింది


హైడ్రా కూల్చివేతల మధ్య సామాన్యుడి ఆక్రందన

- అమీన్‌పూర్, కూకట్‌పల్లిలో మూడు చోట్ల చర్యలు.. నల్లచెరువు కింద 16 ఆక్రమణలు తొలగింపు
- కిష్టారెడ్డిపేటలో 3 కమర్షియల్ భవనాలపై బుల్డోజర్లు.. పటేల్‌గూడలో 25 భవనాలు నేలమట్టం
- కాళ్లావేళ్లా పడినా కనికరించని హైడ్రా అధికారులు.. ఇల్లు కూలి నడి రోడ్డుపైకి నిండు గర్భిణి
- మూడు రోజుల క్రితం ప్రారంభమైన పిల్లల దవాఖాన కూల్చివేత.. సామాన్లకూ సమయమివ్వలే!
- నోటీసులు ఇవ్వకుండానే ఇండ్లపైకి.. నివాసముంటే కూల్చబోమన్న రంగనాథ్ మాట ఉత్తదే!



హైదరాబాద్ సిటీబ్యూరో/కేపీహెచ్‌బీ కాలనీ/పటాన్‌చెరు, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): హైడ్రా కూల్చివేతలు సామాన్యుడి బతుకును ఆగం చేస్తున్నాయి. ప్రజాపాలనలో సమయం, సందర్భం లేకుండా దూసుకువస్తున్న హైడ్రా బుల్డోజర్లు వారి జీవితాలను చెల్లాచెదురు చేస్తున్నాయి. చట్టం తమ చుట్టం అన్నట్టు ఉన్నోడికో న్యాయం, లేనోడికి మరో న్యాయం అన్నట్టుగా కూల్చివేతల్లో హైడ్రా ద్వంద్వ వైఖరి కొనసాగిస్తూ వస్తున్నది. తెల్లవారుజామున జనం నిద్ర లేవకముందే సామాన్యుల ఇండ్లు, చిరు వ్యాపారుల దుకాణాలపై హైడ్రా విరుచుకుపడుతున్నది. ఆదివారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలోని ప్రభుత్వ స్థలాలు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి నల్లచెరువు ఎఫ్‌టీఎల్‌లో › 2వ పేజీలో





ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ప్రత్యేక కథనం -5

జంక్షన్.. టెన్షన్!

చౌటుప్పల్‌లోనూ 'ట్రిపుల్ ఆర్' భూ మాయ!

- జంక్షన్ విస్తరణతో రెండున్నర రెట్లు పెరిగిన భూసేకరణ
- పాత డిజైన్‌లో 78.. ఇప్పుడు 181 ఎకరాలకు పెంపు!
- ఏపీ వెళ్లేవారి కోసం మాల్స్, మల్టీప్లెక్స్.. సర్కార్ ప్లాన్
- కొత్త అలైన్‌మెంట్‌తో రెండుగా చీలనున్న చౌటుప్పల్

ట్రిపుల్ ఆర్ ఉత్తర, దక్షిణ కూడలి అయిన చౌటుప్పల్ జంక్షన్ విస్తరణను ప్రభుత్వం ఉన్నపళంగా 78 ఎకరాల నుంచి 181 ఎకరాలకు పెంచింది. ఎందుకోసం అనేదానిపై స్పష్టంగా చెప్పకపోయినప్పటికీ.. ఏపీ వెళ్లే ప్రయాణికుల కోసం మాల్స్, మల్టీప్లెక్స్‌లు నిర్మించాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తున్నది. అందుకు భూముల కోసం పేద రైతులను బలిపెడుతున్నది.

ట్రిపుల్ ఆర్ ఇంటర్‌చేంజ్ కోసం గత ప్రభుత్వం 78 ఎకరాలకే ప్లాన్ పరిమితం చేసింది. కానీ దాంతోపాటు రిఫ్రెష్‌మెంట్ హబ్‌గా మార్చడానికి రేవంత్ సర్కార్ 181 ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొందరి వినోదం కోసం తమను బజారున పడేయటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. కొత్త అలైన్‌మెంట్‌తో చౌటుప్పల్ పట్టణం రెండుగా చీలనున్నది. ప్లాన్ మార్పుతో రెండున్నర రెట్లు అధికంగా రైతుల భూములను గుంజుకోవడానికి ప్రభుత్వం సిద్ధమవడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కోమటిరెడ్డి బ్రదర్స్ తీరుపైనా భూ బాధితులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అలైన్‌మెంట్ మార్పులు తమకు తెలియవంటూ మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దాగుడుమూతలు ఆడుతుండటంపై వారు మండిపడుతున్నారు. › 5

- చౌటుప్పల్ జంక్షన్‌పై ప్రభుత్వ పెద్దల దాగుడుమూతలు
- లబోదిబోమంటున్న రైతులు, భూముల యజమానులు
- 2 నెలలుగా కనపడిన వారినల్లా వేడుకుంటున్న బాధితులు
- పెద్దలకోసం మా భూములు లాక్కుంటారా అని ఆగ్రహం
- సీఎంనే అడగండంటూ కోమటిరెడ్డి బ్రదర్స్ సమాధానం!

విస్తరణను ఆపాలంటూ భూబాధితుల డిమాండ్



• భూమి పోతే సచ్చిపోవుడే..!

నాకు ఇద్దరు బిడ్డలు. ఉన్నది ఒకటే ఎకరం. వారికి పెండ్లిళ్లు చేసి కట్నం కింద భూమి ఇస్తానని చెప్పిన. ఉన్న భూమి ఇప్పుడు రింగ్ రోడ్డు కింద పోతున్నది. ఏమి చేయాలో అర్థమైతలేదు. భూమి పోతే సచ్చిపోవుడే. నా బిడ్డలకు ఏంచెప్పాలో అర్థమైతలేదు. ఇల్లు ఒకటే మిగుల్తది. దాన్ని కూడా అమ్మితే ఇగ రోడ్డు మీద ఉండాల్సిందే.

-మార్గం మల్లయ్య, రైతు, చౌటుప్పల్

ఈ భూదందాకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి **91827 77711**



ఫార్మా.. రోజుకో డ్రామా!

- ఫార్మాసిటీపై రేవంత్ సర్కారు డొంకతిరుగుడు!
- రద్దు చేశామంటూ ఒకసారి.. చేయలేదంటూ మరోసారి..!
- మీడియా ముందు చెప్పేదొకటి.. న్యాయస్థానంలో మరొకటి!
- ఫార్మా విలేజ్, క్లస్టర్ అంటూ పూటకో మాట చెప్తున్న సర్కార్
- జిల్లాల్లోనూ ఫార్మా క్లస్టర్లంటూ ప్రభుత్వాధినేత ప్రకటనలు
- అనేకచోట్ల మొదలైన భూసేకరణ
- ప్రాజెక్టు రద్దయితే భూములు తిరిగివ్వాలన్నది నిబంధన › 6
- తేల్చాలని పట్టుబడుతున్న రైతులు



ముఖ్యమంత్రి భార్యకు సృజన్‌రెడ్డి బంధువు కాదు, ఆమెకు స్వయానా సోదరుడని మంత్రి చెప్తున్నారు. భార్య తమ్ముడు బావమరిది కాకుండా ఇంకేమి అవుతాడో పొంగులేటి చెప్పాలి. ఒక్క రూపాయి అవినీతి జరిగినా, రూ.8,888 కోట్ల అవినీతి జరిగినా ఈ చట్టం వర్తిస్తుందనే విషయం ఆయన తెలుసుకోవాలి. ఇప్పటికైనా జరిగిన తప్పును సీఎం ఒప్పుకొని అమృత్ టెండర్లను వెంటనే రద్దు చేయాలి.

- మాజీ మంత్రి కేటీఆర్

రాజీనామాకు రెడీ

'అమృత్'లో అక్రమాలు తేలకపోతే రాజకీయ సన్యాసం

మంత్రి పొంగులేటి సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్

- అమృత్ పథకం టెండర్లలో స్కాం నిజమే
- సీవీసీ లేదంటే హైకోర్టు సీజే దగ్గరికి వెళ్దాం
- ఫైళ్లు ముందుపెట్టి విచారణను కోరుదాం
- తేదీ, సమయం నువ్వే నిర్ణయించి చెప్పు
- మంత్రి పొంగులేటికి కేటీఆర్ ప్రతిసవాల్
- సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ వెన్నుపోటు
- 16% వాటా పంచి 33 శాతమని మోసం
- కాంగ్రెస్‌పై మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ టెండర్ల విషయంలో మంత్రి పొంగులేటి విసిరిన సవాలును స్వీకరిస్తున్నానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. అమృత్ పథకం టెండర్లలో తప్పు జరగలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. వెంటనే కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) లేదంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం పార్టీ నేతలతో కలిసి › 3వ పేజీలో

నేటినుంచి సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు

- కాంగ్రెస్ మోసాన్ని ఎండగడతాం.. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి
- సింగరేణిలో ఇదే అతి తక్కువ బోనస్: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ › 3

దామగుండం కోసం మరో ఉద్యమం

- రాడార్ కేంద్రం కోసం 12 లక్షల చెట్ల నరికివేత
- జేఏసీ ధర్నాలో వక్తలు › 10

హైదరాబాద్‌లో ఉగ్ర కలకలం

- సిటీలో 6 నెలలుగా మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మకాం
- స్వాతంత్ర్య దినోత్సవాల్లో భారీ విధ్వంసానికి కుట్ర › 8



రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి ధోకా ఇచ్చిన కాంగ్రెస్ సర్కారుపై రైతులు తమ నిరసనను మరింత తీవ్రతరం చేశారు. ఇప్పటికే వైవిధ్యంగా ఆందోళన చేపట్టిన రైతులు.. తాజాగా 'సెల్ఫీ ఫర్ రుణమాఫీ' పేరుతో వినూత్న ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆదివారం సామాజిక మాధ్యమాల ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపేందుకు వీలుగా సెల్ఫీ వీడియోలు తీసుకుంటున్న సిద్దిపేట జిల్లా ధర్మారం రైతులు. › 3

కాళేశ్వరమే జీవధార

- ఎత్తిపోతలతో నిరూపించిన కాంగ్రెస్
- పొన్నంది అవగాహనారాహిత్యం
- ఎల్లంపల్లిని తామే పూర్తి చేశామని మంత్రి చెప్పకోవడం విడ్డూరం
- బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రాజెక్ట్ పూర్తి
- మాజీ మంత్రి హరీశ్‌రావు పంచ్

చిన్న భాగమైన మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగిపోతే.. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కుంగిపోయిందని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. ఇప్పుడు అదే కాళేశ్వరం వ్యవస్థను బ్రహ్మాండంగా వాడుకుంటున్నారు. › 3

- హరీశ్‌రావు



మూణ్నెళ్లుగా జీతాల్లేవ్!

- అన్ని ప్రభుత్వశాఖల్లోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తండ్లాట
- ఎక్కే మెట్టు.. దిగే మెట్టు అన్నట్టుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్న దుస్థితి
- పండుగ ఎలా చేసుకోవాలంటూ నాన్‌రెగ్యులర్ సిబ్బంది ఆవేదన

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. దాదాపు సగటున 4-9 నెలలుగా వారికి వేతనాలు చెల్లించటం లేదు. ఇప్పటికే అందినకాడికి అప్పులు చేయగా, రాబోయే దసరా, దీపావళి పండుగలకు ఎట్లా వెళ్లదీయాలో అర్థంకాక ఆవేదన చెందుతున్నారు. జీతాలు ఇవ్వండి మహాప్రభో అంటూ సర్కారును వేడుకొన్నా ఆలకించని పరిస్థితి › 6వ పేజీలో



తొలగిన 'గాంధీ' ముసుగు

- సీఎల్పీ సమావేశం సాక్షిగా బట్టబయలు › 5
- హాజరైన అరికెపూడి, ఫిరాయింపు ఎమ్మెల్యేలు
- సీఎంను కలిసేందుకే వచ్చారని దుద్దిళ్ల సమర్థన

జనాభాను లెక్కిస్తేనే బీసీ రిజర్వేషన్!

- త్వరలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు
- నాలుగోసారి గెలుపు కోసమే జమిలి పాటెత్తుకున్న మోదీ › 6
- 9 నెలల్లో ఒక్క సెలవూ తీసుకోలేదు
- సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

అంచనాల పద్దు నాకొద్దు..!

- చైర్మన్ పదవిని తిరస్కరించిన ఎమ్మెల్యే పద్మావతి
- డిప్యూటీ స్పీకర్ కావాలని డిమాండ్
- రాజగోపాల్‌రెడ్డిపై సీఎం ఆసక్తి › 9
- రేవంత్, ఉత్తమ్ మధ్య కోల్డ్‌వార్





కూకట్‌పల్లిలోని నల్లచెరువు వద్ద ఆదివారం ఉదయం భవనాలను కూల్చివేస్తున్న హైడ్రా


అమీన్‌పూర్‌లోని కిష్టారెడ్డిపేటలో హైడ్రా కూల్చివేతలతో వీధిన పడిన కుటుంబాలు

దేవుడా.. ఈ సర్కారు మా సావుకొచ్చింది

మొదటిపేజీ తరువాయి...

ఉన్న 16 ఆక్రమణలను తొలగించింది. ఈ మూడు చోట్ల కలిపి 8 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రక్షించినట్టు హైడ్రా ప్రకటించింది. ఈ కూల్చివేతల్లో సామాన్యుడే మరోసారి సమిధగా మారాడు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడ, కృష్టారెడ్డిపేట గ్రామాల్లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిగాయని హైడ్రా కూల్చివేతలు ప్రారంభించింది. ఆదివారం ఉదయం నుంచి హైడ్రా ప్రత్యేక బలగాలు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది భారీ పోలీసు బందోబస్తు మధ్య వచ్చి జేసీబీలు, బుల్డోజర్లు, ప్రత్యేకంగా తెప్పించిన హిటాచీ వాహనంతో కూల్చివేతలు ప్రారంభించారు. కృష్టారెడ్డిపేట గ్రామంలో సర్వే నంబర్ 164లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన మూడు భారీ కమర్షియల్ కాంప్లెక్స్ భవనాల కూల్చివేత ప్రారంభించారు. అక్కడ ఎకరా స్థలం ఆక్రమణకు గురైనట్టు అధికారులు తెలిపారు. అక్కడే మూడు రోజుల క్రితం ప్రారంభమైన పిల్లల దవాఖానను నేలమట్టం చేశారు. బాధితులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు నెట్టివేశారు. రెండు నిర్మాణాలను నేలమట్టం చేసిన అధికారులు మూడోది కూడా కూల్చేవెళ్తామని స్పష్టం చేశారు. పటేల్‌గూడలోని సర్వే నంబర్ 12/2, 12/3 ప్రభుత్వ భూమిలో 3 ఎకరాల స్థలం అన్యాక్రాంతం అయిందని హైడ్రా అధికారులు గుర్తించారు. ఇటీవలే ఈ కాలనీలో గృహప్రవేశాలు జరిగాయి. సాయంత్రం వరకు హైడ్రా బృందం 25 విల్లా భవనాలను నేలమట్టం చేసింది.

తప్పు యాజమానిది.. శిక్ష కిరాయిదారుకు!

కూకట్‌పల్లి నల్ల చెరువు విస్తీర్ణం 30 ఎకరాలు కాగా 7.36 ఎకరాల స్థలం మాత్రమే చెరువు శిఖం భూమి ఉంది. మిగిలిన స్థలానికి పట్టా కలిగిన ప్రైవేటు వ్యక్తులు స్థలాన్ని ప్లాట్లుగా మార్చి భవనాలు, రేకుల షెడ్లను నిర్మించారు. మరికొందరు అమ్మేసుకున్నారు. కొందరు కిరాయిలకు ఇచ్చారు. ఈ రేకుల షెడ్లకు వారు ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. నల్ల, విద్యుత్తు కనెక్షన్ కూడా ప్రతి నెల క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు వచ్చి కూల్చివేయడంతో ఆ కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయి. ఈ ప్లాట్ల విషయంలో యజమానులకు కాకుండా కిరాయిదారులకు శిక్ష పడింది.

నల్లచెరువులో ఒక్కొక్కరిదీ ఒక్కో గాథ

ఇక్కడ నివాసముంటున్న వారిలో చాలా మంది సొంత ఖర్చులతో నిర్మించుకున్న రేకుల షెడ్డులలో టెంట్‌హౌస్‌లు, క్యాటరింగ్, ఫ్లెక్సీ తయారీ వంటివాటిని ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. ఇప్పుడు వారి జీవితాలన్నీ చెల్లాచెదురైపోయాయి. నోటీసులు కూడా ఇవ్వకుండా నిర్మాణాలను కూల్చివేయడంతో గుండెలవిసేలా విలపిస్తున్నారు. తెలియక షెడ్లు నిర్మించుకున్నామని, వాటిని తొలగించుకుని, అందులోని సామాన్లను తీసుకునే సమయం ఇవ్వాలని అధికారుల కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు. దీంతో లక్షల విలువ చేసే వస్తువులు నాశనమైపోయినట్టు చెప్తూ బాధితులు కన్నీరు పెట్టుకున్నారు.

భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు

పటేల్‌గూడ, కృష్ణారెడ్డిపేట ఇటీవల అమీన్‌పూర్ మున్సిపాలిటీలోకి విలీనమయ్యాయి. ఈ గ్రామాలు పంచాయతీలుగా ఉన్నప్పుడు ప్రభుత్వ భూముల్లోనూ వెంచర్లు వేసి డూప్లెక్స్ బిల్డింగ్‌లు నిర్మించారు. హైడ్రా అధికారులు భారీ బందోబస్తు మధ్య వచ్చి వాహనాల రాకపోకలను నియంత్రించి వీటిని కూల్చివేశారు. ఇటీవలే ప్రారంభించిన పిల్లల దవాఖానను కూడా కూల్చివేశారు. వాణిజ్య సముదాయాల కూల్చివేతల సమయంలో హైకోర్టు స్టే ఉందని యజమానులు చెప్తున్నా అధికారులు పట్టించుకోలేదు.

ఓట్లేసి గెలిపిస్తే రోడ్డున పడేశావా రేవంత్!

'దేవుడా! ఇంత అన్యాయమా. నువ్వు వస్తే బాగుంటుందని నమ్మి ఓట్లేసి గెలిపిస్తే ఇంత అన్యాయం చేస్తావా? నా కొడుకు లక్షల్లో అప్పులు తెచ్చి రేకుల షెడ్డు నిర్మించుకుని, క్యాటరింగ్ పనులు చేస్తూ రూపాయి రూపాయికి గోసపడుతున్నాం. ఇప్పుడు చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నాం.జీవితాంతం కోలుకోలేని దెబ్బ వేశావు దేవుడా?' అని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. మహబూబ్‌నగర్‌లోని ఓ మారుముల ప్రాంతం నుంచి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన గాండ్ల రమేశ్.. భార్య మానస, తల్లి ఆదిలక్ష్మి, తండ్రి ఆనంద్‌కుమార్‌తో కలిసి ఇక్కడ నివసిస్తున్నాడు. నల్లచెరువు సమీపంలోని ఓ ఖాళీ స్థలాన్ని 6 ఏండ్లకు లీజుకు తీసుకున్నాడు. యజమానికి లక్ష రూపాయల అడ్వాన్స్, ప్రతి నెల రూ. 30,500 కిరాయి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాడు. ఆ ఖాళీ స్థలంలో కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసి రేకుల షెడ్డు, వంటసామగ్రి పెట్టుకున్నాడు. రెండేండ్లు ఆ కుటుంబమంతా కష్టపడటమే కాకుండా మరో పదిమందికి ఉపాధి కూడా కల్పించారు. నెలనెలా మిత్తీలు, యజమానికి కిరాయి, జీహెచ్ఎంసీకి ఆస్తిపన్ను చెల్లిస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం ఒక్కసారిగా వచ్చిన హైడ్రా అధికారులు వారి గూడును కూల్చేయడంతో కట్టుబట్టలతో కుటుంబం రోడ్డున పడింది.


కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద హైడ్రా కూల్చివేతలతో వీధినపడ్డ బాధితుల సామగ్రి

అప్పు చేసి బతుకుతున్నాం



ఎవరిపైనా ఆధారపడకుండా బతకాలని అప్పుచేసి రేకుల షెడ్డు నిర్మించుకుని క్యాటరింగ్ పనులు చేసుకుంటున్నా. నాతోపాటు మరో పదిమందికి ఉపాధి కల్పిస్తున్నా. నన్ను ఇప్పుడు రోడ్డున పడేశారు. కూలగొట్టడానికి ముందు నోటీసులు, సమయం ఇచ్చి ఉంటే ఇంత నష్టం జరిగి ఉండేది కాదు. ఇప్పుడు అంతా కోల్పోయి రోడ్డున పడ్డా. మమ్మల్ని ఎవరు ఆదుకుంటారు. మాలాంటోళ్లను ఇబ్బంది పెట్టే వారిని దేవుడే చూసుకుంటాడు.

- రమేశ్ , బెస్ట్ వింటేజ్ క్యాటరింగ్ నిర్వాహకుడు

రేవంత్‌రెడ్డికి పుట్టగతులుండవ్



రేవంత్‌రెడ్డిని నమ్మి ఓట్లేస్తే రోడ్డున పడేశారు. యజమానిని కాకుండా కిరాయిదారులను శిక్షిస్తే ఎలా? ముందుగా చెబితే సామగ్రి తీసుకుని ఉండేవాళ్లం. అధికారుల కాళ్లకు మొక్కిన వినలేదు. నా కోడలు గర్భవతి. ఇప్పుడు మా గూడు కూల్చేస్తే మేం ఎలా బతకాలి. దేవుడు వీరిని తప్పకుండా శిక్షిస్తాడు. నా కొడుకు కష్టార్జితంతో నిర్మించుకున్న రేకుల షెడ్డును కూల్చిన రేవంత్‌కు పుట్టగతులుండవు. **- ఆదిలక్ష్మి, రమేశ్ తల్లి**

ముగ్గురు ఆడపిల్లలు .. అన్యాయం చేయొద్దు



సూర్యాపేట జిల్లా తొర్రూరుకు చెందిన గుగులోత్ రవి.. భార్య విజయ, ముగ్గురు కూతుళ్లు, కొడుకుతో నగరానికి వచ్చి స్థిరపడ్డాడు. నల్ల చెరువు సమీపంలో ఓ ఖాళీ స్థలాన్ని కిరాయికి తీసుకుని రేకుల షెడ్డు నిర్మించుకున్నాడు. అందులో జీఆర్ సింబల్స్ డిజిటల్స్ పేరిట ఫ్లెక్సీ తయారీషాపు పెట్టుకున్నాడు. షెడ్డు నిర్మాణానికి, ప్రింటింగ్ మిషన్‌కు కలిపి కోటి రూపాయలు పెట్టుబడి పెట్టాడు. ఆదివారం హైడ్రా అధికారులు వచ్చి ఒక్కసారిగా షెడ్డును కూల్చివేయడంతో సొమ్మసిల్లి పడిపోయాడు. ఆయన భార్య, పిల్లలు వేడుకున్నా అధికారులు కనికరించలేదు.

నేను తప్పుచేస్తే శిక్షించండి

బతుకుదెరువు కోసం షాపు పెట్టుకుని పనిచేసుకుంటున్నా. చెరువులో నిర్మాణం అయితే నోటీసులు ఇచ్చి ఖాళీ చేయమని చెప్పాలి. మేము వినకుంటే అప్పుడు వచ్చి కూల్చాలి. ఇప్పుడు అకస్మాత్తుగా వచ్చి కూల్చేస్తే మేం రోడ్డున పడ్డాం. ప్రభుత్వం పేదలను ఆదుకోవాలి కానీ, ఇలా రోడ్డున పడేస్తే ఎలా? ఇంత ఘోరం ఎక్కడా చూడలేదు. తప్పుచేసిన వారిని శిక్షించాలి కానీ, మాలాంటి పేదోళ్లకు అన్యాయం చేయడం తగదు.

- గుగులోత్ రవి, జీఆర్ సింబల్స్ డిజిటల్స్

3 రోజుల క్రితమే రిజిస్ట్రేషన్ చేసుకున్నం



మూడు రోజుల క్రితమే ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. అంతలోనే మా ఇంటిని కూల్చివేశారు. మేము కొన్న ఇల్లు ప్రభుత్వ స్థలంలో ఉందని మాకు తెలియదు. రిజిస్ట్రేషన్‌కు ముందు అన్ని డాక్యుమెంట్లు పరిశీలించాం. అనుమతులు అన్నీ ఉన్నాయని ఇల్లు కొన్నాం. ఇల్లు కూల్చుతామని అధికారులు వచ్చి చెప్పడంతో షాకయ్యాం. ఏండ్ల తరబడి కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఇల్లు కొనుక్కున్నాం. కొంత బ్యాంకు లోను కూడా తీసుకున్నాం. ఇప్పుడు ఒక్క క్షణంలో అంతా అయిపోయింది. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టి అమ్మిన బిల్డర్లు, అనుమతులు ఇచ్చిన అధికారులదే ఈ పాపం. ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకొని మాలాంటి బాధితులకు న్యాయం చేయాలి.

-శివారెడ్డి దంపతులు, పటాన్‌చెరు


కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద అధికారి కాళ్లపై పడి రోదిస్తున్న బాధితురాలు


నల్లచెరువు వద్ద కూల్చివేతలను అడ్డుకుంటున్న స్థానికులు


ఇల్లు కూల్చివేయడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియక రోదిస్తున్న గర్భిణి


నల్లచెరువు వద్ద కూల్చివేతను అడ్డుకుంటున్న మహిళను లాక్కెళ్తున్న పోలీసులు

8 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

- వాణిజ్య భవనాలు మాత్రమే కూల్చాం
- నివాసాల జోలికి వెళ్లలేదు
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ స్థలాలు, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో వెలసిన అక్రమ కట్టడాలను ఆదివారం కూల్చివేసి 8 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. వ్యాపారం కోసం నిర్మించిన భవనాలను మాత్రమే కూల్చివేశామని, నివాసం ఉంటున్న వారి జోలికి వెళ్లలేదని పేర్కొన్నారు. కూకట్‌పల్లి నల్లచెరువులోని సర్వే నంబర్ 66, 67, 68, 69లోని మొత్తం 16 వాణిజ్య షెడ్లు, ప్రహరీలు కూల్చివేసి మొత్తం నాలుగు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోనూ అక్రమణలను కూల్చివేశామని, కిష్టారెడ్డిపేటలోని సర్వే నంబర్ 164లో మూడు భవనాలను కూల్చేసినట్టు చెప్పారు. వాణిజ్యపరంగా వినియోగిస్తున్న ఐదంస్తుల భవనాన్ని కూడా నేలమట్టం చేసి, అక్కడ ఎకరం భూమిని స్వాధీనం చేసుకున్నామని, పటేల్‌గూడ సర్వే నంబర్ 12/2, 12/3లోని 25 నిర్మాణాలను కూల్చివేసి 3 ఎకరాల భూమిని రక్షించినట్టు రంగనాథ్ తెలిపారు.


కిష్టారెడ్డిపేటలో హైడ్రా కూల్చివేసిన చిన్నపిల్లల దవాఖాన


కూకట్‌పల్లిలోని నల్లచెరువు వద్ద హైడ్రా కూల్చివేతలో నేలమట్టమైన ప్రహరీ గేటు

కాళేశ్వరమే జీవధార

- ఎత్తిపోతలతో నిరూపించిన కాంగ్రెస్
- పొన్నంది అవగాహనారాహిత్యం
- ఎల్లంపల్లి పూర్తి చేశామని మంత్రి చెప్పుకోవడం విడ్డూరం
- బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రాజెక్ట్ పూర్తి
- మాజీ మంత్రి హరీశ్‌రావు పంచ్



> ఎల్లంపల్లి అప్పుడు ప్రాణహిత-చేవెళ్లలో భాగంగా ఉండేది. రీ ఇంజినీరింగ్ తర్వాత కాళేశ్వరంలో భాగమైంది. అవి కాళేశ్వరంలో భాగం అయిన ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోసిన నీళ్లే అయినా కాళేశ్వరం వ్యవస్థ ద్వారా చేరిన గోదావరి నీళ్లే కదా. **- హరీశ్‌రావు**

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకు జీవధార అని, ఇది వృథా ప్రాజెక్టు కాదని కాంగ్రెస్ ప్రభుత్వమే నిరూపించిందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును తామే పూర్తి చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో వివక్షకు గురై, పెండింగ్ ప్రాజెక్టుగా మిగిలిన ఎల్లంపల్లిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఈ మేరకు ఆదివారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఎఫ్‌ఆర్‌ఎల్ 148 మీటర్ల వరకు భూ సేకరణ కాలేదు. పునరావాస కాలనీలు పూర్తి చేయకపోవడంతో ముంపుగ్రామాల తరలింపు జరగలేదు. కరీంనగర్-మంచిర్యాల రాజీవ్ రహదారిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించలేదు. 144 మీటర్లకు నీరు చేరితే పాత లోలెవెల్ బ్రిడ్జి మునిగిపోయేది. రాకపోకలు బంద్ అయ్యేవి. మీ హయాంలో ఎల్లంపల్లి బరాజ్ పూర్తి అయినా పై కారణాలతో పూర్తిస్థాయిలో నీరు నింపలేక నిరుపయోగంగా ఉండిపోయింది. తెలంగాణ వచ్చాకే పునరావాస కాలనీల నిర్మాణం పూర్తి చేసి, ముంపు బాధితులకు నష్టపరిహారం చెల్లించి, ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కాలనీలకు తరలించి, రాజీవ్ రహదారిపై వేగంగా హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ఎల్లంపల్లి జలాశయంలో ఎఫ్‌ఆర్‌ఎల్ 148 మీటర్ల వరకు 20 టీఎంసీల నీటిని నింపినం. ఇందు కు 2,052 కోట్లు వెచ్చించినం. బరాజ్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి నం' అని హరీశ్‌రావు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎల్లంపల్లి ప్రాజెక్టును ఒక కీలకమైన 'బ్యాలెన్సింగ్ రిజర్వాయర్'గా మార్చాకే జలాశయం మీద ఆధారపడిన అన్ని ప్రాంతాలకు నీటిని అందించే పని ప్రారంభమైందని తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోసింది గోదారి నీళ్లే!

అంబేద్కర్ పేరు మీద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రూపకల్పన చేసిన ప్రాజెక్ట్‌లో భాగమైన ఎల్లంపల్లి, నంది మేడారం, మిడ్‌మానేరు, అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లు ఉన్నాయని మంత్రి పొన్నం నిజాయితీగా ఒప్పుకున్నందుకు సంతోషమని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ప్రాజెక్టును రీ ఇంజినీరింగ్ చేసినప్పుడు ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మ సాగర్ దాకా అలైన్‌మెంట్ మార్చలేదని, సీడబ్ల్యూసీ సలహాల మేరకు ఈ జలాశయాల నిల్వ సామర్థ్యాన్ని పెంచామని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ప్రతిపాదించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో మొత్తం జలాశయాల నిల్వ సామర్థ్యం 14 టీఎంసీలేనని, రీ ఇంజినీరింగ్ తర్వాత 141 టీఎంసీలకు పెరిగిందని స్పష్టంచేశారు. ఆ పెరిగిన టీఎంసీలతోనే జలాశయాల్లో ఈ రోజు నీటిని నింపగలిగారని, అవి ఎల్లంపల్లి నుంచి లిఫ్ట్ చేసినా కూడా మీరు వినియోగించింది కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మాణమైన సదుపాయాలనే కదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రక్రియ అర్థమైతే పొన్నం ప్రభాకర్ ఇవి కాళేశ్వరం నీళ్లు కావని అనేవారు కాదని తెలిపారు. 'శ్రీరాంసాగర్ వద్ద వరద ఉంటే, నీటి లభ్యత ఉంటే, కాళేశ్వరం ప్రాజెక్టులో లింకు-1, లింకు-2లో పంపులు నడుపరు. శ్రీరాంసాగర్ వద్ద నీరు లేకపోతే, ఎల్లంపల్లి వద్ద నీటి లభ్యత ఉన్నట్టయితే లింకు-1లో పంపులు నడపరు. లింకు-2 నుంచే ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు, అక్కడినుంచి లింకు-4లో ఉన్న పంపుల ద్వారా అ న్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌కు నీటిని లిఫ్ట్ చే స్తారు. ఈ రెండు చోట్ల నీరు లేని కాలంలోనే లింకు-1లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లికి, అక్కడినుంచి లింకు-2 లో పం పింగ్ ద్వారా మిడ్ మానేరుకు, అక్కడినుంచి లింకు-4లో పంపింగ్ ద్వారా ఎగువన ఉన్న 4 జలాశయాలకు, శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకం ద్వారా శ్రీరాంసాగర్‌కు, మల్లన్నసాగర్ నుంచి నిజాంసాగర్‌కు, బస్వాపూర్‌కు పంప్ చేస్తారు. ఇదీ కాళేశ్వరం ప్రాజెక్టులో ఉన్న వెసులుబాటు' అని హరీశ్‌రావు వివరించారు.

కాళేశ్వరం ఉపయోగం ప్రజలకు తెలుసు

'ఈ ఏడు శ్రీరాంసాగర్, ఎల్లంపల్లిల వద్ద నీటి లభ్యత ఉన్న కారణంగా ఎల్లంపల్లి నుంచే నీటిని పంపింగ్ చేశారు. ప్రకృతి అన్ని సీజన్లలో ఈ రకంగా సహకరించే అవకాశం లేదు. ముఖ్యంగా వేసవి సీజన్‌లో నీటిని మేడిగడ్డ వద్ద నుంచే లిఫ్ట్ చేయాల్సి ఉంటుంది. కాళేశ్వరం ప్రాజెక్టును ఒక సమగ్ర గోదావరి వ్యాలీ అభివృద్ధి ప్రాజెక్టుగానే చూడాలి తప్ప విడివిడి ప్రాజెక్టులుగా చూడటం అనేది అవగాహనా రాహిత్యం' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

> నాలుగేండ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థ ద్వారా సుమారు 20,33,572 ఎకరాలకు (కొత్త + స్థిరీకరణ) సాగునీరు అందిందని మంత్రి ఉత్తమ్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఇది అబద్ధమైతే, ఆ అబద్ధాలు చెప్పి శాసనసభ్యులను తప్పుదోవ పట్టించినందుకు ఆయన మీద ప్రివిలేజ్ మోషన్ పెట్టాల్సి వస్తుంది. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ వివరణ ఇవ్వాలి. **- హరీశ్‌రావు**

సాగులోకి వచ్చిన కొత్త ఆయకట్టు 98,570 ఎకరాలు

- 'కాళేశ్వరం కాలువల ద్వారా 456 చెరువులను నింపగా, వాటి కింద 39,146 ఎకరాలు సాగులోకి వచ్చాయి.
- శ్రీరాంసాగర్ (స్టేజ్-1, 2), నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలోని 2,143 చెరువులను నింపడం ద్వారా కొత్తగా 1,67,050 ఎకరాలు సాగులోకి వచ్చాయి.
- శ్రీరాంసాగర్, లోయర్ మానేరు, నిజాంసాగర్ ప్రాజెక్టుల ఆయకట్టుకు కీలక సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తడులకు నీటి సరఫరా అయింది. దీనితో ఈ ప్రాజెక్టుల కింద వానకాలం, యాసంగిలో 17,08,230 ఎకరాలు స్థిరీకరణకు నోచుకున్నాయి. ఈ స్థిరీకరణ 2020 నుంచి 2023 వరకు జరిగింది. స్థిరీకరణ కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక కాంపొనెంట్.
- లింకు-4 ద్వారా ఎత్తిపోసిన నీళ్లను కూడేల్లివాగు, హల్దీవాగుల ద్వారా 66 చెక్‌డ్యాంలను నింపడం వల్ల 20,576 ఎకరాలకు రెండు పంటలకు నికరంగా సాగునీరు అందింది' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, టీ రాజయ్య, బాల్క సుమన్, హరిప్రియానాయక్, వాసుదేవరెడ్డి, దుర్గం చిన్నయ్య

రాజీనామాకు రెడీ

మొదటిపేజీ తరువాయి...

> ముఖ్యమంత్రి భార్యకు సూదిని సృజన్‌రెడ్డి బంధువు కాదు, ఆమెకు స్వయాన సోదరుడు. భార్య తమ్ముడు బావమరిది కాకుంటే ఇంకేమి అవుతాడో పొంగులేటి చెప్పాలి. ఒక్క రూపాయి అవినీతి జరిగినా, రూ. 8,888 కోట్ల అవినీతి జరిగినా ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్‌తోపాటు అవినీతి నిరోధక చట్టం వర్తిస్తుంది. **- కేటీఆర్**

మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. 'నిన్న ఒక మంత్రి తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిల్డప్ ఇచ్చారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇద్దరం కలిసి హైకోర్టు సీజే దగ్గరకి పోదాం.. వెంటనే సిట్టింగ్ జడ్జితోని ఎంక్వయిరీ చేయిద్దాం. సిట్టింగ్ జడ్జి గనుక ఇందులో తప్పులు ఏం జరగలేదు అంటే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా. హైకోర్టు సీజే దగ్గరికి రావడానికి మంత్రిగారికి ఇబ్బంది ఉందంటే డేట్, టైం ఫిక్స్ చేయండి ఇద్దరం కలిసి కేంద్రంలో ఉండే సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ దగ్గరికి పోదాం. మంత్రిగారికి, ముఖ్యమంత్రికి ఒకటే చెప్తున్నా.. ఇప్పటికైనా టెండర్లు రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న ఫైల్స్‌తో పాటు ఇప్పటి టెండర్ల వ్యవహారం వివరాలు సీవీసీ లేదా రిటైర్డ్ జడ్జి ఎదుట ఉంచుదామని, న్యాయంగా తీర్పు చెప్పిన తర్వాత తాను చెప్పింది అబద్ధమంటే రాజీనామా కాదు రాజకీయ సన్యాసం చేస్తానని స్పష్టంచేశారు. పొంగులేటి గతంలో కాంట్రాక్టర్‌గా ఉంటే ఉండొచ్చు కానీ ఈ రోజు మంత్రిగా ఉండి కాంట్రాక్టులు సంపాదించడం ముమ్మాటికి చట్టవ్యతిరేకమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ టెండర్ల వ్యవహారంలో అవినీతి జరిగిందని సీఎంతో పాటు మంత్రి పొంగులేటికి కూడా తెలుసని పేర్కొన్నారు. కేవలం రెండు కోట్ల లాభం ఉన్న బామ్మర్ది కంపెనీకి రూ.1000 కోట్ల కాంట్రాక్టు ఇచ్చి అవినీతి జరగడం లేదంటే ఎవరైనా నమ్ముతారా? అని ప్రశ్నించారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్‌తోపాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లను కూడా తాను ప్రస్తావించిన నేపథ్యంలో మంత్రి పొంగులేటి ఆగమేఘాలమీద ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించారని తెలిపారు. ముఖ్యమంత్రి భార్యకి సూదిని సృజన్‌రెడ్డి బంధువు కాదు, ఆమెకు స్వయానా సోదరుడని, భార్య తమ్ముడు బావమరిది కాకుండా ఇంకేమి అవుతాడో పొంగులేటి చెప్పాలని నిలదీశారు. ఒక్క రూపాయి అవినీతి జరిగినా, రూ. 8,888 కోట్ల అవినీతి జరిగినా ఈ చట్టం వర్తిస్తుందనే విషయం ఆయన తెలుసుకోవాలని సూచించారు. ఇప్పటికైనా జరిగిన తప్పును సీఎం ఒప్పుకొని జరిగిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని సూచించారు. పొంగులేటి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే రాజీనామా చేయాల్సి వస్తుందని చెప్పారు. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని, ఈ బరితెగింపు మాటలు మానివేయాలని సూచించారు. లేకుంటే గతంలో అశోక్ చౌహాన్, యడ్యూరప్ప, సోనియాగాంధీ పదవులు పోయినట్టు మీ పదవులు కూడా పోతాయని హెచ్చరించారు.

> రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి అవినీతిపైనా మా దగ్గర సమాచారం ఉంది.. హైదరాబాద్‌కు దక్షిణాన నిర్మిస్తున్నది ఫోర్త్‌సిటీ కాదని, అది 'ఫోర్ బ్రదర్స్' సిటీ. **-కేటీఆర్**

ఢిల్లీకి కప్పం కట్టేందుకు అవినీతి

ఢిల్లీకి కప్పం కట్టేందుకు ఈ భారీ అవినీతికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెరతీసిందని కేటీఆర్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రి సోదరుడు అనుముల జగదీశ్‌రెడ్డి వెయ్యి కోట్లు పెట్టే స్థాయికి, రేవంత్‌రెడ్డి బావమరిది సూదిని సృజన్‌రెడ్డి రూ.2 కోట్ల నుంచి రూ.1000 కోట్ల పెట్టుబడి పెట్టే స్థాయికి ఎలా వెళ్లారనే విషయాన్ని రేవంత్‌రెడ్డి చెప్పాలని నిలదీశారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి అవినీతిపైనా తమ దగ్గర సమాచారం ఉన్నదని తెలిపారు. హైదరాబాద్‌కు దక్షిణాన నిర్మిస్తున్నది ఫోర్త్‌సిటీ కాదని, అది 'ఫోర్ బ్రదర్స్' సిటీ అని ఆరోపించారు. న్యాయస్థానాలను కూడా ఈ ప్రభుత్వం తప్పు దోవ పట్టిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫార్మాసిటీ రద్దు చేస్తున్నట్టు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు సీఎం కూడా చెప్పారని గుర్తుచేశారు. కానీ, న్యాయస్థానాల్లో మాత్రం అసత్య సమాచారంతో కూడిన పత్రాలను సమర్పిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకొని, కోర్టుల్లో మాత్రం పార్టీలో చేర్చుకోలేదని చెప్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధుల వ్యవహారాలకు సంబంధించిన ఈ అంశంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్ మొదలుకొని ఎనిమిది మందిలో ఒక్క బీజేపీ ఎంపీ కూడా ఎందుకు మాట్లాడటం లేదని కేటీఆర్ నిలదీశారు.

చీకటి సూరీళ్లకు రేవంత్‌సర్కార్ వెన్నుపోటు

సింగరేణి కార్మికులైన చీకటి సూరీళ్లకు రేవంత్‌రెడ్డి సర్కార్ వెన్నుపోటు పొడుస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి లాభాల్లో 16 శాతం మాత్రమే కార్మికులకు పంచుతూ 33 శాతం వాటా ఇస్తున్నట్టు మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'సింగరేణి నికర లాభాలు రూ.4,701 కోట్లు అయితే.. 33 శాతం వాటా అంటే కార్మికులకు రూ.1,551 కోట్లు బోనస్ ఇవ్వాలి. అంటే ఒక్కో కార్మికుడికి రూ.3.70 లక్షలు రావాలి. కానీ, కార్మికులకు ప్రకటించింది కేవలం రూ.796 కోట్లే. ఈ లెక్కన ఒక్కో కార్మికుడికి 16.9 శాతం మాత్రమే. కార్మికులకు హక్కుగా రావాల్సిన మిగతా వాటా రూ.754 కోట్లు ఎటు వెళ్లాయి. ఆల్‌టైం రికార్డు ఉత్పత్తిని సాధించినా అందుకు తగ్గ ఫలితం కార్మికుల దక్కడం లేదు. కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్న కాంగ్రెస్ సర్కారు నిజాలు చెప్పాలి. సింగరేణి లాభాల్లో 16 శాతమే ఇస్తున్నామని కాంగ్రెస్ సర్కారు ఒప్పుకోవాలి' అని డిమాండ్ చేశారు. కోల్‌బెల్ట్ మొత్తం కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే కార్మికులకు ఇచ్చే గౌరవం ఇదా? అని నిలదీశారు. కాంగ్రెస్ కుట్రపూరిత వైఖరిపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీతోపాటు సీపీఐ కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడకపోతే సింగరేణిని ప్రైవేటుపరం చేస్తారని చెప్పారు.

బీఆర్‌ఎస్ హయాంలో 32 శాతం పంచాం


బీఆర్‌ఎస్ పాలనలో సింగరేణి అద్భుత ప్రగతి సాధించిందని కేటీఆర్ గుర్తుచేశారు. సింగరేణి లాభాలు గణనీయంగా పెరగడంతో అందుకు అనుగుణంగా కార్మికుల వాటా పెంచుకుంటూ వచ్చామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పది పైసల వాటా మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ పాలన ఉన్న ఐదేండ్లలో 10 పైసల వాటానే ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో 11 పైసల నుంచి 20 పైసల వరకు మాత్రమే ఇచ్చారని చెప్పారు. 1999 నుంచి 2014 వరకు రూ.376 కోట్లు మాత్రమే సింగరేణి కార్మికులకు ఇచ్చారని, కాంగ్రెస్ పాలనలో లాభాలు ఎన్నడూ రూ.400 కోట్లు దాటలేదని చెప్పారు. లాభాలను వెయ్యి కోట్లు దాటించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో తాము రూ.2,780 కోట్లు కార్మికులకు పంచామని పేర్కొన్నారు. 2022-23లో కార్మికులకు సంస్థ లాభాల్లో ఏకంగా 32 శాతం వాటాను ప్రకటించి కార్మికుల కష్టానికి గుర్తింపు, గౌరవాన్ని కేసీఆర్ ఇచ్చారని వివరించారు. సగటున ఒక్కో కార్మికుడికి రూ.1.60 లక్షలు చెల్లించామని గుర్తుచేశారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, హరిప్రియా నాయక్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, తాటికొండ రాజయ్య, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు.

> ఆల్ టైం రికార్డు ఉత్పత్తిని సాధించినా అందుకు తగ్గ ఫలితం సింగరేణి కార్మికుల దక్కడం లేదు. వారి కష్టాన్ని దోచుకుంటున్న కాంగ్రెస్ సర్కారు నిజాలు చెప్పాలి. సింగరేణి లాభాల్లో 16 శాతం మాత్రమే ఇస్తున్నామని కాంగ్రెస్ సర్కారు ఒప్పుకోవాలి. కోల్‌బెల్ట్ మొత్తం కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే కార్మికులకు ఇచ్చే గౌరవం ఇదేనా? **- కేటీఆర్**



వరద బాధితులకు నిత్యావసర సరుకులు

ఇటీవల భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధి కూచిపూడి, తొగర్రాయి గ్రామాల్లోని బాధితులకు స్వేరోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సాయం చేశారు. 250 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.7 వేల విలువ గల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. **- కోదాడ రూరల్**


వెంకటయ్య, నర్సయ్య (ఫైల్)

తమ్ముని మృతితో ఆగిన అన్న శ్వాస

వెల్గటూర్, సెప్టెంబర్ 22 : తమ్ముని మృతిని తట్టుకోలేక ఓ అన్న శ్వాస ఆగిపోయింది. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం పాత గూడూరుకు చెందిన రెడ్డిమల్ల నరసయ్య(75) గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్నాడు. ఆ తర్వాత అతని ఆరోగ్యం మరింత క్షీణించగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. శనివారం దహన సంస్కారాలు పూర్తి చేసి కుటుంబసభ్యులు ఇంటికి చేరారు. తమ్ముడి మరణంతో కలత చెందిన అతని అన్న వెంకటయ్య (78) మనోవేదనతో మృతిచెందాడు.

బీసీలు పోరాడితేనే వాటా

- ఐకమత్యంతో సాధించుకోవాలి
- తెలంగాణ తొలి స్పీకర్ మధుసూదనాచారి




విశ్వకర్మ సభలో మాట్లాడుతున్న మధుసూదనాచారి. చిత్రంలో జూలూరు తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ)/రామంతాపూర్: ఐకమత్యంతో పోరాడి బీసీలు రాజకీయాల్లో తమ వాటాను సాధించుకోవాలని తెలంగాణ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. తెలంగాణలో బీసీ చైతన్యం మొదలైందని, బీసీలంతా సంఘటితమవుతున్నారని చెప్పారు. హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లోని విశ్వకర్మ ఆత్మగౌరవ భవన ప్రాంగణంలో ఆదివారం జరిగిన విశ్వకర్మల భారీ బహిరంగసభలో ఆయన మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం విశ్వకర్మల కోసం ఐదెకరాల స్థలాన్ని కేటాయించిందని, విశ్వకర్మల కోసం అనేక పథకాలను తెచ్చిందని తెలిపారు. బీసీ వర్గాల నుంచి వచ్చిన తనను తొలి స్పీకర్‌గా చేసి తెలంగాణ చరిత్రలో చెరిగిపోని స్థానాన్ని కల్పించారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆర్థిక రాజకీయ సామాజిక రంగాల్లో బీసీలు తమ వాటాను సాధించుకునే దాకా ఉద్యమించక తప్పదని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ సూచించారు. అనంతరం విశ్వకర్మ భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ సభలో ఎంపీ ఈటల రాజేందర్, హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ వెంకటాచారి, పద్మశ్రీ అవార్డు గ్రహీత వేలు ఆనందాచారి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర, బీజేపీ నాయకుడు ఆచారి, విశ్వకర్మ ఆత్మగౌరవ భావన ట్రస్ట్ చైర్మన్ లాల్కోట వెంకటాచారి, సెక్రటరీ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సింగరేణివ్యాప్తంగా ఆందోళనలు

- కాంగ్రెస్ మోసాన్ని ఎండగడతాం
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి


పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, సెప్టెంబర్ 22: సింగరేణి కార్మికులకు లాభాల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోసానికి వ్యతిరేకంగా దశలవారీగా పోరాటాలు చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 23న కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని, 24న రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం, 25న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామని వివరించారు. 26న కార్మికుల సంతకాల సేకరణతో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు పంపిస్తారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోతే హైదరాబాద్ సింగరేణి భవన్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నేత వాసిరెడ్డి సీతారామయ్య ఇతరులను నిందించే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని రాజిరెడ్డి హితవుపలికారు.

ఇదే అతి తక్కువ బోనస్

- సింగరేణి కార్మికులను మోసగించిన కాంగ్రెస్
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్
- నికర లాభాల్లో 33% చెల్లించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి కార్మికులకు ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బోనస్ అతి తక్కువదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఒక ప్రకటనలో విమర్శించారు. కేవలం 16.9 శాతం బోనస్ ప్రకటించిన ప్రభుత్వం.. కార్మికులకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. సింగరేణి కార్మికులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సింగరేణి లాభాల్లో 50 శాతం కోత విధించి కార్మికులను మోసం చేసిందని మండిపడ్డారు. సింగరేణి కార్మికుల కష్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బొగ్గుపాలు చేశారని, నికర లాభాల్లో 33 శాతం బోనస్ చెల్లించి రేవంత్‌రెడ్డి సర్కార్ తన మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు.

రామగుండం ప్లాంట్‌లో సింగరేణి భాగస్వామ్యం వద్దు

- తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : రామగుండంలో నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌లో సింగరేణి భాగస్వామ్యాన్ని ఒప్పుకునేది లేదని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్(టీజీపీఈఏ) స్పష్టంచేసింది. ఈ ప్లాంట్‌ను టీజీజెన్‌కో ద్వారానే నిర్మించాలని డిమాండ్ చేసింది. ఆదివారం ఎర్రగడ్డలోని జెన్‌కో ఆడిటోరియంలో టీజీపీఈఏ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నాకర్‌రావు, సదానందం మాట్లాడుతూ.. పాల్వంచ పాత ప్లాంట్ స్థానంలో 1,600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను నిర్మించాలని, 800 మెగావాట్ల కేటీపీపీ స్టేజ్-3 ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌కో, జెన్‌కోలకు రెగ్యులర్ సీఎండీలను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు ఏ వెంకటనారాయణ రెడ్డి, అడిషనల్ సెక్రటరీ జనరల్ కే అంజయ్య, చీఫ్ అడ్వైజర్ శివశంకర్, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


త్రిసభ్య కమిటీ సభ్యులు రాజయ్య, ఆనంద్, సంజయ్‌తో మాట్లాడుతున్న కేటీఆర్

నేటి నుంచి రాజయ్య కమిటీ పర్యటన

- గాంధీ సహా దవాఖానల క్షేత్రస్థాయి పరిశీలన
- దిగజారిన వైద్య, ఆరోగ్య వ్యవస్థపై అధ్యయనం
- కేటీఆర్‌తో కమిటీ భేటీ.. విధి విధానాలపై చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): గాంధీ సహా రాష్ట్రంలోని దవాఖానల అధ్వాన పరిస్థితిని అధ్యయనం చేసేందుకు మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ టీ రాజయ్య నేతృత్వంలో మెతుకు ఆనంద్, సంజయ్‌తో కూడిన బీఆర్‌ఎస్ నిజ నిర్ధారణ కమిటీ సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించనున్నది. ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానను త్రిసభ్య కమిటీ పరిశీలించనున్నది. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ సహా రాష్ట్రంలోని దవాఖానలను పరిశీలించనున్నది. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారం కేటీఆర్‌తో సమావేశమై కమిటీ విధి విధానాలు, అనుసరించాల్సిన వ్యూహంపై సమాలోచనలు జరిపారు. రాష్ట్రంలో దిగజారిన వైద్య ఆరోగ్య వ్యవస్థపై అధ్యయనం చేసి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

- మరో 4 రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆదివారం తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది.. సోమవారం వాయవ్య, పరిసర పశ్చిమ -మధ్య బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. వచ్చే మూడు, నాలుగు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

'సెల్ఫీ ఫర్ రుణమాఫీ'

- రుణమాఫీపై వినూత్న ఉద్యమం
- రుణమాఫీ కాలేదని సీఎంవోకు వీడియోలు
- సిద్దిపేట జిల్లా ధర్మారం రైతుల నిరసన

మిరుదొడ్డి, సెప్టెంబర్ 22 : రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత సగం మంది రైతులకు కూడా కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్ సర్కారుకు బుద్ధిరావాలని సిద్దిపేట జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన రైతులు 'సెల్ఫీ ఫర్ రుణమాఫీ' వీడియో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం గ్రామంలో రైతులు ఒక్కచోట చేరి 'సెల్ఫీ ఫర్ రుణమాఫీ' వీడియోలు తీసి ట్విట్టర్, ఫేస్‌బుక్ తదితర మాధ్యమాల ద్వారా సీఎంవోకు పంపే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 'రుణమాఫీ చేశామని జబ్బలు చరుచుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, నీకు రైతులు గట్టి జవాబు చెబుతూ సెల్ఫీ వీడియోలు తీసి పంపారని' అన్నారు. ఒక్క ధర్మారంలోనే రుణమాఫీ కాని 400 మంది రైతులు మానసికంగా ఇబ్బందులు పడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సెల్ఫీ వీడియోలు తీసి పంపినట్టు తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ చేశామని మీడియాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు గొప్పలు చెప్పుకోవడం తప్పితే సగం మంది కూడా రైతులకు రుణమాఫీ కాలేదని అన్నారు. ఈనెల 18న రుణమాఫీ కాని రైతులు మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెయ్యి మంది వరకు వచ్చి ధర్నా చేస్తే, బీఆర్‌ఎస్ నాయకులు వారికి డబ్బు ఇచ్చి తీసుకొచ్చి ఆందోళన చేయించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు వీడియోల ద్వారా డిజిటల్ ర్యాగింగ్ చేస్తారని హెచ్చరించారు. మిరుదొడ్డి మండల వ్యాప్తంగా 1500 మంది రైతుల నుంచి డిజిటల్ వీడియోలు సీఎంవోకు వెళ్లడం ఖాయమని అన్నారు. నిరసనలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, మాజీ సర్పంచ్‌లు తుమ్మల బాల్‌రాజు, జోగ్గారి బాల్‌నర్సయ్య, నాయకులు సూకురి లింగం, తీపిరెడ్డి దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మైసయ్య, పర్శరాములు, నారాయణ, మల్లేశం గౌడ్, భిక్షపతి, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

సుమారు ఆరు దశాబ్దాల (బలవంతపు) సహజీవనం, అందులోనూ 52 ఏండ్ల రాజకీయ పెత్తనం, ఇబ్బడిముబ్బడిగా పెరిగిన ఆంధ్రవారి వలసలు, తెలంగాణ వనరుల దోపిడి, ఇక్కడి ప్రజలకు జరిగిన అన్యాయాలు, పక్షపాత ధోరణి-ఆంధ్రా, తెలంగాణ విడిపోవటానికి గల కారణాల్లో కొన్ని అయితే, వీటిని మించిన కారణం ఒకటుంది. అది భావసమైక్యత లేకపోవడం! ఈ సమైక్యత లోపించటానికి ముఖ్య కారణం భాషా సమైక్యత లేకపోవటం! ఆంధ్రులకు, తెలంగాణవారికి ఈ వైరుధ్యం, వారు విడిపోయి పదేండ్లయినా తగ్గకపోవటానికి ముఖ్య కారణం తెలుగు, ఆంధ్రం వేరు భాషలవటమే! ఆ రెండూ ఒక్క భాష కాదు, ఒక్క మూలంలోంచి కూడా రాలేదు. అందుకే ఈ రెండు ప్రాంతాల ప్రజలకు భావాల, సంస్కృతుల మధ్య సమైక్యత దశాబ్దాల పాటు కలిసి ఉన్నా ఏర్పడలేదు.

తెలుగు భాష తెలంగాణవారి సొంతం, ఆంధ్రా ప్రాంతం వారి భాష సంస్కృత పదాలతో నిండి ఉన్న ఆంధ్ర భాష! ఇది తెలియని నెహ్రూను మోసగించి ఈ రెండు ప్రాంతాలను ఒక్క రాష్ట్రంగా భాషా ప్రాతిపదికన ఏర్పరిచినా ఆ కలయిక ఫలించలేదు. రాష్ట్ర విభజన అనివార్యమైంది. 'వెయ్యేండ్లు కలిసున్నా వేరు పడవలసిందే' అన్న గోరేటి వెంకన్న మాట నిజమైంది. శ్రీలంకలో స్థానిక లంకేయులకు, తమిళవారికి పొట్లాటలకు కారణం భాషే! కేరళలో సమంగా ఉన్న మూడు మతాల సఖ్యతకు కారణం వారంతా మాట్లాడేది ఒకే భాష కావటం! ఇప్పటికీ, తమ దేశం మత ప్రాతిపదిక మీద విడిపోయినా, బంగ్లాదేశ్‌లో ముస్లింలలో కూడా అధికులు బెంగాలీయే తమ మాతృభాషగా భావించటానికి కారణం కూడా భాషకున్న ప్రభావమే!

భాషా సమైక్యతే భావ సమైక్యత!



కులం కంటే, మతం కంటే మానవ భావాలను ప్రభావితం చేసేది భాష! సుమారు 400 ఏండ్లు ముస్లిం రాజుల పరిపాలనలో ఉన్న తెలంగాణ ప్రాంతం ప్రశాంతంగా మనటానికి వారందరూ ఒకే భాష మాట్లాడగలగడం. మొదట్లో పర్షియన్, తర్వాత ఉర్దూ దేశ భాషలుగా ఉండి, ఇక్కడి హిందువులు తెలుగు, కన్నడం, మరాఠీ మాతృభాషలుగా ఉన్నా, పర్షియన్, ఉర్దూ భాషలను కూడా తమ భాషలుగా భావించటం వలన ప్రజల్లో మత వైరుధ్యాలు లేవు. ముస్లింలు దసరా, వినాయక చవితికి పందాలు అలంకరిస్తే, హిందువులు మిలాద్ ఉన్ నబీ, పీర్ల పండుగలు జరుపుకునేవారు. సమైక్యతకు సరైన అర్థం అదీ! తెలుగు, ఆంధ్రం విడి భాషలన్నది చారిత్రక ఆధారాలు కూడా నిరూపిస్తాయి. వాటిని పరిశీలిస్తే నిజాలు బయటపడతాయి.

'ఆంధ్ర' అన్న పదం 'ఐతరేయ బ్రాహ్మణం'లో కనిపిస్తుంది. అందులోని ఒక కథ ప్రకారం.. తన నూర్గురు కొడుకుల మీద కోపగించిన విశ్వామిత్రుడు వారిని ఇంట్లోంచి వెళ్లగొడతాడు. అప్పుడు ఉత్తర భారతం నుంచి వారిలో కొందరు దక్షిణ దిశకు పయనించి దండకారణ్యం గుండా వచ్చి కృష్ణా, గోదావరి నదీతీరాలలో స్థిరపడ్డారు. ఈ ప్రయాణంలో వారు కొద్దిగా ద్రవిడ భాషలోని పదాలు తీసుకుని తాము అప్పటిదాకా మాట్లాడిన సంస్కృత భాషతో కలిపి వాడటం మొదలుపెట్టారు. అందుకే ఆంధ్రావారి భాష పూర్తిగా సంస్కృత పద భూయిష్టమైంది. వ్యాకరణ రీతులు కూడా పూర్తిగా సంస్కృత వ్యాకరణంతో కలుస్తాయి. పైగా వారిది ఆర్య సంస్కృతి. త్రిలింగ దేశంగా పిలవబడిన తెలంగాణ ప్రాంతంలో వాడే భాష ద్రవిడ భాష అయిన తెలుగు. మూడు శైవక్షేత్రాల మధ్య (శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామం) ఉన్న ఈ భాష మాత్రమే తెలుగు. దీనిమీద సంస్కృత భాష ప్రభావం లేదు!

భరత ముని రచించిన 'నాట్యశాస్త్రం' (2 బీసీ)లో ఆంధ్రుల జాతి గురించిన ప్రస్తావనలో, వారి భాష 'ఆంధ్రం' అని ఉంది. తెలుగు అన్న పదం ఈ రచనలో గాని, ప్రాచీన వాఙ్మయంలో గాని, బౌద్ధ రచనలలో గాని, ప్రాచీన ప్రాకృత రచనలలో గాని కనపడదు. ఆంధ్ర ప్రాంతంవారి భాష 'ఆంధ్రం' అని ఆ ప్రాంతంలోని బౌద్ధ ఆరామాల్లో కనిపిస్తే, తెలంగాణలో జైన, బౌద్ధ, ఆరామాల్లో ఇక్కడి భాష 'తెలుగు' అని ఉంటుంది. ఈ మధ్య మెదక్‌లో దొరికిన 1300 ఏండ్ల కిందటి శాసనంలో తెలంగాణ పురం (ప్రస్తుత తెల్లాపూర్) అన్న ఊరు ప్రత్యేక దేశమైన త్రిలింగ దేశంలో ఉందని స్పష్టంగా ఉంది. కాబట్టి ఈ దేశాలు, భాషలు రెండూ మొదటినుంచీ వేరని తెలుస్తుంది.

ఇక యుగయుగాల చరిత్రలు చూద్దాం! త్రేతాయుగానికి చెందిన రామాయణంలో, ద్వాపరయుగానికి చెందిన మహాభారతంలో ఆంధ్రుల ప్రసక్తి ఉంది. రామాయణంలో సీతని వెతకటానికి వానరులను పంపిస్తూ దక్షిణ దిశలో ఉన్న కొన్ని దేశాలని వర్ణిస్తూ సుగ్రీవుడు ఆంధ్ర దేశం గురించి ప్రస్తావిస్తాడు. (కిష్కింధకాండ, 41 సర్గ, 12వ శ్లోకం). మహాభారతంలో వేదవ్యాసుడు కూడా సహదేవుడు ఆంధ్రులను చిత్తుగా ఓడించాడని రాశాడు.

ఆసక్తి కలిగించే విషయం ఏమిటంటే.. కురుక్షేత్ర యుద్ధంలో ఆంధ్రులు అధర్మపరుడైన దుర్యోధనుడిని సమర్థించి, కౌరవసేనలో ఉండి పాండవులకు వ్యతిరేకంగా యుద్ధం చేశారు. (బహుశా చంద్రబాబు అప్పుడు ఆంధ్రదేశానికి రాజై ఉంటాడు ఆ జన్మలో!) ఆంధ్రుల గురించి రాసిన తన సుదీర్ఘ వ్యాసంలో పెప్పర్ స్ప్రే వీరుడు లగడపాటి రాజగోపాల్ ఈ విషయం మాత్రం జాగ్రత్తగా దాచిపెట్టాడు.

రామాయణ, భారతాల్లోనే కాక, పురాణాల్లో, చరిత్రలో, సాహిత్యాల్లో, అన్నిచోట్ల ఆంధ్ర ప్రాంతంలో నివసించేవారిది ఆంధ్ర జాతి అని, వారు మాట్లాడేది ఆంధ్ర భాష అని ఉందే తప్ప, 'తెలుగు' అన్న పదం వారికి సంబంధించి ఎక్కడా లేదు. ప్రస్తుత తెలంగాణ ప్రాంతం ఆంధ్ర ప్రాంతంతో ఎప్పుడూ కలిసి లేదు. అంతేకాదు, ఆంధ్రవారి ఆదికవి నన్నయ కాలం నుంచీ తమది ఆంధ్ర భాషే అని రాశారు కవులు, సాహిత్యకారులంతా. 'వ్యాసరచిత భారతం నయం ఆంధ్ర భాషగా నొనర్చి జగతి బొగడుగతి నన్నపార్య, తిక్కనను, క్రితక్రతు శంభుదాసు నెర్రకవి దలతు భక్తి' అని వ్యాసకర్తలు కవిత్రయాన్ని పొగిడారు. కవి నన్నెచోడుడు తన రచన 'కుమార సంభవం'లో ఈ రెండు భాషల భేదాన్ని చాలా స్పష్టంగా వివరించాడు. 'మును మార్గ కవిత లోకంబున నిల్పి ఆంధ్ర విషయంబన, దేశికవిత బుట్టించి తెనుగున' అని కవిత్వంలో కూడా ఈ భాషలు వేరని విశదీకరించాడాయన. కవిత్రయం వారి ఆంధ్ర భారతం తెలుగు బాగా వచ్చినవారికి కూడా అర్థం కాదు, దివాకర్ల వెంకటావధాని గారు దిగివచ్చి వివరిస్తే తప్ప! అదే పోతన 'భాగవతం' గాని, పాల్కురికి సోమన 'బసవ పురాణం' గాని ఎంతో సులభంగా అర్థమవుతాయి. కవిత్రయం కూడా తాము వ్యాసభారతాన్ని 'ఆంధ్రీకరించామని' అన్నారే కానీ, 'తెలుగీకరించామని' అనలేదు. అది ఆంధ్ర మహాభారతంగానూ, పోతనది తెలుగు భాగవతంగానూ మొదటినుంచీ అందరూ గుర్తించారు. నన్నయ ఆంధ్ర మహాభారతాన్ని రాయటాన్ని ప్రశంసిస్తూ తిక్కన ఇలా అన్నాడు. 'ఆంధ్ర కవితా విశారదుండు విద్యాదాయితుండొనరించె మహితాత్ముడు నన్నయభట్టు దక్షతన్' (విరాట పర్వం, 6వ పద్యం). అంతేకాదు, తాను కూడా ఆంధ్రుల కోసమే ఈ పని చేశానని చెప్పుకున్నాడు. 'కావున భారతామృతము కర్ణపుటంబుల నారగ్రోలి ఆంధ్రావళి మోదం బొరయునట్లు రచియించెదన్ కృతుల్' (విరాటపర్వం 30వ పద్యం). కవిత్రయంలో నన్నయ సగం రాసిన అరణ్యపర్వాన్ని పూర్తిచేసిన మూడోకవి ఎర్రన కూడా తన భాష ఆంధ్రమనే అన్నాడు కానీ, తెలుగు అని ఎక్కడా అనలేదు. 'శేషోన్నయం ఆంధ్ర భాషా సుజనోత్సవ మొప్పగ నిర్వచించెదన్' (నృసింహ పురాణం, 17వ పద్యం).

ఇక 20వ శతాబ్దంలో కూడా ఈ రెండు భాషలు వేరన్న భావమే కనిపిస్తుంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 150 ఏండ్లపైన కలిసి ఉన్న ఆంధ్రులు రాజకీయాలల్లో కూడా బాగానే పెత్తనం చేశారు. గుంటూరులో హైకోర్టు బ్రాంచ్ ఒకటి పెట్టినప్పుడు అక్కడి ఉద్యోగాల్లో ఒక తమిళుడిని నియమించారన్న కారణంతో ప్రత్యేక రాష్ట్ర పాట మొదలుపెట్టారు ఆంధ్ర రాజకీయ నాయకులు. తాము సగం మద్రాసు రాష్ట్రాన్ని ఆక్రమించటం, సంపద పోగు చేసుకోవటం బాగానే ఉంది.

ఆంధ్ర ప్రాంతంలో తమిళుడికి ఒకే ఒక్క ఉద్యోగం ఇవ్వటం మాత్రం నచ్చలేదు. అక్కడ భాష అడ్డం వచ్చింది. తమ స్వరాష్ట్రం కోసం 1911 నుంచీ నడిపిన సభలను కూడా 'ఆంధ్ర మహాసభలు' అన్నారే కానీ 'తెలుగు సభలు' అనలేదు. ఆఖరికి ఆదిలాబాద్‌లో నిర్వహించిన సభలో కూడా ఎక్కడా తాము తెలుగువారని చెప్పలేదు, ఆ పదమే వాడలేదు.


నిజానికి వారు దురాశతో మద్రాసు నగరం తమకు కావాలని అడగకపోతే 1952లో కాకుండా, ఎంతో ముందుగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడేది. కానీ, మద్రాసే తమ రాజధాని కావాలని పొట్టి శ్రీరాములును కూడా ఉద్యమంలో దింపి వాదించారు. తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాలనేటప్పటికీ ఆంధ్ర రాజకీయ నాయకుల కళ్లు సుసంపన్న హైదరాబాద్ మీద పడ్డాయి. నిజానికి పొట్టి శ్రీరాములుకు హైదరాబాద్ రాష్ట్రం ఎక్కడుందో కూడా తెలియదు.

నెల్లూరు జిల్లాలో పుట్టిన ఆయన మద్రాస్ కోసం పోరాడాడు. అయితే తర్వాత ఆంధ్ర నాయకులు ఆయన తెలుగు రాష్ట్రం కావాలన్నాడని, అన్నీ మార్చినట్టే, ఈ మాట చరిత్రలో ఇరికించారు. 1956 వరకు వచ్చిన వార్తా పత్రికలు ఆంధ్ర రాష్ట్రం కోసం జరిగిన పోరాటాన్ని గురించి రాశాయే గానీ, ఎక్కడా తెలుగు రాష్ట్రం అన్న మాటే లేదు. ప్రత్యేక రాష్ట్రమైన మూడేండ్లలోనే ఆర్థికంగా చతికిలపడ్డాక ఒకే వర్ణమాల ఉన్న తెలుగు, ఆంధ్రం ఒక్క భాషగా వాదించవచ్చని ఆంధ్ర రాజకీయ నాయకుల బుర్రలలో ఒక మెరుపు మెరిసింది. రెండు ప్రాంతాలను కలిపితే తెలంగాణకు వచ్చే నష్టాలను ఫజల్ అలీ కమిషన్ వివరంగా తన రిపోర్ట్‌లో ఇవ్వగానే ఖంగుతిన్న ఆంధ్ర రాజకీయ నాయకులు తెలుగు జపం మొదలుపెట్టారు. 1955లో విడుదలైన మాయాబజార్ సినిమాలో కూడా గోంగూరని 'ఆంధ్ర శాకం' అన్నారే కానీ తెలుగు పచ్చడి అనలేదు. ప్రపంచంలోనే సుసంపన్న దేశంగా వెలిగిన హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు ప్రజలు హఠాత్తుగా ఆంధ్రులకు సోదరులై పోయారు. ఈ ప్రాంతాలు ఒక రాష్ట్రంగా ఏర్పడాలనే వారి వాదనకు కారణం భాషా సారూప్యం కాదు, భావసమైక్యత అంతకంటే కాదు. శతాబ్దాల తరబడి చరిత్రలో వైవిధ్యం, సంస్కృతిలో వైరుధ్యం ఉన్నా, ఆంధ్రం, తెలుగు ఒకటే భాష అనీ, తాము సోదరులమనీ అబద్ధపు ప్రచారం మొదలుపెట్టారు. దక్షిణ భారతదేశం గురించి తెలియని నెహ్రూను మభ్యపెట్టి, నమ్మించి ఒకే రాష్ట్రంగా ఏర్పరచగలిగారు. కానీ, దురదృష్టమేమంటే తమ సహజ పెత్తందారీతత్వం, దోపిడి గుణం మానుకోలేకపోయారు. ఇక్కడ అప్పటిదాకా కన్నడిగులు, మరాఠీలు, తమిళులు, మలయాళీల వంటి దక్షిణదేశ ప్రజలే కాక, ఉత్తర భారతం నుంచి వచ్చిన మార్వాడీ, పంజాబీ, గుజరాతీ మొదలైన భాషల వారు కూడా నిజాం రాష్ట్రంలో కనీసం రెండు శతాబ్దాల నుంచీ నివసించారు. అయితే వారు తెలంగాణ సంస్కృతిలో భాగమయ్యారే కానీ, ఈ ప్రాంతీయులను వ్యతిరేకభావంతో చూడలేదు. అంతేకాదు, నిజాం రాష్ట్రంలో జీతాలు ఎక్కువగా ఉండటం, నిజాం సైన్యంలో పరదేశీయులు కూడా ఉండేవారు. ఇరాన్, ఇరాక్, ఆఫ్రికన్, మధ్య తూర్పు దేశాల నుంచి వచ్చినవారు కూడా ఇక్కడ స్థిరనివాసం ఏర్పర్చుకొని సంతోషంగా తెలంగాణ ప్రాంతీయులైపోయారు.



కనకదుర్గ దంటు
89772 43484

(ఇంకా ఉంది. మిగతా వ్యాసం సెప్టెంబర్ 30వ తేదీ నాటి 'చెలిమె' పేజీలో)



అయ్యా.. ఓ పారి అచ్చిపోరా!

అయ్యా....
మీరొత్తండ్లని కబురందగానే
మీ వొళ్ళులువకుండా ఉండేందుకు
మావోళ్ళు తెల్లారి తెల్లార్లకే రోడ్లు సగపెట్టింద్రు
మీ కళ్ళకానందంగా నదురియ్యడానికి
ఒక్క పూటల్నే చెట్లను పెంచింద్రు
మీరు మొక్కుకునే గుడి సుట్టూత
ఎలిగే కరెంటు దీపాల జిలుగులు సూత్తాంటే
నింగి నుండో సుక్కల మండెను దెచ్చి ఈడ అలికినట్టుంద్రు
తొవ్వ తొవ్వంతా శెత్తను దీశి ముగ్గులు పోశింద్రు
మీ పాణానికి ఎప్పుడు ఏ ఆపద యెట్లత్తదోనని
పెద్దాసుపత్రిల జేశినట్టే సకలం సవులతులు జేశింద్రు

గియన్ని ఆర్తల్లో ఇని జూశినంకా మాకాశబుట్టింది
అయ్యా... మీకు పున్నెముంటది బాంచన్
ఓ పారి మా గూడానికొచ్చిపోరాదుర్రి
గిట్లనన్నా...
మూరెడు మూరెడు గుంతలు పడి
బురద మళ్లైన మా రోడ్లు సక్కపడుతయేమో
మా ఇంట్లబుట్టినోళ్ళ లెక్కనే మమ్మంటుకునుండే మురుగు
కొన్ని దినాలన్నా మా నుంచి దూరమైతదేమో
యెన్నడెలుగని మా గూడెంలో ఈది దీపాలు
మీరొచ్చే పున్నాన తళుకు తళుకులాడుతాయేమో
కక్కుదేరుగుల్లకే మందుబిళ్ళల్లేక సచ్చిన మా సంటోల్లు
మీ పేరు మీదనన్నా నాలుగొద్దులెక్కువ బతుకుతరేమో
అయ్యా... మీరొత్తే మా గూడెంల
దసరా దీపాలి కలిపొచ్చినట్టే ఉంటది

మీకు పున్నెముంటది..
యాడాదికోపారన్నా మా గూడాలకొచ్చిపోంర్రి
ఎప్పుడు యే గాలికారిపోతయో తెల్వని
మా బతుకు దీపాంతలల్లా
మీ తీరుబడి యాత్రైనా...
మాకింత జీవ సమురైతదేమో....
మీకు పున్నెముంటది
అప్పుడప్పుడూ మా గూడాలపొంటి సూశిపోంర్రి బాంచెన్



దిలీప్.వి
84640 30808

తెలుగు భాషకు అమరకోశం

పోయిన ఆదివారం రాత్రి 11.24 నిమిషాలకు అమరేశం రాజేశ్వర శర్మ కన్నుమూశారన్న వార్త నా హృదయాన్ని కలచివేసింది. రాజేశ్వర శర్మ గారి శిష్యకోటిలో నేనొకన్ని. ఆయన తన దారిని తానే నిర్మించుకొని, నలుగురికి సాహిత్యంలో దారిచూపిన దారిదీపం. ఆ మహానుభావుడు సంస్కృత, తెలుగు సాహిత్య వ్యాకరణాల వెలుగులను సాహితీ నేల మీద ప్రసరించిన దినపతి.

నివాళి



గురువుగారు తరగతి గదిలో బాల వ్యాకరణం పుస్తకం చేతిలో లేకుండా గంగా ప్రవాహంలా పాఠం చెప్తుంటే ఒక్క సూత్రం ముక్కరాని నేను ఆయన బోధనా నదిలో మైమరిచి తడిచి ముద్దయ్యేవాన్ని. ఆయన వామనుడే గానీ వ్యాకరణం, పరిశోధనం, విమర్శనం, పాండిత్యంలో విశ్వరూపం చూపేవారు. ఆయన నాకొక గ్లామర్ హీరో. నేను ఆయనకు ఆవగింజంత సహాయ పడిన వాన్ని కాదు. సేవలు చేసినవాన్ని కాదు కానీ ఆయన పాడెను నా దుఃఖమే మోసింది. ఒక్కమారైనా పూలో, పండ్లో అర్పించలేక పోయాను కానీ నాలుగు గులాబీ పూలు అందరితో పాటు ఆయన పాదాల చెంత వేసిన దేహం నాది. నేను, రెంటాల, ఎస్వీ, మాలతి మరికొందరం ప్రియశిష్యులం. ఎంఏలో క్లాస్‌మేట్స్ అందరం సబ్జెక్ట్ టూర్లు వెళ్లినప్పుడు గోపాల కృష్ణారావు, ఇరివెంటి కృష్ణమూర్తి, అమరేశం రాజేశ్వర్మ శర్మ మా వెంట వచ్చేవారు. నేను పెద్ద గుడి గోపురం మీదికి పాకుతూ ఎక్కి సార్‌ను గట్టిగా పిలిస్తే అక్కడి నుంచి కింద పడిపోతానన్న ఆందోళనతో పిలిచిన మాటలు, చూపులు నాకెందుకో ఇప్పుడు జ్ఞాపకానికి వచ్చి కన్నీళ్లు తిరుగుతున్నాయి. గిరిజ సార్ కూతురు. నా క్లాస్‌మేట్. ఇప్పటికీ సార్‌కిచ్చిన గౌరవమే గిరిజకు ఇస్తూ వస్తున్నాను.

కామారెడ్డిలో సరస్వతి రాజలింగ సభాపతి గార్లకు 5.9.1930లో రాజేశ్వర శర్మ జన్మించారు. ఆయన భార్య పేరు నరసమాంబ. ఆయనకు సంతానం గిరిజ, ఉమాపతి రావు, వెంకటేశ్వరరావు, ప్రభాకరరావు, భారతి. రాజేశ్వర శర్మ గారి సహాధ్యాయి పోలా కృష్ణమూర్తి, ఆయన వల్లే నాకు ఏకాగ్రత అబ్బిందని చెప్పుకున్నారు. శర్మ గారి చదువు కామారెడ్డిలోని చిన్న మల్లారెడ్డి పాఠశాల నుంచి ప్రారంభమై ఉస్మానియా విశ్వవిద్యాలయం దాకా సాగింది. జటావల్లభ పురుషోత్తం, ఖండవల్లి లక్ష్మీరంజనం, దివాకర్ల వేంకటావధాని దాకా ఎందరెందరికో శిష్యరికం చేసి సంస్కృత, తెలుగు భాషలు నేర్చుకున్నారు.

కామారెడ్డి ప్రభుత్వోన్నత పాఠశాలలో ఆంధ్ర భాషోపాధ్యాయులుగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమై ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల దాకా ఆచార్యులుగా, డీన్‌గా, తెలుగు శాఖ అధ్యక్షులుగా వివిధ వృత్తిపరమైన పదవులు నిర్వహించారు. పదవీ విరమణ తర్వాత కూడా తొంభై నాలుగు సంవత్సరాలు వచ్చినా కూడా ఆంధ్ర దేశం నలుమూలల సంస్కృత, తెలుగు వ్యాకరణాలు బోధిస్తూనే పరలోకం వెళ్లిపోయారు.

రాజేశ్వర శర్మ గారి రచనలు ప్రధానంగా నన్నెచోడుని కవిత్వం, వేదం వెంకటరాయశాస్త్రి రూపక సమాలోచన, అహోబిల పండితీయాంధ్ర వివరణము, వైకృత చంద్రికాంధ్ర వివరణము, ఆంధ్ర వ్యాకరణ వికాసము, వేదం వెంకటరాయ శాస్త్రి వ్యాఖ్యానాలు, చరిత్ర పుటలు, శ్రీసాయి సచ్చరిత్ర ముక్తావళి గేయ ప్రబంధము, గజ్జెల విస్తరి, ఆత్మ నివేదనం ఆదిపర్వం, ఆత్మ నివేదనం ఉద్యోగ పర్వంతో పాటు అనేక అముద్రిత గ్రంథాలు ఐదు దాకా ఉన్నాయి. వివిధ పత్రికలలో మరెన్నో వ్యాసాలు వచ్చాయి. పోతన భాగవత పంచశతికీ, స్మారక సంచికకు సంపాదకులు. కామారెడ్డిలోని ప్రాచ్య విద్యా పరిషత్తు స్థాపకుడు.

చరిత్ర పుటలు గొప్ప పరిశోధనా గ్రంథం. మా నిజామాబాద్ జిల్లా గురించి ఆయన ఎంతో చెప్పేవారు. బోధన్, ఇందూరు ఎప్పటినుంచీ ఉన్న వో రాజేశ్వర శర్మ గ్రంథం ద్వారానే తెలుసుకున్నాను. క్రీ.పూ. ఒకటి రెండు దశాబ్దాల మధ్యకాలంలో జైన ముని రాసిన 'దనభత్తి' అనే ప్రాకృత గ్రంథంలో 'పొదనం'లో పోదనం-బోదనం-బోదన్‌గా మారిన తీరునూ ఋషభదేవుని రాజధాని బోధన్ అని రాజేశ్వర శర్మ గారు వ్యక్తీకరించినదే, పరిశోధించినదే ప్రథమ ప్రామాణికం. అలాగే ఇంద్రవర్మ నిర్మించిన నగరం ఇంద్రపురి. ఆ ఇంద్రపురే నేటి ఇందూరు అని మొట్టమొదట చెప్పినవాడు అమరేశం రాజేశ్వరశర్మ గారు.

రాజేశ్వరశర్మ తొలినాళ్ళ నుంచే గొప్ప పండితుడు, విమర్శకుడు. ఆయన రాసిన కుమార సంభవ కావ్యవిమర్శ ఓ విధంగా సిద్ధాంత గ్రంథంగానే చెప్పాలి. నన్నెచోడుని జాను తెనుగునూ ఆనాటి భాషా స్థితిగతులు షష్ట్యంతాల వంటివి ఎన్నో విషయాలను పరిశోధించి చూపారు. కుమార సంభవము ప్రథమ ప్రబంధం అన్నది కూడా శర్మ గారే. ఆరుద్ర గారు సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో అక్కడక్కడా తనకు ప్రామాణికం అనిపించినవి చెప్పాల్సి వస్తే రాజేశ్వర శర్మ గారినే ఉటంకించారు. ఆయన భాషా పాండిత్యానికీ, సాహిత్య విమర్శకు అహోబిల పండితీయాంధ్ర వివరణం గానీ గజ్జెల విస్తరిలోని పదౌచిత్యాలు నేడు భాషనభ్యసించే వారికి మణిపూసలే.

రాజేశ్వర శర్మ గారి 'ఆంధ్ర వ్యాకరణ వికాసం' రెండు సంపుటాలుగా ప్రచురితమైన ఉస్మానియా నుంచి వచ్చిన వ్యాకరణ సిద్ధాంత గ్రంథాలలో ఇదే ప్రామాణికం నేటికి. ఆయన ఇంటిపేరు వ్యాకరణం అనిపించేటంతటి గొప్ప గ్రంథం ఇది. విరామనెరుగని వినూత్న కృషి ఇందులో ఉంది. ఆత్మ నివేదనం ఆయన ఆత్మకథ. దాన్ని రెండు భాగాలుగా ప్రచురించారు. ఆత్మ నివేదన ఆదిపర్వం. ఆత్మ నివేదన ఉద్యోగపర్వం రాసి వెళ్లిపోయారు. విశ్రాంతి పర్వం రాయవలసి ఉండె. ఆయన అధ్యయన, ఉద్యోగాల ప్రస్థానాలు నేటి తరానికి గొప్ప స్ఫూర్తినిస్తాయి. సాహిత్య సేద్యం చేసే వారికి ఆయన రచనలు వెన్నెముకగా నిలుస్తాయి.



డాక్టర్ నాళేశ్వరం శంకరం
94404 51960

అమ్మ నేర్పిన ఎదురీత!

నిజమే!
'గత కాలము కంటే వచ్చుకాలమే మేలు'
నిన్నటి గతం మానని పుండు
ఇయ్యాల్టి వర్తమానం
ఎగురుతున్న ఆత్మగౌరవ జెండా
రేపటి భవిష్యత్తు చెరగని చరిత్ర!

రెక్కలెట్లా తొడుక్కున్నానో
రివ్వున ఎట్లా ఎగిరి వచ్చానో
అన్ని దుఃఖనదుల్ని ఎట్లా ఈదుకొచ్చానో
ఏదీ గుర్తురావడం లేదు
ఒక్క విరామం లేని యుద్ధం చేయడం తప్ప!

ఎట్లా ఈ ఒడ్డును చేరుకోవాలనుకున్నానో
లేక ఎటు గాలొస్తే అటు
చెట్టును వీడిన ఆకై కొట్టుకొచ్చి
ఈ నగరం కాంక్రీటు అరణ్యానికి చిక్కుకున్నానో
ఏదీ తెలియడం లేదు
ఒక్క మొండి పట్టుదల తప్ప!

చీకటిని చీల్చుకుంటూ.. వెలుతురు పిట్టలు
నా భుజాల మీద ఎట్లా వాలినయో
అక్షరాల లాంతరొక్కటే
గుండెల నిండా
మినుకు మినుకుమంటున్న దోస్తీ

దాటివస్తున్న దారులు తప్ప
గట్టెక్కిన గండాలేవి జ్ఞాపకం రావడం లేదు
బహుశా ఇది మా అమ్మ నేర్పిన ఎదురీతై ఉంటది!

కుడుమంటే పండుగంటూ
దారినపోయే మనిషే సుట్టమైనట్టు
కలుపుగోలుతనం
కల్మషమంటని గుణం
ఎవరు ఎవరికి అరువిస్తారు
ఒక్క అమ్మ చనుబాల ధార తప్ప!

అచ్చం అమ్మలెక్కనే ఉన్నవంటరు
రూపాన్ని చూసి!
ఔను, అమ్మకు మరో రూపమే అంటరు
గుణాన్ని కూడా చూస్తే!

మడికట్ల జీవితాన్ని
లెక్కచేయని సాహసం
జొన్నకొయ్యల్ల కారే నెత్తురును
లెక్క చేయకుండా దాటే ధైర్యం
నాలో ఏనాడు నింపిందో
లోలోపలే ఆలోచిస్తూ...
ఇప్పుడు అమ్మ కడుపు పంటనై
లోకాన్ని చూస్తున్న...
అడుగులు తడబడినా సరే...
అమ్మ వైపు నడవడమే కదా
ఏ కన్న పేగుకైనా అసలైన గమ్యం!



డాక్టర్ పసునూరి రవీందర్
63030 08268

మరాఠీ, కన్నడతో పాటు మరికొన్ని భాషల్లో కూడా హరికథ ఉన్నా తెలుగు హరికథ పరిపుష్టమైనది. అవధానంలా తెలుగువారికి ప్రత్యేకమైనది. వాల్మీకి మహర్షి నేర్పిన రామాయణాన్ని తొలిసారి ఆయన ఆశ్రమంలోనే పాడిన లవకుశులదే మొదటి హరికథ అంటారు. అక్కడినుంచి ఒక ఆధ్యాత్మిక గంగా ప్రవాహంలా హరికథ కథలు కథలుగా కొనసాగింది.

హరికథకు కట్టిన 'కోట'

నివాళి



ఆధునిక కాలంలో హరికథను హిమాలయమంత ఎత్తుకు తీసుకెళ్లినవాడు ఆదిభట్ల నారాయణదాసు. హరికథా పితామహుడు అని లోకం ఆయన్ను వేనోళ్ల పొగిడింది. గొంతెత్తి పాడి ప్రపంచాన్ని ఇక్షు సాగరంలో ముంచి తేల్చిన గాయకుడు. గద్యం, పద్యం, శ్లోకం, జానపదం ఎలా పాడాలో తెలిసినవాడు. ఆశువుగా పద్యాలు, శ్లోకాలు అల్లి శ్రోతలను ఊపేసినవాడు. అసాధారణమైన జ్ఞాపకశక్తి ఉన్నవాడు. ధారణకు తోడు అమృతతుల్యమైన కవితా ధార ఉన్నవాడు. ఆయనను కేవలం హరికథకుడిగా చూస్తే తెలుగు సాహితీలోకం తనను తాను తక్కువ చేసుకున్నట్టే. ఇలాంటివాడొకడు ఉండేవాడా? అని ఆశ్చర్యపోవాల్సిన అద్భుతమైనవాడు ఆదిభట్ల. ఆయన చూపిన నవీన మార్గంలో నడుస్తూ... హరికథాగానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారు కోట సచ్చిదానంద శాస్త్రి (1934-2024).

సంగీత నాటక అకాడెమీ అవార్డు, ఆదిభట్ల నారాయణదాసు పురస్కారం, హంస అవార్డు మొదలు పద్మశ్రీ అవార్డు దాకా ఎన్నెన్నో అవార్డులు పొందిన కోట సచ్చిదానంద శాస్త్రి దేశ, విదేశాల్లో దాదాపు ఇరవై వేలకు పైగా హరికథలు చెప్పారు. ఇప్పుడంటే లెక్కలేనన్ని సాంకేతిక వెసులుబాట్లు. వెనుక ఎల్ఈడీ స్క్రీన్‌లో దూరం నుంచి అందరికీ స్పష్టంగా కనపడటానికి వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు. ఇవేమీ లేని రోజుల్లో వందల, వేల మంది కళ్లప్పగించి చూసేలా, చెవులప్పగించి వినేలా కోట ఎలా హరికథలు చెప్పారన్నది తెలుసుకోవాల్సిన విషయం. సంగీత, సాహిత్య, నృత్యాభినయాల సమాహారం హరికథ. అవధానిలా పద్యాలు, పాటలు జ్ఞాపకం ఉంచుకోవాలి. గాయకుడిలా రాగయుక్తంగా పాడాలి. నృత్యకారుడిగా కాళ్లు, చేతులు కదిపి నాట్యం చేయాలి. నటుడిలా మొహంలో సందర్భానికి తగినట్లు అభినయించాలి. ప్రవచనకర్తలా వ్యాఖ్యానం చెప్పాలి. సాధారణ శ్రోతలకు విసుగు పుట్టకుండా పిట్టకథలు చెప్పాలి. అవసరమైతే సందర్భానికి తగిన సినిమా పాటలు పాడాలి. సమకాలీన అంశాలతో ముడిపెట్టి ఆధ్యాత్మిక విషయాలు చెప్పాలి. ఏక కాలంలో హరికథకుడు ఇన్ని అవతారాలు ఎత్తాలి. ఇలా అన్ని అవతారాలెత్తిన హరికథకుడు కోటకు పద్మశ్రీ ఇచ్చి గౌరవించింది కేంద్ర ప్రభుత్వం.

1960-80ల మధ్య కోట హరికథ ఒక జైత్రయాత్రలా సాగింది. హరికథల్లో సినిమా పాటలు పాడటం, స్థానిక విషయాలను ప్రస్తావించడం మీద సంప్రదాయవాదులు వ్యతిరేకించినా ఆయన లెక్క చేయలేదు. పొలంలో పని చేసుకునే సామాన్యుల ముందు అద్వైతం, విశిష్టాద్వైతం, తాత్విక రహస్యాల గురించి చెప్పడానికి బదులు వారి స్థాయికి దిగి... వారికి తెలిసిన పరిభాషలోనే, వారికి తెలిసిన పోలికలు, ప్రతీకలతోనే హరికథ చెప్పడం నా పద్ధతి అని ఆయన అనేక సందర్భాల్లో స్పష్టంగా చెప్పారు.

ఏ కళ అయినా సమకాలీన వాతావరణానికి, కొత్త తరం అభిరుచులకు అనుగుణంగా మలచకపోతే మనుగడలో ఉండదన్న సత్యాన్ని గ్రహించి, సంప్రదాయ హరికథకు కొత్త మెరుగులు దిద్దినవాడు కోట సచ్చిదానంద శాస్త్రి.



పమిడికాల్వ మధుసూదన్
99890 90018

(సెప్టెంబర్ 16న కన్నుమూసిన కోట సచ్చిదానంద శాస్త్రికి నివాళిగా)

సాహితీ పురస్కారాలు

ప్రకటన

'శిఖామణి జీవన సాఫల్య కవితా పురస్కారం-2024'కు గాను వాడ్రేవు చిన వీర భద్రుడు, 'శిఖామణి యువ కవితా పురస్కారం-2024'కు గాను పాయల మురళీ కృష్ణ ఎంపికయ్యారు. జీవన సాఫల్య పురస్కారానికి రూ.10 వేలు, యువ కవితా పురస్కారానికి రూ.5 వేల నగదు, శాలువా, జ్ఞాపికలతో సత్కారం ఉంటుంది. వీటితో పాటు కవి సంధ్య ప్రతిభా పురస్కారాల ప్రదానం, గ్రంథావిష్కరణలు ఉంటాయి. పురస్కారాల ప్రదాన సభ అక్టోబర్ చివరి వారంలో యానాంలో జరుగుతుంది.

- దాట్ల దేవదానం రాజు, అధ్యక్షులు, పురస్కారాల కమిటీ

జంక్షన్.. టెన్షన్!

- చౌటుప్పల్‌లోనూ 'ట్రిపుల్ ఆర్' భూ మాయ!
- జంక్షన్ విస్తరణతో 2.5రెట్లు పెరిగిన భూసేకరణ
- గతంలో 78 ఎకరాలు.. ఇప్పుడు 181 ఎకరాలు!
- మాల్స్, మల్టీప్లెక్స్‌ల కోసం పేదల భూములకు ఎసరు
- చౌటుప్పల్ జంక్షన్ విస్తరణపై ప్రభుత్వ పెద్దల మౌనం
- సీఎంకే తెలుసు.. ఆయననే అడగాలన్న మంత్రి కోమటిరెడ్డి
- తనకేమీ తెలియదని ఎమ్మెల్యే రాజగోపాల్ దాటవేత
- అలైన్‌మెంట్ మార్పుతో రెండుగా చీలనున్న చౌటుప్పల్
- విస్తరణ వద్దని ముక్తకంఠంతో భూబాధితుల డిమాండ్

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టాలని చూస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో రోజుకో కొత్త కోణం వెలుగు చూస్తున్నది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన అలైన్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తమకు అనుకూలంగా అటు ఇటు మార్చుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వద్ద ఉత్తర-దక్షిణ భాగాలు కలిపేచోట ట్రిపుల్ ఆర్ జంక్షన్‌ను ప్రతిపాదించడం కలకలం రేపుతున్నది. ఇక్కడ జంక్షన్ విస్తరణ ఏరియా ఉన్నట్టుండి రెండున్నర రెట్లకు పెరగడం గమనార్హం. ఫలితంగా ఇప్పటికే కోట్లల్లో విలువ చేసే వ్యవసాయ భూములతోపాటు లక్షల విలువైన ప్లాట్లు, ఇండ్లు పోనున్నాయి. దీంతో ఈ ప్రాంత రైతులు, సామాన్య ప్రజలు రెండు నెలలుగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. జిల్లా మంత్రితోపాటు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ ఇలా ఎవరు కనిపిస్తేవారిని తమను కాపాడాలంటూ వేడుకుంటున్నారు. వీరి ఆవేదనకు, ఆక్రోశానికి పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వ పెద్దలు మౌనం వహిస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తున్నది.

చౌటుప్పల్ పట్టణానికి ఆనుకుని తూర్పు వైపున హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై రీజినల్ రింగ్ రోడ్డులో ఉత్తర, దక్షిణ భాగాలు కలిపే జంక్షన్‌ను ప్రతిపాదించారు. దాదాపు ఈ జంక్షన్ చౌటుప్పల్ మున్సిపాలిటీ మధ్యలోనే ఏర్పాటు కానుంది. గతంలో ఉత్తర భాగం అలైన్‌మెంట్ ఖరారు చేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఇక్కడ జంక్షన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దక్షిణభాగం అలైన్‌మెంట్‌ను ఈ జంక్షన్‌కు అనుసంధానం చేస్తూ ముందుకు కొనసాగించనున్నారు. అయితే ఈ సమయంలో ఇక్కడ వాహనాల ఇంటర్ చేంజ్ వ్యవస్థ కోసం, సర్వీసు రోడ్లు తదితర అవసరాల కోసం 78 ఎకరాల భూసేకరణ అవసరం అవుతుందని ప్రకటించింది. ఆ ప్రకారమే క్షేత్రస్థాయిలో అప్పట్లోనే సర్వేబృందాలు మార్కింగ్ కూడా చేసి స్థానికులకు స్పష్టతనిచ్చాయి. దీనివల్ల కొంతమొత్తంలో వ్యవసాయ భూములతోపాటు మున్సిపాలిటీ పరిధిలోని ప్లాట్లు, ఇండ్లు కూడా పోతున్నాయి. ఇందులో



భూములు, ప్లాట్లు పోతున్న వారిలో కొంత మంది ముందే ప్రతిపాదిత జంక్షన్ ఏరియా దాటి ఇండ్ల కోసం ప్లాట్లు కొనుగోలు చేయడం, వాటిల్లో తిరిగి ఇండ్ల నిర్మాణాలను మొదలు పెట్టడం చేశారు. కానీ ఉన్నట్టుండి ఈ జంక్షన్ ఏరియా రెండింతలకు పైగా పెరగడంతో తీవ్ర అలజడి మొదలైంది. దీనివల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ కూడా రెండుగా చీలిపోనున్నది. 1,2,3 వార్డుల పరిధిలోని లింగారెడ్డిగూడెం, తాళ్లసింగారం, లింగోజిగూడెం ట్రిపుల్ ఆర్‌కు మరోవైపు విడిపోనున్నాయి.

181 ఎకరాలకు పెరిగిన విస్తరణ

చౌటుప్పల్ వద్ద తలపెట్టిన జంక్షన్ విస్తరణ ఉన్నట్టుండి భారీగా పెరిగింది. వచ్చే 50 ఏండ్ల అవసరాలను దృష్టి పెట్టుకుని ఈ జంక్షన్ వద్ద అత్యాధునిక వసతులతో కూడిన మల్టీప్లెక్స్‌లు, హోటళ్లు, టెర్మినల్స్ లాంటివి నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. అందు కోసం ఇప్పుడే భూసేకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో రెండేండ్ల కిందటే ఇక్కడ ఓఆర్ఆర్ తరహాలోనే ఇంటర్ చేంజ్ వ్యవస్థ కోసం 78 ఎకరాల భూమి అవసరమవుతుందని గుర్తించారు. దీనికి సంబంధించిన క్షేత్రస్థాయిలో భూసర్వే పూర్తి చేసి మార్కింగ్ కూడా చేశారు. తాజాగా దక్షిణ భాగం రింగ్‌రోడ్డును నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న

భావిస్తూ ఆ మేరకు అలైన్‌మెంట్‌లో సైతం జోక్యం చేసుకుంటున్న విషయం తెలిసిందే. దక్షిణభాగంలో గతంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన అలైన్‌మెంట్‌ను కాదని రాష్ట్ర ప్రభుత్వ 'సొంత' అవసరాల పేరిట అటుఇటు మార్పులకు సిద్ధపడింది. అందులో భాగమే చౌటుప్పల్ వద్ద జంక్షన్ విస్తరణ కూడా అన్న చర్చ సాగుతున్నది. జంక్షన్ విస్తరణ ఏరియాను పెంచడం వల్ల కోల్పోతున్న వ్యవసాయ భూములు, ప్లాట్ల సంఖ్య భారీగా పెరుగుతున్నది.

పెద్దోళ్ల కోసం పేదోళ్లను బలిపెడతారా?

విజయవాడ-హైదరాబాద్ హైవేపై ప్రయాణించేవాళ్ల విందులు, వినోదాల కోసం తమ భూములు లాక్కోవడం ఏమిటని స్థానిక రైతులు, ప్లాట్ల యజమానులు ప్రశ్నిస్తున్నారు. జంక్షన్ అంటే వాహనాల ఇంటర్ చేంజ్, టోల్ ప్లాజాల లాంటివి సర్వసాధారణం. కానీ ట్రిపుల్ ఆర్‌లో ఇతర జంక్షన్ల వద్ద ఎక్కడా లేని విధంగా హోటళ్లు, టూరిజం ప్లాజాలు, టెర్మినల్స్, మల్టీప్లెక్స్‌ల్లాంటి అదనపు సౌకర్యాల కోసం ఒక్కసారిగా 181 ఎకరాలకు జంక్షన్ ఏరియాను పెంచడం ఎంతవరకు సబబు అని వారు నిలదీస్తున్నారు. ఏపీ ప్రయాణికుల ఆనందం కోసం తమను బలిచేయడం సరికాదంటున్నారు. దశాబ్దాల తరబడి భూములనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, అలాంటి భూములను ఎవరి సౌకర్యాల కోసమో లాక్కోవడం ప్రభుత్వ పెద్దలకు సరికాదని వారు చెప్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇప్పటి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి లాంటి వారంతా అలైన్‌మెంట్‌లో పోతున్న భూముల విస్తీర్ణం మరింత తక్కువగా ఉండేలా చూస్తామని, ఆ భూములకు కూడా బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇప్పిస్తామని నమ్మబలికారని బాధిత రైతులు చెప్తున్నారు. ఇప్పుడు కొత్త అలైన్‌మెంట్ పేరుతో రెండున్నరరెట్లు ఎక్కువగా భూములను లాక్కుంటున్నారని, దీనిపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక మొహం చాటేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

పూర్తిగా భూములు కోల్పోతున్న కుటుంబాలెన్నో

హైవేకు దక్షిణభాగంలో జంక్షన్ పరిధిని పెంచడం వల్ల తంగడపల్లికి చెందిన జాల అనే ఇంటి పేరు కలిగిన యాదవ కుటుంబాలకు చెందిన వ్యవసాయ భూమి ముప్పావు వంతు కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. జాల కుటుంబంలో పూర్వీకుల నుంచి వస్తున్న వారసత్వ భూమి 110 ఎకరాల ఉండగా దీని ఆధారంగా ప్రస్తుతం 35 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గతంలో 2009లో హైవే విస్తరణలో కొంత భూమిని వీరు కోల్పోయారు. గతేడాది కిందట సోలార్ పవర్, దివీస్ ల్యాబ్, ఏపూరు వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు టవర్ల కోసం వీళ్లే మరికొంత భూమిని కోల్పోయారు. 'పాత అలైన్‌మెంట్ ప్రకారం 35 ఎకరాల వరకు భూమి పోతుండె. సగం పోయినా.. సగం భూమైనా మిగులుతుందని అనుకున్నం. కానీ జంక్షన్ పరిధి పెంచడంతో కొత్త మార్కింగ్‌లను బట్టిచూస్తే సుమారు 80 ఎకరాల వరకు భూమి పోతున్నది. జాల ఇంటిపేరున్నవారిలో సగం కుటుంబాలకు చెందిన భూమి మొత్తం ఇందులోనే పోతున్నది' అని జాల శ్రీశైలం వాపోయారు. ఇక్కడ ఎకరం భూమి రూ.3 కోట్ల నుంచి 4కోట్ల వరకు ఉన్నదని, ప్రభుత్వం రూ.35లక్షలు ఇస్తే ఎట్లా అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఒక్క ఎకరం డబ్బులు పెడితే ఇదే చౌటుప్పల్‌లో 150 గజాల ప్లాటు కూడా వచ్చే పరిస్థితి లేదని జాల అంజయ్య ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా జాల వారి కుటుంబంలో ప్రతిఒక్కరూ జంక్షన్ విస్తరణ బాధితులే కావడం గమనార్హం. కొద్ది కాలంగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని పలువురు ప్లాట్ల యజమానులు కంటతడి పెట్టారు. పాత ప్లాన్ ప్రకారం 78 ఎకరాల్లోనే జంక్షన్ నిర్మాణం చేపడితే బాధితుల సంఖ్య తగ్గి, వారికి కొంత భూమైనా మిగులుతుందని వారు వాపోతున్నారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ తీరుపై ఆగ్రహం

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ట్రిపుల్‌ఆర్ ఉత్తరభాగం అలైన్‌మెంట్, సర్వే సమయంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గత ప్రభుత్వంపై ఒంటికాలిపై లేచేవారు. రాయగిరి ప్రాంతంలో రైతులు ఆందోళన చేస్తుంటే వెళ్లి మరీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అలైన్‌మెంట్ మార్చడంతోపాటు బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇస్తామని నమ్మబలికారు. కానీ నేడు రాయగిరి రైతులకు ఆయన ముఖం చాటేశారు. తీరా ఇప్పుడు ఆయన మంత్రిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమే 'సొంత' అవసరాల పేరు ట్రిపుల్ ఆర్ సౌత్‌లో అలైన్‌మెంట్ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో చౌటుప్పల్ జంక్షన్ విస్తరణ బాధితులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని పలుమార్లు కలిసే ప్రయత్నం చేశారు. ఓసారి నల్లగొండలో, పలుమార్లు హైదరాబాద్‌లోని ఇంటికి వెళ్తే గంటలకొద్దీ వేచి ఉన్నా కనీసం కన్నెత్తి చూడలేదని బాధితులు వాపోతున్నారు. ఒకసారి ఆయన చౌటుప్పల్ మీదుగా వెళ్తున్నప్పుడు దారి మధ్యలో కలిశామని వారు చెప్పారు. 'ట్రిపుల్ ఆర్ అంతా సీఎం రేవంత్‌రెడ్డే చూస్తున్నడు. నాకేం తెల్వదు. మీకు కావాలంటే ఆయననే కలవండి' అంటూ ఆగకుండా వెళ్లిపోయాడని బాధితులు వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని పలుమార్లు కలిసిన బాధితులకు నిరాశే ఎదురైంది. 'అలైన్‌మెంట్‌లో మార్చడం మన చేతుల్లో ఉండదు. మార్చేందుకు నేనేమో మంత్రిని కాదు. కలెక్టర్‌కు చెప్పి కేంద్రానికి లేఖ రాపిద్దాం. బహిరంగ మార్కెట్ రేట్ కోసం నా వంతు ప్రయత్నం చేస్తా' అంటూ కలెక్టర్‌కు ఫోన్ చేసి చేశారని బాధితులు చెప్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ముఖ్య నేతలు ఓట్ల కోసం ఎకరానికి కోటి రూపాయల వరకు పరిహారం ఇస్తామని కూడా చెప్పినట్టు ట్రిపుల్‌ఆర్ బాధితులు గుర్తు చేస్తున్నారు. కానీ ఇప్పుడు ఎవరూ తమ గోడును వినిపించుకోవడం లేదని వారు కన్నీరుమున్నీరవుతున్నారు.

చౌటుప్పల్ పోరాటంపై వామపక్షాల మౌనం

పేదల పక్షాన నిలుస్తాయని కొంతలో కొంత వామపక్షాలకు పేరుండేది. కానీ రేవంత్‌రెడ్డి పాలనలో వారి వైఖరి కూడా మారింది. ప్రజాపోరాటాల పక్కకు వెళ్లిపోయాయి. ఒకనాడు ప్రపంచబ్యాంకుపై యుద్ధం చేసిన వామపక్షం.. ఇప్పుడు ముఖ్యమంత్రి అదే పాట పాడినా కనీసం వ్యతిరేకించడం లేదు. అలాగే చౌటుప్పల్ రైతులను బజారుపాలు చేస్తున్న జంక్షన్ విస్తీర్ణం మార్పుపైనా వారు పెదవి విప్పడం లేదు. శనివారం ఏదో సంఘీభావ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరిన సీపీఎం నేతలు.. తర్వాత ఆయనను కలిశారు. చౌటుప్పల్ భూబాధితుల సమస్యను ప్రస్తావించారు. 'నిర్ణయం జరిగిపోయింది. ఇప్పుడు వెనక్కి పోలేం. కావాలంటే రైతులకు పరిహారాన్ని పెంచే అంశాన్ని పరిశీలిస్తాం' అని సీఎం రేవంత్ సమాధానమిచ్చారట. ఆ తర్వాత కూడా వారి నుంచి నిరసన స్వరం వినిపించలేదు. కార్యాచరణ ఏదీ ప్రకటించలేదు. ఎప్పటిలాగే వామపక్షం మౌనంగానే ఉండిపోయింది.

హైవేకు ఇరువైపులా 1350 మీటర్ల చొప్పన..

తాజా మార్పులు చేర్పుల తర్వాత చౌటుప్పల్ జంక్షన్‌ను హైవేకు ఇరువైపులా 1,350 మీటర్ల పొడవునా 'డంబెల్' ఆకారంలో నిర్మాణం కానున్నది. దీనివల్ల రెండువైపులా కలిపి అదనంగా రైతుల నుంచి 103 ఎకరాల భూమిని సేకరించాల్సి వస్తున్నది. ఫలితంగా భూబాధితుల సంఖ్య భారీగా పెరుగుతున్నది. రెండు నెలల కిందట గుట్టుచప్పుడు కాకుండా సర్వేకు ప్రభుత్వం ఆదేశించింది. సర్వే బృందాలు భూ యజమానులతో సంబంధం లేకుండా మార్కింగ్ చేయడం మొదలుపెట్టాయి. తంగడపల్లి శివారులోని వ్యవసాయ భూముల్లో కొత్తగా సర్వే చేస్తున్న విషయం తెలుసుకున్న రైతులు.. వారిని అడ్డుకున్నారు. ఆ తర్వాత పోలీసు బృందాలను వెంటేసుకుని రైతులను బలవంతంగా అక్కడి నుంచి తరలించి సర్వేను కొనసాగించడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పాత అలైన్‌మెంట్ ప్రకారం భూములు తీసుకుంటే తమ భూముల్లో కొంతైనా మిగిలేదన్నది రైతుల వాదన. కొత్త అలైన్‌మెంట్, జంక్షన్ విస్తరణ వల్ల తమకున్న భూములు, ప్లాట్లన్నీ ఇందులోనే పోతున్నాయని రైతులు వాపోతున్నారు. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న భూములే తమకు జీవనాధారమని, ఉన్న భూమంతా జంక్షన్ పేరుతో లాక్కుంటే తామెలా బతకాలని వారు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నిత్యం ఆందోళన పథం

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో జంక్షన్ పరిధి పెంచడంతో ప్లాట్లు, ఇండ్లు, వ్యవసాయ భూములు కోల్పోతున్న నిర్వాసితులంతా గత కొద్ది రోజులుగా ఆందోళనలు, ధర్నాలు చేస్తున్నారు. పార్టీలకు అతీతంగా అఖిలపక్షంగా ఏర్పడి నిరసనకు దిగారు. పలుమార్లు జంక్షన్ ఏరియాతో పాటు చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపట్టారు. భువనగిరి కలెక్టరేట్ ఎదుట కూడా ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కూడా బాధితుల తరపున కలెక్టర్‌ను కలిశారు. ఈ క్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, స్థానిక ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని సైతం బాధితులు పలుమార్లు కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అయినా ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న మంత్రి వెంకట్‌రెడ్డి లాంటి పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

తొలగిన 'గాంధీ' ముసుగు

- సీఎల్పీ సమావేశానికి ఫిరాయింపు ఎమ్మెల్యేలు
- ఇప్పుడేమంటారని బీఆర్ఎస్ నిలదీత
- సీఎంను కలిసేందుకేనన్న మంత్రి శ్రీధర్‌బాబు
- ఇంకా బుకాయించొద్దని మాజీ మంత్రి హరీశ్ ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అంతర్గత సమావేశం సాక్షిగా ఆ పార్టీ నేతలు చెప్తున్నవన్నీ శుద్ధపూస మాటలని,ఆడుతున్నవన్నీ నాటకాలేనని తేలిపోయింది. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహా ప్రకాశ్‌గౌడ్, దానం నాగేందర్, కడియం శ్రీహరి కప్పుకొన్న ముసుగు తొలగిపోయింది. న్యాయ స్థానాల నుంచి, శాసనసభ నిబంధనల నుంచి తప్పించుకునేందుకే వీళ్లు నాటకాలాడుతున్నారని స్పష్టమైంది. ఆదివారం సీఎల్పీ (కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ) సమావేశానికి ఫిరాయింపు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వీళ్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే అయితే సీఎల్పీ సమావేశానికి ఎలా హాజరయ్యారన్న ప్రశ్న తలెత్తుతున్నది. కారు గుర్తుపై గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలకు సీఎల్పీ సమావేశంలో చోటు కల్పించడంపై రాజకీయ ప్రముఖులే ముక్కున వేలేసుకుంటున్నారు. శేరిలింగంపల్లి నుంచి కారు గుర్తుపై గెలిచిన అరికెపూడి గాంధీ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరటం, ఆయనను పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ సర్కార్ నియమించడం తెలిసిందే. ఇది దుష్ట సంప్రదాయమని, ఆనవాయితీ ప్రకారం పీఏసీ చైర్మన్ పదవి ప్రతిపక్ష సభ్యుడికే ఇవ్వాలని బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తున్నది. గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా తన ఇంటికి వస్తే భోజనం పెట్టి కేసీఆర్ వద్దకు తీసుకెళ్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చెప్పటం, అనంతరం గాంధీ రౌడీ మూకను వెంటేసుకొని కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనపై హత్యాయత్నం చేయటం తెలిసిందే. శనివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన పీఏసీ తొలి సమావేశంలోనూ బీఆర్ఎస్ సభ్యులు ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. శాసనసభ సంప్రదాయాలకు, నిబంధనలకు విరుద్ధం గా చైర్మన్ ఎంపికతో పాటు, కమిటీ కూర్పు కూడా అభ్యంతరకరంగా ఉన్నదని నిలదీశారు. అప్పుడు కూడా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పీకర్ నిర్ణయాన్ని వెనకేసుకొచ్చారు. అరికెపూడి గాంధీ ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నారని, ఆయనకు కాంగ్రెస్ పార్టీకి సంబంధంలేదని శ్రీధర్‌బాబు మరోమారు చెప్పుకొచ్చారు. గాంధీ సీఎల్పీ సమావేశాలకు హాజరు కావటం బట్టి చూస్తే.. ఆయన కాంగ్రెస్‌లోనే ఉన్నాడని మరోసారి రుజువైందని, అధికార పార్టీ కండువా కప్పుకొన్న వ్యక్తి, ప్రతిపక్ష సభ్యుడినని చెప్పుకొని పీఏసీ చైర్మన్ పదవి తీసుకోవటం గౌరవ శాసన సభను మోసం చేయటమేనని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కలిసి శాసనసభకు తప్పుడు సమాచారం ఇచ్చి, స్పీకర్‌ను తప్పుదోవ పట్టించారని స్పష్టంచేస్తున్నారు. స్పీకర్‌కు, ఉన్నత న్యాయస్థానానికి తప్పుడు సమాచారమిచ్చిన వారిపై వెంటనే అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు అరికేపూడి గాంధీ సీఎల్పీ సమావేశానికి హాజరైన వీడియోను మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా పోస్ట్ చేయటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మర్యాదపూర్వకంగా కలిసిండు : శ్రీధర్‌బాబు

సీఎల్పీ మీటింగ్ జరిగిన హోటల్ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనే ఉన్నదని, సీఎంను మర్యాదపూర్వకంగా కలిసేందుకు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వచ్చారని, సీఎల్పీ మీటింగ్‌కు రాలేదని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన నియోజకవర్గానికి సీఎం వచ్చినప్పుడు శాసనభ్యుడు కలిస్తే తప్పా? అని ప్రశ్నించారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలపైనా శ్రీధర్‌బాబు ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'సిద్దిపేటకు ముఖ్యమంత్రి వస్తే హరీశ్‌రావు వెళ్లే ప్రయత్నం చేయరా? అని ప్రశ్నించారు.

ఇది పరమ అమర్యాద : హరీశ్ ఎద్దేవా

'పిల్లి కండ్లు మూసుకొని పాలు తాగిన ట్టుగా మంత్రి శ్రీధర్‌బాబు వైఖరి ఉన్నది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవాచేశారు. సీఎల్పీ సమావేశానికి ఫిరాయింపు ఎమ్మెల్యేల హాజరుపై కాంగ్రెస్ బుకాయించడం తగదని ఆదివారం ఎక్స్ వేదికగా హితవుపలికారు. 'బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ కండువా కప్పి దేవుడి కండువా అని బుకాయిస్తారు. సీఎల్పీ సమావేశానికి హాజరైతే మర్యాదపూర్వక కలయిక అంటారు. ఎమ్మెల్యేలు కడియం నుంచి అరికెపూడి దాకా కాంగ్రెస్ ఎల్పీ మీటింగ్‌కు హాజరైతే అది మర్యాద కాదు.. పరమ అమర్యాద అవుతుంది శ్రీధర్‌బాబు గారు.. ఈ చిన్న లాజిక్ మిస్ అయిపోయారు మీరు. నా నియోజకవర్గానికి ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా వస్తే కలుస్తానేమో.. కానీ ఎల్పీ మీటింగ్‌కు వస్తే కలవను కదా? కలవకూడదు కదా? ఒక పార్టీ ఎమ్మెల్యే మరో పార్టీ ఎల్పీ సమావేశానికి ఎట్లా హాజరవుతాడు?' అని నిలదీశారు.

రైతు మెడకు.. ట్రిపుల్ ఆర్ మెలిక

- ప్రజెంటేషన్‌లో ఉన్నట్టు ప్రదేశంలో లేదు
- శివన్నగూడెం వరకు 2-4 కిలోమీటర్ల దూరం
- కొత్త మ్యాపులో లేకున్నా క్షేత్రస్థాయిలో మార్క్

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 22 (నమస్తే తెలంగాణ): ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మెలికలు తిరుగుతూనే ఉన్నది. మ్యాపుల్లో లేకున్నా క్షేత్రస్థాయిలో మాత్రం 'గుర్తులు' వెలుస్తున్నాయి. తాజాగా చౌటుప్పల్ పరిధిలో నుంచి నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెం వరకు ఏకంగా 2-4 కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్ బయటికి జరుగుతున్నట్టు తెలిసింది. కొన్నిరోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి ఎదుట అధికారులు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో కొత్త అలైన్‌మెంట్‌ను ప్రదర్శించిన విషయం తెలిసిందే. ఈ ప్రజెంటేషన్‌లో చౌటుప్పల్ పరిధిలో పెద్దగా మార్పు కనిపించలేదు. కల్వకుర్తి నియోజకవర్గంతోపాటు చేవెళ్ల, వికారాబాద్ పరిధిల్లోనే భారీ ఎత్తున మార్పులు చేశారు. అయితే నాలుగైదు రోజులుగా చౌటుప్పల్ పరిధిలోనూ పాత అలైన్‌మెంట్‌లో మార్పుల దిశగా ముమ్మర సర్వే కొనసాగుతున్నట్టు తెలిసింది. ఈ మార్పు సీఎం రేవంత్ ఎదుట ప్రదర్శించిన పీపీటీలో లేదు. అంటే ప్రజెంటేషన్ తర్వాత కూడా మార్పుల ప్రక్రియ కొనసాగుతున్నట్టు స్పష్టమవుతున్నది. మూడు రోజుల కిందట ప్రజల ముందే ట్రిపుల్ ఆర్ సర్వే జరిగిన దృశ్యాలు మీడియాలో కూడా వచ్చాయి. ముఖ్యంగా చౌటుప్పల్ నుంచి సంస్థాన్ నారాయణపురం, జనగామ ఆపై పుట్టపాక అటునుంచి శివన్నగూడెం వరకు ఒక్కోచోట ఒకలా సగటున 2



నుంచి 4 కిలోమీటర్ల వరకు అలైన్‌మెంట్‌ను బయటికి జరుపుతున్నట్టు తెలిసింది. ఆపై భట్లపల్లి వరకు యథావిధిగా కొనసాగించి తర్వాత సీఎం రేవంత్ ఎదుట ఇచ్చిన పీపీటీలోని కొత్త అలైన్‌మెంట్‌కు అనుసంధానించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఎందుకు మార్పు చేస్తున్నారనేది ఆ ప్రాంత గ్రామాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రధానంగా పొలాల్లో గుర్తులు పెడుతుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఉత్తర భాగం నుంచి వస్తున్న రింగ్‌రోడ్డు కొత్త అలైన్‌మెంట్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రకారం.. చౌటుప్పల్ నుంచి శివన్నగూడెం వరకు రింగ్‌రోడ్డు లోపలికి జరిగినట్టుగా ఉండి ఆపై భారీ వంకర కనిపిస్తున్నదని, అందుకే రింగు మాదిరిగా వచ్చేందుకు చౌటుప్పల్ పరిధిలోనూ బయటకు జరుపుతున్నారని అధికారికవర్గాల సమాచారం. అంటే ప్రభుత్వ పెద్దల భూముల సమీపంలోకి రింగు రోడ్డును తీసుకుపోవడం వల్ల అసలు రింగురోడ్డు రూపం దెబ్బతిన్నందున ఈ సర్దుబాటు చేస్తున్నారా? లేక ఈ మార్పులోనూ కొందరు పెద్దల ప్రయోజనాలు దాగి ఉన్నాయా? అనేది తేలాల్సి ఉన్నది.

రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు



గత ఎన్నికల్లో రైతుల ఒత్తిడి మేరకు అలైన్‌మెంట్ మారుస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పింద్రు. ఉన్న రోడ్లను పెంచుకుంటే సరిపోతుంది. కొత్త రోడ్లు ఎందుకని అన్నరు. అధికారుల మార్కింగ్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు. సప్పిడోళ్లగూడెంలో మామిడి నర్సిరెడ్డికి భూమి పూర్తిగా పోవడంతో గుండె ఆగిపోయి చనిపోయిండు. ఇప్పటికైనా అధికారులు అలైన్‌మెంట్ మార్చాలి.

- బూర్గు కృష్ణారెడ్డి, రైతుసంఘం నాయకులు, మందోళ్లగూడెం

28 కిలోమీటర్లు కుదించడం సరికాదు



కొంతమంది స్వార్థం కోసమే అలైన్‌మెంట్ మారుస్తున్నరు. రెండోసారి మార్కింగ్‌సరికాదు. చౌటుప్పల్ రెవెన్యూ పరిధిలో గతంలో 4 గుంటల భూమి పోతే.. ఇప్పుడు 7 ఎకరాలు పోతున్నది. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నరు. లక్షల విలువైన ప్లాట్లు కోల్పోతున్నరు. ప్రస్తుతం జంక్షన్‌తో సర్వం కోల్పోతున్నరు. దీనికితోడు మున్సిపాలిటీ కూడా రెండు విభాగాలుగా వీడిపోతుంది.

- చింతల దామోదర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్, చౌటుప్పల్

అప్పు చేసి కొన్న ప్లాట్ పాయె



అప్పో సప్పో చేసి లక్షలు పోసి ప్లాటు కొన్న. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం చూస్తే ప్లాటుకు చాలా దూరం జంక్షన్‌కు అప్పట్లో అధికారులు మార్కింగ్ పెట్టింద్రు. అదిచూసి కొన్న. తీరా ఇప్పుడు జంక్షన్ విస్తీర్ణం మారిందని నా ప్లాటులోనే మార్కింగ్ చేసింద్రు. ఇప్పుడు ఏం చేయాల్నో తెలుస్తలేదు. నాతోపాటు పట్టణంలో 100కు పైగా ప్లాట్లు పోతున్నయి. అలైన్‌మెంట్ ముందుకు జరుపాలి. హెచ్ఎండీఏలో ప్లాటు కొంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని తీసుకుంటే.. చివరికి ఇట్లా అయ్యింది.

- సందగళ్ల మల్లేశ్, చౌటుప్పల్

ఇప్పుడు భూమి తీసుకుంటే మూడోసారి..



మా నాన్న పేరు మీద 12 ఎకరాల భూమి ఉంది. మేము ముగ్గురం అన్నదమ్ముళం. వారసత్వంగా వచ్చిన ఈ భూమిని నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నం. గతంలో 65వ జాతీయ రహదారి విస్తరణకు భూమిని కోల్పోయాం. తర్వాత పరిశ్రమల కరెంట్ కోసం, సోలార్ లైన్‌కు పెద్దపెద్ద స్తంభాలకు రెండోసారి ఇచ్చినం. మూడోసారి రీజినల్ రింగ్ రోడ్డు జంక్షన్ నిర్మాణానికి ఉన్న మొత్తం భూమి పోతున్నది. ఉన్నా భూమి పోతే ఎలా బతుకాలి. ప్రభుత్వం ముందుకు జరిపి రోడ్డు వేయాలి.

-జాల జంగయ్య యాదవ్, తంగడపల్లి

భూమిని నమ్ముకొని బతుకుతున్నం



మా 15 కుటుంబాలకు సంబంధించి 80 ఎకరాల భూమి ఉంది. తాతల నుంచి భూమిని నమ్ముకొని బతుకుతున్నం. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం 15 ఎకరాలు మార్కింగ్ పెట్టింద్రు. దీంతో ఇద్దరుముగ్గురికి పూర్తిగా నష్టం ఉండే. రెండోసారి అలైన్‌మెంట్ మార్చడంతో సుమారు 60 ఎకరాలు పోతున్నది. ఇప్పుడు అందరికీ పెద్ద నష్టమే జరుగుతున్నది. ఉన్న 20 ఎకరాలు కూడా కోసులు మిగులుతున్నది. అది కూడా దేనికి పనికి రాదు.

- గుండెబోయిన సత్యనారాయణ యాదవ్, తంగడపల్లి

బహుళ అంతస్థులు ఎవరికోసం...



తొలుత 78 ఎకరాలు జంక్షన్‌కు ప్రతిపాదించారు. రెండోసారి డిజైన్ మార్చి 181 ఎకరాలు పెంచారు. కొంతమంది బహుళ అంతస్తుల హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, మల్టిప్లెక్స్‌లు, పార్కులు నిర్మిస్తరు అని చెబుతున్నరు. ఇవన్నీ ఎవరి కోసం ఆంధ్రోళ్ల కోసమా.. ఈ జాతీయ రహదారిపై తిరిగేది వాళ్లే. వాళ్ల వినోదం కోసమే దక్షణిభాగంపై ప్రభుత్వం ప్రేమ చూపిస్తున్నట్లు ఉంది.

- జాల శ్రీశైలం యాదవ్, చౌటుప్పల్

ఎవుసం తప్ప వేరే తెల్వదు



నా చిన్నతనం నుంచి ఎవుసం చేసుకునే బతుకుంటున్నం. ఈ ఎవుసం తప్ప వేరే తెల్వదు. నాకున్న 4 ఎకరాల భూమిలో 15 గుంటలు మిగులుతుంది. అది కూడా వంకలు టింకలు ఉంటుంది. దేనికీ పనికి రాదు. ఏమి చేసి బతుకాలె. కొత్త ప్రభుత్వం వచ్చి మేలు చేస్తుంది అనుకుంటే. ఇట్లా జరిగే. ప్రభుత్వం తక్షణమే అలైన్‌మెంట్ మార్చాలి. లేదంటే మా బతుకులు రోడ్డున పడాల్సిందే.

-జాల నర్సింహయాదవ్, తంగడపల్లి

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై తగ్గేది లేదు

- నిర్ణయం తీసుకున్నాం.. వెనక్కి వెళ్లడం కష్టం
- సీపీఎం బృందానికి తేల్చి చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి
- చిరుద్యోగులు, రైతులు, పేదలు నష్టపోతున్నరని చెప్పినా సీఎం ససేమిరా

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చొద్దని సీపీఎం ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కోరగా.. ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని, వెనక్కి తగ్గేది లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డితో కూడిన పార్టీ ప్రతినిధి బృందం శనివారం రాత్రి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసింది. ట్రిపుల్ ఆర్ భూసేకరణతోపాటు పలు అంశాలతో కూడిన వినతిపత్రం సమర్పించామని వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రిపుల్ ఆర్ భూసేకరణలో అలైన్‌మెంట్ మార్చడం వల్ల మధ్యతరగతి ఉద్యోగులు, రైతులు, పేదలు నష్టపోతున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే ప్రభుత్వం ముందుకు పోవాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. ఇప్పటికే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పుపై నిర్ణయం జరిగినట్టు తెలిపారు. వెనక్కి వెళ్లడం కష్టమని తేల్చి చెప్పారు. కావాలంటే బాధితులకు నష్టపరిహారం పెంచే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారని సీపీఎం నేతలు పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కాకతీయ విశ్వవిద్యాలయానికి ఆనుకొని 40 ఏండ్లుగా నివసిస్తున్న టీచర్లు, కాంట్రాక్టు కార్మికులు, ఆటో డ్రైవర్ల ఇండ్లను యూనివర్సిటీ స్థలం పేరుతో కూల్చివేస్తామని మున్సిపల్ అధికారులు బెదిరిస్తున్నారని సీపీఎం నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అది ప్రైవేట్ స్థలమని, వర్సిటీకి సంబంధం లేదని చెప్పారు. ఉద్యోగులు, కార్మికుల ఇండ్లను కూల్చవద్దని కోరారు. సిరిసిల్లలో పవర్‌లూమ్‌ల కరెంటు చార్జీలను ప్రభుత్వం రూ.2 నుంచి రూ.8.30కు పెంచడంతో 30 వేల మంది కార్మికులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. పవర్ లూమ్‌లు మూతపడి, కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని వాపోయారు. కరెంట్ రాయితీని కల్పించాలని కోరారు. గతంలోలాగా యూనిట్‌కు రూ.2 వసూలు చేసి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

మత్తు వదలని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు!

కాలేజీ దశనుంచే డ్రగ్స్‌తో దోస్తీ • ఇటీవల పట్టుబడిన వారిలో టెకీలు, ఇంజినీరింగ్ విద్యార్థులే అధికం

మత్తుకు బానిసలై పెడ్లర్లుగా మారుతున్న వైనం • పబ్బుల్లోనూ జోరుగా అమ్మకాలు • చూసీ చూడనట్టు వదిలేస్తున్న యజమానులు



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): 'సరిపోదా శనివారం' అంటే.. హ్యాంగ్ ఓవర్ దిగడానికి సోమవారం కూడా సెలవు కావాలనే సాఫ్ట్‌వేర్ మత్తుబాబులు పెరిగిపోతున్నారు. సోమవారం రాగానే వచ్చే వీకెండ్‌ను ఎక్కడ, ఎలా ఎంజాయ్ చేయాలో పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారు. ఆ పార్టీకి కావల్సిన గంజాయి, హెరాయిన్, కొకైన్ లాంటి డ్రగ్స్‌ను డార్క్‌వెబ్ నుంచి ఆర్డర్ చేసుకుంటున్నారు. ఆపై మత్తులో జోగుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇలా ఖమ్మానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇటీవల డార్క్‌వెబ్ ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేసి పట్టుబడ్డాడు. ఇటీవల ఇలా పట్టుబడినవారిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రైవేట్ ఉద్యోగులు, ఇంజినీరింగ్ విద్యార్థులే ఎక్కువగా కనిపిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు డార్క్‌సైట్‌లో తెలంగాణవారికి 'నో సెల్లింగ్' బోర్డులు పెట్టగా.. ఇప్పుడు అదే డార్క్‌సైట్‌లో 'స్టాక్ అవైలబుల్ ఫర్ ఆల్' అనే బోర్డులు దర్శనమిస్తున్నాయి.

ఇంజినీరింగ్ దశ నుంచే

ఈ ఏడాది తొలి 3 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 500కుపైగా ఎన్డీపీఎస్ కేసుల్లో 981 మంది పట్టుబడ్డారు. వీరిలో దాదాపు 70% మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ విద్యార్థులే ఉన్నట్టు టీజీన్యాబ్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు టీజీన్యాబ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన దాడుల్లోనూ సాఫ్ట్‌వేర్ టెకీలు, ఇంజినీరింగ్ విద్యార్థులే ఎక్కువగా పట్టుబడటం ఆందోళన కలిగిస్తున్నది. వారిలో కొందరు ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడే తమకు గంజాయి మత్తు అలవాటు అయినట్టు చెప్తున్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజ్‌లో గంజాయి సేవిస్తూ పదుల సంఖ్యలో ఇంజినీరింగ్ విద్యార్థులు పట్టుబడ్డారు. వారిని 'నమస్తే తెలంగాణ' ప్రశ్నించగా.. తమ కళాశాలలోని ఉత్తరాది విద్యార్థులు గంజాయి అలవాటు చేశారని, ఆ తర్వాత తాము ధూల్‌పేటకు వెళ్లి గంజాయి తెచ్చుకున్నామని తెలిపారు.

పెడ్లర్లుగా మారుతున్న టెకీలు

ఒకసారి మత్తుకు బానిసైన తర్వాత తమకు ఏం చేయాలో అర్థం కావడం లేదని, ప్రతిసారి ఇంట్లో డబ్బులు అడగలేక గంజాయి, సింథటిక్ డ్రగ్స్ అమ్మేవారితో స్నేహం పెంచుకుని వాటిని ఇతరులకు విక్రయిస్తున్నామని కొందరు విద్యార్థులు, టెకీలు చెప్తున్నారు. మరోవైపు పబ్స్‌లోనూ డ్రగ్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వీటికి చెక్‌పెడితే తమ పబ్బులకు ఎవరూ రారని భావించి యజమానులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. దీంతో డ్రగ్స్ కట్టడి మరింత కష్టతరంగా మారిందని టీజీన్యాబ్ అధికారులు చెప్తున్నారు.



దాతలు దయతలిస్తే 'సీఎం బ్రేక్ ఫాస్ట్'

- **బీఆర్ఎస్ పథకానికి నయా పైసా విడుదల చేయని సర్కారు**
- **పేరు మార్చి దాతల సహకారంతో అమలుకు నిర్ణయం**
- **కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టే అవకాశం**

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): సర్కారు బడుల్లో విద్యార్థుల ఆకలిని తీర్చేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. విద్యార్థుల్లో రక్తహీనతను రూపుమాపడం, పోషకాహారాన్ని అందించడమే లక్ష్యంగా నాడు తెచ్చిన ఈ పథకానికి 8 నెలలుగా రాష్ట్ర సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో దాని లక్ష్యం నీరుగారింది. దీంతో బీఆర్ఎస్ సహా విపక్షాల నుంచి తీవ్రమైన విమర్శలు రావడంతో అనివార్య పరిస్థితుల్లో ఈ పథకాన్ని మరో తీరుగా అమలుచేసేందుకు సిద్ధపడింది. ఈ పథకాన్ని దాతల సహకారంతో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ పథకం పేరు మార్చి కొత్త పథకంగా అమలుచేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని మళ్లీ ప్రారంభించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రమంతటా ఈ పథకాన్ని విస్తరించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకానికి ఏటా రూ.700 కోట్లు ఖర్చు చేయాల్సి ఉన్నది. రేవంత్‌రెడ్డి సర్కారు ఆ నిధులివ్వలేక దాతలు, సీఎస్సార్ నిధుల వేటలో పడింది. వాస్తవానికి బ్రేక్‌ఫాస్ట్ స్కీం పాతదే. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని సర్కారు నిలిపివేసింది. నయా పైసా విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది.

23 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

రాష్ట్రంలో 2023 అక్టోబర్ 6న సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అప్పటి మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లాలోని రావిర్యాల పాఠశాలలో ప్రారంభించారు. 23 లక్షల విద్యార్థులకు లబ్ధిచేకూర్చేలా ఈ పథకాన్ని కేసీఆర్ సర్కారు రూపకల్పన చేసింది. వాస్తవంగా ఈ పథకం యావత్తు దేశానికే ఆదర్శమైంది. పీఎం పోషణ్ స్కీంలో భాగంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలుచేయాలని కేంద్రం భావిస్తున్నది.

బ్రేక్ ఫాస్ట్ లబ్ధిదారులు (గతంలో)

యాజమాన్యం	1-5 తరగతులు	6 నుంచి 8 తరగతులు	9, 10 తరగతుల్లో
ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్	11,57,541	6,18,463	3,65,138
ఎయిడెడ్	37,473	23,340	13,823
మాడల్ స్కూళ్లు	---	49,715	36,270
మదర్సాలు	2493	1,491	54
మొత్తం	11,97,507	6,93,009	4,15,285

ఫార్మా.. రోజుకో డ్రామా!

ఫార్మాసిటీపై రేవంత్ సర్కారు డొంకతిరుగుడు!

రద్దు చేశామని ఒకసారి.. చేయలేదని మరోసారి..!

- **మీడియాకు చెప్పేదొకటి.. కోర్టు ముందు మరొకటి!**
- **ఫార్మా విలేజ్, ఫార్మా క్లస్టర్ అంటూ పూటకో మాట**
- **జిల్లాల్లోనూ పెడ్తామంటూ ప్రభుత్వాధినేత ప్రకటనలు**
- **అనేకచోట్ల ఇప్పటికే మొదలైన భూసేకరణ ప్రక్రియ**
- **ఫార్మా బదులు స్పోర్ట్స్ విలేజ్‌ని తెరపైకి తెచ్చిన సర్కార్!**
- **ప్రాజెక్టు రద్దయితే భూములు తిరిగివ్వాలన్నది నిబంధన**
- **రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పాలని పట్టుబడుతున్న రైతులు**



హైదరాబాద్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీపై రాష్ట్రప్రభుత్వం డొంకతిరుగుడు వైఖరిని అవలంబిస్తున్నది. ఉంటుందంటూ ఒకసారి, చేపట్టలేమని మరోసారి ప్రకటిస్తూ గందరగోళం సృష్టిస్తున్నది. ప్రాజెక్టును చేపట్టలేక.. వద్దని చెప్తే సేకరించిన రైతుల భూములు వెనక్కి ఇవ్వలేక రోజుకో మాట చెప్తున్నది, ప్రభుత్వాధినేత కూడా రెండునాల్కల ధోరణిని అవలంబిస్తున్నారు. ఆయనే ఒకటీరెండు సార్లు ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు స్వయంగా ప్రకటించారు. ఒకసారి ఫార్మా సిటీ!.. మరోసారి ఫార్మా విలేజ్!.. ఇంకోసారి జిల్లాల్లో ఫార్మా క్లస్టర్స్! ఇట్లా సీఎం వైఖరి కూడా మారుతూ వచ్చింది. మీడియా ముందు, కాంగ్రెస్ సభల్లో చెప్తున్నదానికి పొంతన ఉండటం లేదు. సీఎం వ్యాఖ్యల తర్వాత జిల్లాల్లోనూ ఫార్మా క్లస్టర్లకు ప్రక్రియ మొదలైంది. పలుచోట్ల భూసేకరణ కూడా కొనసాగుతున్నది. దాన్ని వ్యతిరేకిస్తూ పలు జిల్లాల్లో రైతులు రోడ్డెక్కుతున్నారు. అంటే ఫార్మాసిటీ రద్దుపై ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ణయం తీసుకున్న మాట నిజం! జిల్లాల్లో ఆ ప్రక్రియ కొనసాగుతుండటం నిజం! కానీ హైకోర్టుకు మాత్రం ప్రభుత్వం వేరేవిధంగా చెప్తున్నది. తన దాగుడుమూతలతో న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టిస్తున్నది.

నిబంధనల ప్రకారం ఒక ప్రాజెక్టు కోసం రైతుల నుంచి భూమిని సేకరిస్తే.. ఆ భూమిని దాని కోసమే వినియోగించాలి. మరో పనికోసమో, మరో ప్రాజెక్టుకోసమో ఆ భూములను వాడటానికి వీల్లేదు. ఒకవేళ ఫార్మాసిటీ రద్దు చేస్తే.. దాని కోసం రైతుల నుంచి సేకరించిన 13 వేల ఎకరాలను తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుంది. అందుకే రేవంత్ ప్రభుత్వం రద్దును అధికారికంగా ప్రకటించలేకపోతున్నది. మరోవైపు అక్కడ స్పోర్ట్స్ విలేజ్ కడుతామని సన్నాయినొక్కులు నొక్కుతున్నది. భూముల్ని మరో ప్రాజెక్టుకు బదలాయించడం చట్టవిరుద్ధమని న్యాయనిపుణులు చెప్తున్నారు. ఫార్మాసిటీయే లేనప్పుడు మా భూముల్ని వెనక్కి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అనేకచోట్ల ఫార్మాసిటీకి భూసేకరణ మొదలైంది. అంటే ఫార్మాసిటీ రద్దుపై ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నది. క్షేత్రస్థాయిలో ఆ ప్రక్రియ కొనసాగుతున్నది. ఇది నిజం! కానీ, హైకోర్టుకు మాత్రం ప్రభుత్వం వేరే విధంగా చెప్తున్నది. న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టిస్తున్నది. ఫార్మాసిటీని రద్దు చేసి వివిధ ప్రాంతాల్లో 10 ఫార్మా విలేజ్‌లను ఏర్పాటుచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రకటించిన విషయం విదితమే. అయితే, ప్రభుత్వం కోర్టుకు శనివారం సమర్పించిన అఫిడవిట్‌లో మాత్రం.. ఫార్మాసిటీని రద్దుచేసినట్టు ఎక్కడా ఉత్తర్వులు ఇవ్వలేదని, మీడియాలో వచ్చిన కథనాలు ప్రామాణికం కాదని పేర్కొన్నది. దీంతో ప్రభుత్వం రెండు నాల్కల వైఖరి అవలంబిస్తున్నదనే విమర్శలొస్తున్నాయి.

ఈ ఏడాది ఫిబ్రవరి 27న జరిగిన బయోఏషియా వార్షిక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నలువైపులా ఫార్మా విలేజ్‌లను ఏర్పాటుచేస్తామని, 1000 నుంచి రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో, రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటుచేస్తామని, ముందుగా వికారాబాద్, మెదక్, నల్లగొండ జిల్లాల్లో వీటిని తీసుకొస్తామని చెప్పారు. కాగా, ఆయా జిల్లాల్లో భూములు అందుబాటులో లేవని కలెక్టర్లు స్పష్టంచేశారు. తాజాగా, ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లోనే సుమారు 1000 నుంచి 2000 ఎకరాల్లో గ్రీన్ ఫార్మాసిటీని ఏర్పాటు చేసేందుకు టీజీఐఐసీ అధికారులు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. వాస్తవానికి గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల కేంద్రంగా కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల పరిధిలో ఫార్మాసిటీ కోసం 13వేల ఎకరాల భూమిని సేకరించారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటంతో ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు దేశ, విదేశాలకు చెందిన అనేక కంపెనీలు ముందుకొచ్చాయి. ఫార్మాసిటీకి అవసరమైన పర్యావరణ అనుమతులు కూడా వచ్చాయి. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు అక్కడ ఫ్యూచర్‌సిటీ పేరుతో కొత్త నగరాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. కానీ, నిబంధనల ప్రకారం ఒక ప్రాజెక్టు కోసం రైతుల నుంచి భూమిని సేకరిస్తే.. ఆ భూమిని దానికోసమే వినియోగించాలి. మరో అవసరానికి ఆ భూములను వినియోగించే వీలులేదు. అందుకే తమ నుంచి సేకరించి భూములను వెనక్కి ఇచ్చివేయాలని రైతులు కోరుతున్నారు. కానీ, ఫార్మాసిటీ కోసం భూములు సేకరించిన ప్రాంతంలో స్పోర్ట్స్ విలేజ్ కడతామని ప్రభుత్వం చెప్తున్నది. అట్లా మళ్లించడం చట్ట విరుద్ధమని న్యాయనిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన కొందరు రైతులు కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వానికి ఏమిచేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఫార్మాసిటీ యథా ప్రకారం కొనసాగుతుందని, రద్దుచేస్తున్నట్టు ఎటువంటి విధానపరమైన నిర్ణయం తీసుకోలేదని రాష్ట్ర ప్రభుత్వం.. కోర్టుకు శనివారం నివేదించింది.

ఫ్యూచర్ సిటీ ఎక్కడ?

ఫార్మాసిటీ కోసం 13,000 ఎకరాలు సేకరించగా, తాజాగా ప్రభుత్వం పేర్కొంటున్న గ్రీన్ ఫార్మాసిటీని రెండువేల ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు టీజీఐఐసీ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వం కోర్టుకు నివేదించిన ప్రకారం ఫార్మాసిటీని ఏర్పాటుచేస్తే సేకరించిన భూముల్లో ఫార్మాసిటీ రావాల్సి ఉన్నది. ఒకవేళ ఫార్మాసిటీని రెండు వేల ఎకరాలకే పరిమితం చేస్తే మిగిలిన 11 వేల ఎకరాలను దేనికోసం వినియోగిస్తారనేది ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. ముచ్చర్ల కేంద్రంగా ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం ఇప్పటికే ప్రకటించారు. ఒకవేళ ప్రభుత్వం కోర్టుకు నివేదించిన విధంగా ఫార్మాసిటీని కొనసాగిస్తే ఫ్యూచర్‌సిటీని ఎక్కడ ఏర్పాటుచేస్తారో చెప్పాలని పలువురు కోరుతున్నారు. ఫార్మాసిటీని 13 వేల ఎకరాల్లో ఏర్పాటుచేస్తే సీఎం చెప్తున్న ఫార్మా విలేజ్‌ల కథ కంచికి చేరినట్టేనా? అనే సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. లేదంటే ఫార్మాసిటీతోపాటు పది ఫార్మావిలేజ్‌లను కూడా ఏర్పాటుచేస్తారా? ఇవన్నీ ప్రస్తుతం సామాన్య ప్రజలను, భూములిచ్చిన రైతులనే కాకుండా పరిశ్రమ వర్గాలను కూడా వేధిస్తున్న ప్రశ్నలు. ప్రభుత్వ అయోమయ ధోరణి వల్ల పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న కంపెనీలకు ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

- రైతుల భూములను లాక్కుని ప్రభుత్వం చేపట్టిన ఫార్మాసిటీని అధికారంలోకి రాగానే రద్దు చేస్తాం.
  అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ
- ఫార్మాసిటీని తరలిస్తాం. మెట్రో రూటును మార్చేస్తాం. ప్రస్తుత ఫార్మాసిటీ స్థానంలో ఔటర్ చుట్టూ మెగా టౌన్‌షిప్‌లు ప్లాన్ చేస్తున్నం
  2023 డిసెంబర్ 13న సీఎం రేవంత్‌రెడ్డి
- ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించడం శుభపరిణామం.
  2023 డిసెంబర్ 14న మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, కాంగ్రెస్ ఆదివాసీ విభాగం చైర్మన్ బెల్లయ్యానాయక్
- ఫార్మాసిటీని రద్దు చేయడం లేదు.
  2024 డిసెంబర్ 13న సీఎం రేవంత్‌రెడ్డి వివరణ

ఆనవాళ్లు లేకుండా చేయబోయి...

తెలంగాణ రాష్ట్రం దేశ ఔషధ రంగానికి రాజధానిగా కొనసాగుతున్నది. దేశం నుంచి ఎగుమతి అవుతున్న ఫార్మా ఉత్పత్తుల్లో మూడింట ఒక వంతు మన రాష్ట్రం నుంచే వెళ్తున్నాయి. వ్యాక్సిన్ క్యాపిటల్‌గా కూడా మన రాష్ట్రానికి పేరున్నది. కొవిడ్ వ్యాక్సిన్లలో సింహభాగం మన రాష్ట్రం నుంచే ప్రపంచానికి ఎగుమతి అయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన స్నేహపూర్వక విధానాల వల్ల ఈ రంగం గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందింది. ఔషధ రంగంలో రాష్ట్రానికి ఉన్న సుస్థిర స్థానాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం భారీస్థాయిలో ఫార్మాసిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీనికి అవసరమైన పర్యావరణ అనుమతులను కూడా సాధించింది. ఈ నేపథ్యంలో తాజాగా రేవంత్ ప్రభుత్వం రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనే తలంపుతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మాసిటీపై కక్షపూరిత ధోరణి అవలంబిస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

'గీతం' వర్సిటీ కోటి విరాళం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి సహాయనిధికి గీతం యూనివర్సిటీ రూ.కోటి విరాళం ఇచ్చింది. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం గీతం వర్సిటీ ప్రెసిడెంట్, ఎంపీ శ్రీభరత్ చెక్కు అందజేశారు. కాగా, సిక్కు మత స్థాపకుడు గురునానక్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు.

మహా వికాస్ అఘాడీ సీట్ల పంపకం కొలిక్కి!

శాసన సభ ఎన్నికల కోసం వేగంగా సమాయత్తం

ముంబై, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : త్వరలో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) వేగంగా అడుగులు వేస్తున్నది. భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల పంపకం ఫార్ములా దాదాపుగా ఖరారైంది. లోక్‌సభ ఎన్నికల్లో లభించిన విజయాల నేపథ్యంలో కాంగ్రెస్ దూకుడు ప్రదర్శిస్తున్నది. ముంబైలోని 90 శాతం సీట్లలో ఏకాభిప్రాయం కుదిరిందని ఎంవీఏ వర్గాలు చెబుతున్నాయి. శుక్రవారం జరిగిన ఎంవీఏ సమావేశంలో కాంగ్రెస్ 115 సీట్లు కావాలని పట్టుబట్టగా, శివసేన (యూబీటీ) కనీసం 100 సీట్లు కావాలని పట్టుబట్టినట్లు సమాచారం. అయితే చివరికి కాంగ్రెస్ 105 స్థానాల్లో, ఉద్ధవ్ గ్రూపు 95 స్థానాల్లో పోటీ చేసేందుకు అంగీకరించినట్లు తెలుస్తున్నది. ముంబైలో 23 స్థానాలు ఇవ్వాలని శివసేన (యూబీటీ) డిమాండ్ చేయగా, 22 సీట్లు ఇచ్చేందుకు అంగీకారం కుదిరినట్లు సమాచారం. మిగిలిన 14 స్థానాలు కాంగ్రెస్,ఎన్సీపీ పంచుకోవలసి ఉంటుంది.

మూడ్నెల్లుగా జీతాల్లేవ్!

మొదటిపేజీ తరువాయి...

నెలకొన్నదని చెప్తున్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాలు, జిల్లా, మండల కార్యాలయాలు, క్షేత్రస్థాయిలో ఔటసోర్సింగ్, పార్ట్‌టైం, హానరోరియం, కాంట్రాక్ట్ ప్రాతిపదికపై దాదాపు 1.50 లక్షల మందికిపైగా పనిచేస్తున్నారు. అటెండర్లు, పారిశుద్ధ్య కార్మికులు, వాచ్‌మెన్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, వైద్యరంగంలో ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్లు, విద్యారంగంలో బోధన, బోధనేతర విభాగాల్లో, స్పెషలాఫీసర్లుగా, అటవీశాఖలో వాచర్లుగా, ఉపాధి హామీ పథకంలో ఎఫ్ఏలుగా, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రత్యేక ప్రాజెక్టుల్లో ఫీల్డ్ లెవల్ ఆఫీసర్లు, ట్రైనర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ప్రాజెక్టు ఆఫీసర్లు, ఇరిగేషన్‌శాఖలో పంప్‌హౌజ్‌ల్లో నైట్‌వాచ్‌మెన్లు, ఎలక్ట్రీషియన్లు, మెకానికల్ ఇంజినీర్లు, ఆపరేటర్లు ఇలా దాదాపు అన్ని శాఖల్లో ఏదో ఒక విభాగంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. కొన్ని ప్రభుత్వశాఖలు నేరుగా వీరిని నియమించుకోగా, మరి కొన్ని శాఖలు జిల్లాలవారీగా మ్యాన్‌పవర్ ఏజెన్సీల ద్వారా నియమించుకున్నాయి.



పాల్వంచలో జీతాల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు(ఫైల్)

4 నుంచి 9 నెలలుగా అందని వేతనాలు

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎలా అందుతున్నాయో చెప్పేందుకు ఒక్క సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీనే నిదర్శనంగా నిలుస్తున్నది. సొసైటీలో పరిధిలోని పాఠశాలలు, కాలేజీలు, సీవోఈల్లో, కళాశాలల్లో, స్పోర్ట్స్ అకాడమీల్లో ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం, గెస్ట్‌ఫ్యాకల్టీ, హానరోరియంపై వేల మంది పనిచేస్తున్నారు. సదరు సిబ్బందికి ప్రభుత్వం జూన్, జూలై, ఆగస్టు వేతనాలనూ ఇప్పటికీ చెల్లించలేదు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, సెర్ప్, ఉపాధిహామీ పథకం ఉద్యోగులు, వీఏవోలు, వాచర్లు.. ఇలా ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సంబంధించి సగటున 4–9 నెలలుగా జీతాలు పెండింగ్‌లోనే ఉన్నాయి.

కాళ్ల మీద పడుతున్నా కనికరించని సర్కారు

జీతాల కోసం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమ శాఖల ఉన్నతాధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఎక్కే మెట్టు, దిగే మెట్టు అన్నవిధంగా ప్రధాన కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించేందుకు వెళ్లిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాళ్లపై పడి జీతాలు చెల్లించాలని అక్కడి ఓ గేట్ ఆపరేటర్ వేడుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయినా సర్కారు ఏమాత్రం కనికరం చూపించని దుస్థితి నెలకొన్నది. వాస్తవంగా చాలా శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గడువు జూన్ 31తోనే ముగిసింది. ఆయాశాఖల అధికారులు సదరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సర్వీస్ రెన్యువల్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వారిని ప్రస్తుతం మౌఖిక ఆదేశాలతో పనిచేయించుకుంటున్నారు తప్ప ప్రభుత్వం ఇంకా ఆమోదముద్ర వేయలేదు. అటు ప్రతిపాదనలు పట్టించకోక.. బకాయి వేతనాలు చెల్లించక ప్రభుత్వం నాన్చుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మానవీయకోణంలో స్పందించి వేతనాలను విడుదల చేయాలని ఔటసోర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు.

తక్షణమే వేతనాలు చెల్లించాలి

ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో అనేక మంది అప్పుల పాలయ్యారు. ప్రస్తుతం అప్పు కూడా పుట్టని పరిస్థితి నెలకొన్నది. పండుగ సమీపిస్తున్నది. ప్రభుత్వం తక్షణం మానవీయకోణంలో స్పందించాలి. బకాయి వేతనాలు చెల్లించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే ఆదుకోవాలి.

– పులి లక్ష్మయ్య, తెలంగాణ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు

బదిలీ ఉద్యోగులకు భత్యాల్లేవు!

- **వైద్యారోగ్య శాఖలో అవస్థలు**
- **కొత్తస్టేషన్లలో చేరినా అందని జీతాలు**
- **రెండు నెలలుగా తప్పని ఆర్థిక ఇబ్బందులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య శాఖలో అస్తవ్యస్త బదిలీల పరిణామాలు వైద్యులు, సిబ్బందిని పట్టిపీడిస్తూనే ఉన్నాయి. బదిలీ అయిన తర్వాత జీతాలు రావడంలేదని వైద్యులు, సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం జూలైలో సాధారణ బదిలీలను చేపట్టింది. వైద్యారోగ్య శాఖలో సీనియార్టీ జాబితా, వెకెన్సీ జాబితా, బదిలీల మినహాయింపు పత్రాల విషయంలో తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. కాలక్రమేణా ఈ అంశం మరుగునపడినా.. విచ్చలవిడిగా చేసిన బదిలీల కారణంగా వైద్యులు, సిబ్బంది ఇప్పటికీ అవస్థలు పడుతూనే ఉన్నారు. తమకు కొత్త స్టేషన్ (జిల్లా/ప్రాంతం)లో చేరిన తర్వాత జీతాలు అందడంలేదని వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బంది వాపోతున్నారు. కొందరికి బదిలీ అయినప్పటి నుంచి జీతాలు అందకపోగా, మరికొందరికి బదిలీ అయిన నెలలో కొంత జీతం పెండింగ్‌లో ఉన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యసిబ్బందిలో చాలా వరకు కొత్త స్టేషన్‌కు వెళ్లిన తర్వాత జీతం రాలేదని చెప్తున్నారు. 'హైదరాబాద్ నుంచి సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యాను. ఇప్పటివరకు జీతం రాలేదు' అని ఓ డాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరికి బదిలీ అయిన నెలలో.. బదిలీకి ముందు పనిచేసిన రోజుల వరకే జీతం వచ్చిందని, కొత్త స్టేషన్‌లో చేరిన తర్వాత ఆ నెలలోని మిగతా రోజులకు జీతం పడలేదని చెప్తున్నారు. 'నేను హైదరాబాద్ నుంచి మేడ్చల్ జిల్లాకు జూలై మూడో వారంలో బదిలీపై వెళ్లాను. జూలైలో మొదటి మూడు వారాలకు హైదరాబాద్‌లో జీతం వచ్చింది. కానీ మిగతా వారం రోజులకు సంబంధించిన వేతనం మేడ్చల్ జిల్లాలో రాలేదు' అని ఓ నర్సింగ్ ఆఫీసర్ వాపోయారు. ఇలా జీతాలు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు.

జనాభాను లెక్కిస్తేనే బీసీ రిజర్వేషన్!

- **ఎక్కడైనా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తాం**
- **9 నెలల్లో ఒక్క సెలవూ తీసుకోలేదు**
- **సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే కచ్చితంగా జనాభాను లెక్కించాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి అయినా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. తొమ్మిది నెలల్లో ఒక్క రోజు కూడా తాను సెలవు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు తీసుకురాబోతున్నామని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు అందజేస్తామని చెప్పారు. రైతు రుణ విముక్తి కావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 27 రోజుల్లో 18 వేల కోట్ల రైతు రుణ మాఫీ చేయలేదని పేర్కొన్నారు. నాలుగోసారి గెలవడం కోసమే ప్రధాని మోదీ జమిలీ అంశం ఎత్తుకున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాహుల్ ఆలోచన మేరకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను నియమించామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ కుమార్‌రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. పార్టీ నాయకత్వం ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. నరేంద్రమోదీని ఓడించాల్సిన చారిత్రాత్మక అవసరం ఉన్న సమయంలో పీసీసీ చీఫ్‌గా మహేశ్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారని తెలిపారు.

విజయ పాడి రైతులకు త్వరలో బిల్లులు

డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): విజయ డెయిరీ పాడి రైతులకు త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. అప్పటిదాకా రైతులు సహకరించాలని ఆదివారం ప్రకటనలో కోరారు. విజయ డెయిరీ ద్వారా నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఆదరించి సంస్థ సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. నిత్యం 4.20 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నామని, మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో పొరుగు రాష్ట్రాల డెయిరీలు తక్కువ ధరకే పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తుండటంతో విజయ డెయిరీ ఉత్పత్తుల అమ్మకాలు పడిపోయాయని పేర్కొన్నారు.

30లోగా సర్పంచుల బిల్లులపై తేల్చాలి

- **లేకుంటే కార్యాలయాలను ముట్టడిస్తాం**
- **సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులపై 30లోగా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. లేకుంటే కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నాలు, నిరసనలతో స్తంభింపజేస్తామని హెచ్చరించారు. సమస్యలపై గవర్నర్‌తోపాటు ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, మంత్రులకు ఇప్పటికే చాలాసార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.

'తెలంగాణ' యోధుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాయుధ పోరాటంలో ముందువరుసలో నిలిచిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేసి వారి స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలని కోరారు. బొమ్మగాని ధర్మభిక్షం, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, నలమల్ల గిరిప్రసాద్ విగ్రహాలను వారి జిల్లాల కూడళ్లలో ప్రతిష్ఠించి సముచిత గౌరవం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు.

ఐఫోన్లు, ఆపిల్ ఉత్పత్తులు సేఫ్ కాదు

వెంటనే కొత్త ఓఎస్‌తో అప్‌డేట్ చేసుకొమ్మని కేంద్రం హెచ్చరిక



న్యూఢిల్లీ: ఆపిల్ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఐఫోన్ 16 సిరీస్ లాంచ్ అయింది. అభిమానులు ఎప్పట్లానే ఎగబడి వాటిని కొనుగోలు చేశారు. మిగతా కంపెనీల ఉత్పత్తులతో పోలిస్తే భద్రత పరంగా ఇవి అత్యుత్తమమైనవిగా భావిస్తారు. అందుకే ఖర్చుతో సంబంధం లేకుండా వాటిని సొంతం చేసుకునేందుకు ఇష్టపడతారు. అయితే, అవి కూడా అంత సురక్షితం ఏమీ కాదని, వాటిలోనూ బోల్డన్ని భద్రతా లోపాలు ఉన్నట్టు కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సీఈఆర్‌టీ-ఇన్) హై రిస్క్ వార్నింగ్ జారీ చేసింది. ఐవోఎస్, ఐపాడ్ ఓఎస్, మ్యాక్‌ఓఎస్, వాచ్ ఓఎస్, విజన్ ఓఎస్‌లలో భద్రతా పరమైన లోపాలు ఉన్నట్టు పేర్కొంది. ఫలితంగా ప్రభావితమయ్యే వాటిలో ఐవోస్ 18, 17.7కు ముందు వెర్షన్లు, ఐపాడ్‌ఓఎస్‌లో 18, 17.7, మ్యాక్‌ఓఎస్ సోనోమాలో 14.7, మ్యాక్‌ఓఎస్ వెంచురాలో 13.7, మ్యాక్ ఓఎస్ సీక్వోయాలో 15, టీవీఓఎస్‌లో 18, వాచ్ ఓఎస్‌లో 11, సఫారీలో 18, ఎక్స్‌కోడ్‌లో 16, విజన్ ఓఎస్‌లో 2కు ముందు వెర్షన్లు ఉన్నాయి. వీటికి హ్యాకింగ్ ముప్పు పొంచి ఉన్నదని, కాబట్టి వీలైనంత త్వరగా తాజా సాఫ్ట్‌వేర్ వెర్షన్లతో అప్‌డేట్ చేసుకోవాలని సీఈఆర్‌టీ కోరింది.



అధిక పని ఒత్తిడికి మరొకరు బలి

తమిళనాడులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

చెన్నై, సెప్టెంబర్ 22: అధిక పని ఒత్తిడి కారణంగా 'ఎర్నెస్ట్ అండ్ యంగ్'లో ఓ ఉద్యోగిని హఠాన్మరణం చెందిందన్న వార్త సర్వత్రా షాక్‌కు గురి చేసింది. తాజాగా ఇలాంటిదే మరో ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. ఉద్యోగంలో పని ఒత్తిడికి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలయ్యాడు. గత కొద్ది నెలలుగా తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కార్తికేయన్(38) గురువారం కరెంట్ షాక్‌తో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటికి విద్యుత్తు తీగలను చుట్టుకొని కరెంట్ షాక్‌తో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని తాజంబూర్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిసింది. తమిళనాడులోని పల్లవరంలో 15 ఏండ్లుగా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న అతడు, పని ఒత్తిడి కారణంగా గత రెండు నెలలుగా తీవ్రమైన డిప్రెషన్‌కు గురయ్యాడని, ఇందుకు సంబంధించి చికిత్స కూడా తీసుకుంటున్నట్టు పోలీసులు చెప్పారు.



నన్ను జైల్లోనే చంపుతామన్నారు

- ఈడీ అనేక ఇబ్బందులకు గురి చేసింది
- ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం సిసోడియా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి జైల్లో ఉన్న సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి, ఈడీ వేధింపుల గురించి ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీ మారకపోతే తనను జైల్లోనే చంపేస్తామని కొందరు చెదిరించారన్నారు. ఆదివారం ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ నిర్వహించిన జనతా కీ అదాలత్‌లో సిసోదియా మాట్లాడారు. 'కోర్టు ముందు కేజ్రీవాల్ పేరు చెప్తే నన్ను కాపాడతామని అన్నారు. తమ పార్టీలో చేరాలని బీజేపీకి చెందిన వారి నుంచి ఒత్తిడి వచ్చింది' అని సిసోడియా అన్నారు. తన ఆస్తులన్నింటినీ ఈడీ స్తంభింపచేయడంతో తన కుమారుడి కాలేజీ ఫీజు కోసం పలువురిని యాచించాల్సి వచ్చిందని విమర్శించారు. జైలులో ఉన్న సమయంలో తనను మానసికంగా, రాజకీయంగా నాశనం చేయడానికి ఈడీ ప్రయత్నించిందని ఆరోపించారు.

ప్రజ్వలిస్తున్న ప్రతీకారం

- ఇజ్రాయెల్‌పై 100 రాకెట్లతో హెజ్బొల్లా దాడి
- లెబనాన్‌పై జరిగిన దాడికి బదులుగా ప్రయోగం
- ఇరు ప్రాంతాల్లో ముదురుతున్న ఉద్రిక్తతలు

నహరియా (ఇజ్రాయెల్), సెప్టెంబర్ 22: ఇజ్రాయెల్-లెబనాన్ పరస్పర తీవ్రంగా దాడులు చేసుకొంటున్నాయి. ఉత్తర ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాలపై హెజ్బొల్లా ఆదివారం ఉదయం వంద రాకెట్లతో విరుచుకుపడింది. ఇందులో కొన్ని రాకెట్లు ఇజ్రాయెల్‌లోని హైఫా నగరంలో పౌర నివాసాలపై పడ్డాయి. ఈ దాడిలో నలుగురు గాయపడగా, పలు భవనాలు, నివాస ప్రాంతాలు దెబ్బతిన్నాయని, పలు వాహనాలకు నిప్పు అంటుకున్నట్టు ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు. ఈ దాడిపై ఇజ్రాయెల్ రాత్రే అప్రమత్తమైంది. ఉత్తర ఇజ్రాయెల్‌లో రాత్రి నుంచి సైరన్ల ద్వారా పౌరులను అప్రమత్తం చేసి, సురక్షిత, పునరావాస ప్రాంతాలకు తరలించింది. కాగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ శుక్రవారం యుద్ధ విమానాలతో జరిపిన విస్తృత దాడుల్లో బీరుట్‌లో ఒక హెజ్బొల్లా అగ్రనేత సహా 45 మంది పౌరులు మరణించారు. శనివారం లెబనాన్‌లో 400 మిలిటెంట్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని రాకెట్లతో దాడి చేసినట్టు ఇజ్రాయెల్ లెఫ్టినెంట్ కల్నల్ నాదవ్ షోషాని తెలిపారు. దీనికి ప్రతీకారంగా హెజ్బొల్లా ప్రతిదాడులకు పూనుకుంది.



ఆదివారం హెజ్బొల్లా రాకెట్ దాడిలో ధ్వంసమైన ఇజ్రాయెల్‌లోని ఓ ప్రాంతం

హెజ్బొల్లాను తీవ్రంగా దెబ్బతీశాం

యుద్ధంలో ఇప్పటికే హెజ్బొల్లాను తీవ్రంగా దెబ్బతీశామని, ఒక వేళ హెజ్బొల్లా తమ సందేశాన్ని కనుక అర్థం చేసుకోకపోతే ఇప్పుడు అర్థం చేసుకుంటుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ అన్నారు. రానున్న పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, తమ దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. ఇజ్రాయెల్ మిలటరీ శనివారం 290 లక్ష్యాలను ఛేదించినట్టు ఆయన చెప్పారు.

అల్ జజీరా కార్యాలయం మూసివేత

ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని శాటిలైట్ న్యూస్ నెట్‌వర్క్ అల్ జజీరా కార్యాలయాలపై ఇజ్రాయెల్ సేనలు ఆదివారం దాడులకు దిగాయి. రామల్లాలోని దాని బ్యూరో కార్యాలయాన్ని మూసివేయించాయి. అక్కడ ఉన్న సామగ్రిని సీజ్ చేశాయి. వాటి ప్రసారాలను, వెబ్‌సైట్లను బ్లాక్ చేయించాయి. అయినప్పటికీ అల్ జజీరా వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్‌ల నుంచి తమ వార్తా ప్రసారాలను కొనసాగించింది. విదేశీ గడ్డపై ఉన్న ఒక వార్తా సంస్థను ఇజ్రాయెల్ ఇలా మూసి వేయించడం ఇదే తొలిసారి. ఇజ్రాయెల్ ఈ విషయాన్ని అంగీకరించింది కూడా.

నెట్‌ఫ్లిక్స్‌పై జాతి వివక్ష

వీసా ఉల్లంఘన ఆరోపణలు

కేంద్రం విచారణ



న్యూఢిల్లీ: ఇంటిపాల్లిదికి వినోదాన్ని పంచే నెట్‌ఫ్లిక్స్ చిక్కుల్లో పడింది. జాతి వివక్ష, వీసా ఉల్లంఘనకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ యూఎస్ స్ట్రీమింగ్ దిగ్గజంపై భారత ప్రభుత్వం దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిసింది. ఆ సంస్థ ఇండియా బిజినెస్, లీగల్ అఫైర్స్ మాజీ డైరెక్టర్ నందినీ మెహతాకు 20 జూలై 2020లో పంపిన ఈ-మెయిల్‌లో పేర్కొన్న ఈ విషయం తాజాగా వెలుగు చూసింది. భారత్‌లో నెట్‌ఫ్లిక్స్ తన కార్యకలాపాల నిర్వహణలో ప్రవర్తనా నియమావళితోపాటు వీసా నిబంధనల ఉల్లంఘన, చట్ట విరుద్ధ నిర్మాణాలు, జాతి వివక్ష వంటి చర్యలకు పాల్పడినట్టు హోం శాఖలోని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్‌వో)కు చెందిన భారత అధికారి దీపక్ యాదవ్ లేఖ రాశారు. మరోవైపు, నెట్‌ఫ్లిక్స్ తనను అన్యాయంగా తొలగించిందంటూ నందినీ మెహతా ఆరోపించారు. ఇందుకు సంబంధించి నెట్‌ఫ్లిక్స్‌పై అమెరికా కోర్టులో పోరాడనున్నట్టు చెప్పారు. భారత ప్రభుత్వ దర్యాప్తును స్వాగతిస్తున్నట్టు చెప్పిన మెహతా.. ఆ నివేదికను బయట పెట్టాలని కోరారు. కాగా, నెట్‌ఫ్లిక్స్ మాత్రం జాతి, లింగ వివక్ష ఆరోపణలను తోసిపుచ్చింది. భారత ప్రభుత్వ దర్యాప్తు గురించి తమకు తెలియదని ఆ సంస్థ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

శ్రీలంక అధ్యక్షుడిగా దిసనాయకే విజయం

రెండో ప్రాధాన్య ఓట్లతో గెలుపు.. నేడు ప్రమాణ స్వీకారం



కొలంబో: శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో మార్క్సిస్ట్ నేత అనుర కుమార దిసనాయకే (56) విజయం సాధించినట్లు ఎన్నికల కమిషన్ ఆదివారం ప్రకటించింది. శనివారం జరిగిన ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఎవరికీ 50 శాతానికిపైగా ఓట్లు రాలేదు. దీంతో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించి ఈ ఫలితాన్ని ప్రకటించారు. దిస్సనాయకే మార్క్సిస్ట్ జనతా విముక్తి పెరమున పార్టీ నేత. మరికొన్ని పార్టీలతో కలిసి నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) పేరుతో ఎన్నికల్లో పోటీ చేశారు. సమగి జన బలవేగయ (ఎస్‌జేబీ) నేత సాజిత్ ప్రేమదాసపై దిసనాయకే గెలిచారు. శ్రీలంక అధ్యక్షునిగా దిసనాయకే సోమవారం ప్రమాణ స్వీకారం చేస్తారని ఎన్‌పీపీ ప్రకటించింది. ''ప్రెసిడెంట్ అనుర దిసనాయకే, ప్రియమైన బిడ్డ శ్రీలంకను మీ సంరక్షణకు అప్పగిస్తున్నాను'' అని దిసనాయకేను ఉద్దేశించి విక్రమసింఘే ఒక ప్రకటనలోతెలిపారు.

విద్యార్థి రాజకీయాల నుంచి ఎదిగి...

శ్రీలంక రాజకీయాల్లో పెను సంచలనంగా మారిన అనుర కుమార దిసనాయకే డిగ్రీ చదువుతున్నప్పుడు సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్‌లో చేరి, విద్యార్థి రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. 1987లో మార్క్సిస్ట్ ప్రభావిత జనతా విముక్తి పెరమున (జేవీపీ) పార్టీలో చేరారు. 2004లో శ్రీలంక ఫ్రీడమ్ పార్టీతో కలిసి జేఎన్‌పీ ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. శ్రీలంకలో 2022లో ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ప్రజల అసంతృప్తిని ఆయుధంగా మలచుకున్నారు. మార్పు, అవినీతి రహిత సమాజ నిర్మాణం వంటి నినాదాలతో జనాదరణ పొందారు. ఎన్నికల ప్రసంగాల్లో గత పాలకుల అవినీతి, వైఫల్యాల గురించి వివరించడంతోపాటు, దేశంలో జవాబుదారీతనం, వ్యవస్థాగత మార్పులు రావాలని గట్టిగా చెప్పారు.

టిక్కెట్ లేని ప్రయాణికులపై చర్యలు

పండుగ సీజన్‌లో తనిఖీలకు రైల్వే సిద్ధం

న్యూఢిల్లీ: పండుగల సమయాల్లో టిక్కెట్ లేకుండా రైళ్లలో ప్రయాణించేవారిని నిరోధించేందుకు రైల్వే శాఖ సమాయత్తమవుతున్నది. టిక్కెట్ లేకుండా ప్రయాణించే పోలీసులపై కూడా చర్యలకు సిద్ధమవుతున్నది. రైల్వే శాఖ ఈ నెల 20న దేశంలోని 17 జోన్ల జనరల్ మేనేజర్లకు రాసిన లేఖలో దీనికి సంబంధించిన ఆదేశాలను జారీ చేసింది. టిక్కెట్ లేకుండా, అనధికారికంగా రైళ్లలో ప్రయాణించేవారిపై రైల్వే చట్టం, 1989 ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీని కోసం వచ్చే నెల 1 నుంచి 15 వరకు, వచ్చే నెల 25 నుంచి నవంబరు 10 వరకు ప్రత్యేక తనిఖీలను నిర్వహించాలని చెప్పింది. టిక్కెట్ లేని ప్రయాణికుల్ని గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది.

అమెరికాలో తుపాకీ కాల్పులు

నలుగురి మృతి

బర్మింగ్‌హామ్: పసందైన విందు, వినోదాలను పంచిపెట్టే బార్లు, రెస్టారెంట్లతో కళకళలాడే ప్రాంతంలో శనివారం రాత్రి దారుణం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించగా, 21 మంది గాయపడ్డారు. అమెరికాలోని అలబామా, బర్మింగ్‌హామ్‌లో ఉన్న ఫైవ్ పాయింట్స్ సౌత్ ఏరియాలో ఈ సంఘటన జరిగింది. బర్మింగ్‌హామ్ అధికారి ట్రుమన్ ఫిట్జ్‌గెరాల్డ్ మాట్లాడుతూ, కాల్పుల్లో గాయపడ్డ నలుగురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ప్రజలను బలి తీసుకున్నవారిని గుర్తించి, పట్టుకునేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తామని చెప్పారు. రెస్టారెంట్లు, బార్లు, ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్లు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో వారాంతాల్లో రద్దీగా ఉంటుంది.

హర్యానాలో బీజేపీ ఓటమికి రైతు సంఘాల పిలుపు

కురుక్షేత్ర: హర్యానా శాసన సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని రైతు సంఘాలు ఆదివారం పిలుపునిచ్చాయి. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో పలు రైతు సంఘాలు పిప్లిలో నిర్వహించిన కిసాన్ మహాపంచాయత్‌లో ఈ నిర్ణయం తీసుకున్నాయి. వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి తమ డిమాండ్ల సాధన కోసం వచ్చే నెల 3న దేశవ్యాప్తంగా రైల్ రోకో నిర్వహించాలని కూడా నిర్ణయించాయి. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చిన రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతు నేత సర్వన్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ, హర్యానాలో బీజేపీ దురాగతాలకు ప్రతీకారం తీర్చుకోవలసిన సమయం ఆసన్నమైందన్నారు.

బీటెక్ విద్యార్థులకు 50 ఇండో పసిఫిక్ స్కాలర్‌షిప్‌లు

న్యూయార్క్: క్వాడ్ కూటమి దేశాలు తమ ప్రజల మధ్య సన్నిహిత సంబంధాల బలోపేతానికి చర్యలు ప్రారంభించాయి. ఇందులో భాగంగా క్వాడ్ భాగస్వామ్య దేశంగా భారత ప్రధాని చొరవ తీసుకున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంత దేశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు అయిదు లక్షల డాలర్ల క్వాడ్ స్కాలర్ షిప్ ప్రకటించారు. భారత ప్రభుత్వ నిధులతో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కాలేజీల్లో నాలుగేండ్ల బీటెక్ కోర్సు పూర్తి చేసే ఇండో-పసిఫిక్ ప్రాంత విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ అందిస్తారు.

నన్ను అవినీతిపరుడిగా చూపేందుకు ప్రధాని కుట్ర

- నేను నిజాయితీపరుడిని కాదని భావిస్తే ఓటేయకండి
- ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: తనను అవినీతిపరుడిగా నిరూపించేందుకు ప్రధాని మోదీ కుట్ర పన్నారని ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన జనతా కీ ఆందోళన్‌లో ఆయన మాట్లాడుతూ 'నన్ను, మనీశ్ సిసోడియాను అవినీతిపరులుగా చూపేందుకు ప్రధాని కుట్ర పన్నారు. పదేండ్లు సీఎంగా ఉన్నా తనకు ఢిల్లీలో సొంత ఇల్లు లేదన్నారు. తాను నిజాయతీపరుడిని కాదని భావిస్తే ఎన్నికల్లో ఓటేయద్దని ప్రజలను కోరారు.

మోదీ చర్యలపై ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రశ్నలు

ప్రధాని మోదీ చర్యలపై సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్ ఆర్‌ఎస్‌ఎస్‌కు అయిదు ప్రశ్నలు సంధించారు. 'కొడుకు తన తల్లి పట్ల తన వైఖరి చూపించే పెద్ద వాడయ్యాడా?' అని అర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్‌ను ప్రశ్నించారు. కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగం, అవినీతి నేతలను పార్టీలో చేర్చుకోవడం, ఆర్‌ఎస్‌ఎస్ అవసరం లేదన్న బీజేపీ వైఖరిపై, బీజేపీలో వయోపరిమితి నిబంధనపై ఆర్‌ఎస్‌ఎస్ సమాధానం చెప్పాలన్నారు.

ఎస్సీ అట్రాసిటీ కేసుల్లో

97 శాతం పైగా ఆ 13 రాష్ట్రాల్లోనే

- శిక్ష పడిన వారి సంఖ్య తగ్గుముఖం
- నివేదిక విడుదల చేసిన కేంద్రం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: దేశంలో షెడ్యూల్డ్ కులాల వారిపై 2022లో జరిగిన మొత్తం దౌర్జన్యం కేసులలో 97.7 శాతం కేసులు 13 రాష్ట్రాలలోనే చోటుచేసుకున్నాయి. వీటిలో యూపీ అగ్రస్థానంలో ఉండగా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తర్వాతి స్థానాల్లో ఉన్నట్టు ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. అదే సమయంలో 2020తో పోలిస్తే ఆ ఏడాది కేసులలో శిక్షపడిన వారి సంఖ్య 39.2 నుంచి 32.4 శాతానికి పడిపోయింది. అలాగే షెడ్యూల్డ్ కేస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (దౌర్జన్యాల నివారణ) చట్టం ప్రకారం దేశం మొత్తంలో ఎస్టీలపై 2022లో జరిగిన దౌర్జన్యాలలో 98.91 శాతం 13 రాష్ట్రాలలో నమోదయ్యాయని ప్రభుత్వ తాజా నివేదిక తెలియజేసింది. ఎస్సీలపై 2022లో జరిగిన దౌర్జన్యాలపై మొత్తం 52,886 కేసులకు ఈ 13 రాష్ట్రాలలో 51,566 కేసులు నమోదయ్యాయి. వాటిలో యూపీలో 12,287 (23.78 శాతం), రాజస్థాన్‌లో 8,651 (16.75 శాతం), ఎంపీలో 7,732 (14.97), బీహార్‌లో 6,799 (13.16 శాతం), ఒడిశాలో 3,576 (6.93 శాతం), మహారాష్ట్రలో 2,706 (5.24 శాతం) కేసులు నమోదయ్యాయి. ఇక ఎస్టీలపై 2022లో మొత్తం కేసులు 9,735కు ఎక్కువగా ఎం పీలో 2,979 (30.61శాతం) నమోదయ్యాయి.

పట్టాలపై మరోసారి సిలిండర్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రేమ్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం గ్యాస్ సిలిండర్ కనిపించింది. ఆ మార్గంలో వెళుతున్న గూడ్స్ రైలు లోకో పైలట్ దీనిని గుర్తించి వెంటనే ఎమర్జెన్సీ బ్రేక్‌లు వేయడంతో ప్రమాదం తప్పింది. ట్రాక్‌పై గుర్తించిన అయిదు కిలోల సామర్థ్యం గల ఖాళీ సిలిండర్‌ను తొలగించామని స్థానిక పోలీసులు వెల్లడించారు. అలాగే గుజరాత్‌లోని కిమ్-కోసాంబ మధ్య కిమ్ వంతెన సమీపంలో శనివారం పెను ప్రమాదం తప్పింది. రైల్వే ట్రాక్‌పై సేఫ్టీ పిన్ ఇలాస్టిక్ రైల్ క్లిప్‌ను తొలగించి, గరీబ్ రథ్ రైలును ప్రమాదానికి గురయ్యేలా చేయాలని చేసిన కుట్ర విఫలమైంది. కాగా, ఎంపీలో గత బుధవారం సైన్యం ప్రత్యేక రైలును కొద్దిసేపు ఆపివేయడానికి కారణమైన డిటోనేటర్లను 'హాని రహిత'మైనవిగా రైల్వే అభివర్ణించింది.

భూ పరిహారం వీలైనంత

త్వరగా చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వాలదే ఆ బాధ్యత: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: భూ సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నష్ట పరిహారం చెల్లింపు వీలైనంత తొందరగా పూర్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఉంటుందని, ఇది రాష్ట్రాల రాజ్యాంగ, చట్టబద్ధమైన బాధ్యత అని గుర్తు చేసింది. ఈ మేరకు ఈ నెల 20వ తేదీన తీర్పును వెలువరించింది. హిమాచల్ ప్రదేశ్ సోలన్ జిల్లా కేంద్రంలో సిమెంట్ కంపెనీ జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ కోసం ప్రభుత్వం 54 ఎకరాల భూమిని సేకరించింది. ఇందులో పరిహారం చెల్లింపు పూర్తి చేయకుండా రాష్ట్ర సర్కార్ సిమెంట్ కంపెనీకి భూమిని స్వాధీనం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ఖజానా నుంచి బాధితులకు 9 శాతం వడ్డీతో కలుపుకొని అసలును చెల్లించాలని, అటు తర్వాత ఆ మొత్తాన్ని సదరు సిమెంట్ కంపెనీ నుంచి వసూలు చేసుకోవాలని హిమాచల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది.



లైంగిక దాడి ప్రతిఘటించిందని హత్య

ఆరేండ్ల చిన్నారిపై ప్రిన్సిపల్ దారుణం



దాహూద్ (గుజరాత్), సెప్టెంబర్ 22: పాఠాలు చెప్పి విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన ఓ ప్రిన్సిపల్ దారుణానికి పాల్పడ్డాడు. లైంగిక దాడికి ప్రయత్నించిన తనను అడ్డుకుందనే కోపంతో ఆరేండ్ల బాలికను హతమార్చాడు. గుజరాత్‌లోని దహోద్ జిల్లా సింగ్‌వాడ్ తాలుకాలోని ప్రాథమిక పాఠశాలలో ప్రిన్సిపాల్ గోవింద్ నాట్ గురువారం స్కూల్‌కు కారులో వస్తున్నాడు. దారిలో ఆరేండ్ల బాలికను కారులో ఎక్కించుకుని ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. బాలిక ప్రతిఘటించి ఆరవడంతో గోవింద్ నాట్ ఆమె నోరు, ముక్కు మూసి వేశాడు. దీంతో బాలిక స్పృహ తప్పింది. ఆమెను కారులో అలాగే ఉంచి స్కూల్‌కు యథావిధిగా వచ్చాడు. సాయంత్రం ఐదు దాటిన తర్వాత స్పృహలో లేని చిన్నారిని పాఠశాల వెనుకవైపు పడేశాడు. తల్లిదండ్రులు, బంధువులు వచ్చి గాలించగా, స్పృహ తప్పి ఉన్న స్థితిలో బాలిక కన్పించింది. ఆమెను దవాఖానకు తరలించగా మృతి చెందింది. పోలీసులు హెడ్‌మాస్టరే హంతకుడిగా నిర్ధారించి అరెస్ట్ చేశారు.

మసీదు ప్రాంగణంలో బాలికపై రేప్

మసీదు ప్రాంగణంలో ఒక మతాధికారి ఐదేండ్ల బాలికపై లైంగిక దాడి చేసిన ఘటన రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో చోటు చేసుకుంది. మసీదులో మౌల్విగా పనిచేసే అస్జద్ (22) ఇంటి ఎదురుగా ఉండే ఐదేండ్ల బాలికను మసీదులోకి తీసుకుని వెళ్లి అఘాయిత్యం చేశాడు.

ఫ్రిజ్‌లో 30 ముక్కలుగా మహిళ శవం

బెంగళూరులో వెలుగు చూసిన దారుణం

బెంగళూరు, సెప్టెంబర్ 22: బెంగళూరులో దారుణం జరిగింది. ఓ యువతి మృతదేహాన్ని 30 ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో పెట్టిన ఉదంతం వయాలికావల్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో వెలుగు చూసింది. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో యజమాని చేసిన ఫిర్యాదుతో ఈ దారుణం శనివారం బయటపడింది. పోలీసులు ఇంటి లోపలకు ప్రవేశించి ఫ్రిజ్‌లో 30 ముక్కలుగా నరికి ఉన్న ఒక యువతి మృతదేహాన్ని చూసి షాక్ తిన్నారు. ఈ ఘటన జరిగి నాలుగైదు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నట్టు వెస్ట్ జోన్ అడిషనల్ కమిషనర్ ఎన్ సతీశ్ కుమార్ తెలిపారు. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం మృతురాలిని జార్ఖండ్‌కు చెందిన 29 ఏండ్ల మహాలక్ష్మిగా గుర్తించారు. హేమంత దాస్ భార్య అయిన ఆమె ఐదు నెలల క్రితం భర్తతో గొడవపడి వచ్చి ఆ ఫ్లాట్‌లో ఒంటరిగా నివసిస్తున్నది. ఆమె భర్తను పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

తాజ్‌మహల్ గోడలకు పగుళ్లు

పలు చోట్ల దెబ్బ తిన్న ఫ్లోరింగ్ • తీవ్ర సమస్యలు లేవన్న ఏఎస్ఐ



ఆగ్రా, సెప్టెంబర్ 22: ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటిగా పేరొంది, పర్యాటకులను విపరీతంగా ఆకర్షించే ఆగ్రాలోని తాజ్‌మహల్ లోపభూయిష్టమైన నిర్వహణతో నిర్లక్ష్యానికి గురవుతున్నది. ఫలితంగా ఈ పాలరాతి కట్టడంలోని గోడలు, ఫ్లోరింగ్ పలు చోట్ల దెబ్బతినడమే కాక, పగుళ్లు కూడా దర్శనమిస్తున్నాయి. ఇటీవల ఆగ్రాలో కురిసిన భారీ వర్షం కారణంగా ఇవి మరింత పెరిగినట్టు భావిస్తున్నారు. గతంలో ప్రధాన గోపురం చుట్టూ ఉన్న తలుపులపై అరబిక్‌లో ఖురాన్ శ్లోకాలు ఉండేవి. ఇప్పుడవి చెరిగిపోయాయి. గోడలలో పొదిగిన విలువైన రాళ్లు కూడా అవసాన దశకు చేరుకుంటున్నాయని టూరిస్ట్ గైడ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి షకీల్ చౌహాన్ తెలిపారు. పశ్చిమ దిశలో కట్టడానికి ఎదురుగా ఉన్న ఫ్లోరింగ్‌పై రాళ్లు ముక్కలయ్యాయని, ప్రధాన సమాధి ప్రాంతం, ప్రధాన గుమ్మటం వద్ద గోడలు దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రస్తుతం తాజ్‌మహల్ కట్టడానికి సంబంధించి ఎలాంటి తీవ్ర సమస్యలు లేవని తాజ్‌మహల్ నిర్వహణను చూస్తున్న భారత పురావస్తు సంస్థ (ఏఎస్ఐ) స్పష్టం చేసింది. కాగా, ఇటీవల కురిసిన భారీ వర్షానికి తాజ్‌మహల్ ప్రధాన గుమ్మటం నుంచి నీరు కారడమే కాక, కట్టడం ముందున్న తోట నీట మునిగిన విషయం తెలిసిందే.

17 ఏండ్ల క్రితం కిడ్నాప్‌కు గురై..

ఇప్పుడు లాయర్‌గా కేసు గెలిచి..

- తన కేసును తానే వాదించుకున్న బాధితుడు
- 14 మంది నిందితుల్లో 8 మందికి జీవిత ఖైదు

ఆగ్రా, సెప్టెంబర్ 22: ఆగ్రా జిల్లాలోని ఖేరాగఢ్‌లో 17 ఏండ్ల క్రితం కిడ్నాప్‌కు గురైన ఓ బాలుడు.. ఇప్పుడు లాయర్‌గా ఎదిగాడు. ఆపై తన అపహరణ కేసులో తానే తుది వాదనలు వినిపించి, ఆ కిడ్నాపర్లకు జీవిత ఖైదు పడేలా చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. 2007 ఫిబ్రవరి 10వ తేదీ సాయంత్రం కొందరు దోపిడీ దారులు ఖేరాగఢ్‌లోని ఓ మెడికల్ షాపుపై దాడికి పాల్పడ్డారు. ఆ షాపు యజమానిపై కాల్పులు జరిపి, ఆయన కుమారుడు హర్ష గార్గ్ (7)ను కారులో అపహరించుకుపోయారు. ఆపై తమకు రూ.55 లక్షలు చెల్లించాలంటూ హర్ష కుటుంబాన్ని బెదరించసాగారు.



ఈ కేసులో పోలీసులు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేశారు. మిగిలిన నిందితులు మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లాలో నక్కినట్టు 2007 మే 6న పోలీసులకు సమాచారం అందడంతో వారిని పట్టుకునేందుకు కాపు కాశారు. ఆ సమయంలో హర్షను మోటర్ సైకిల్‌పై మరో స్థావరానికి తరలిస్తున్న క్రమంలో భయపడి వదిలేసిన హర్షను రక్షించి అతని కుటుంబం చెంతకు చేర్చిన పోలీసులు.. తర్వాత మొత్తం 14 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసుపై దిగువ కోర్టు ఈ నెల 17న తుది విచారణ జరిపింది. ఈ కేసులో ఏకధాటిగా 55 నిమిషాలపాటు తన వాదన వినిపించిన హర్ష గార్గ్.. నిందితుల తరపు న్యాయవాది లేవనెత్తిన అభ్యంతరాలకు సైతం దీటుగా జవాబిచ్చాడు. దీంతో నిందితుల్లో 8 మందికి జీవిత ఖైదు విధించిన కోర్టు.. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో నలుగురిని నిర్దోషులుగా తేల్చింది. మిగిలిన ఇద్దరు నిందితులు ఇప్పటికే మృతి చెందారు. 2015 నుంచి క్రమం తప్పకుండా ఈ కేసు విచారణకు హాజరవుతుండటంతో న్యాయవాది కావాలన్న కాంక్ష తనలో బలపడిందని, దీంతో 2022లో ఆగ్రాలోని ఓ కాలేజీలో లా డిగ్రీ పూర్తి చేశానని హర్ష గార్గ్ తెలిపారు.

బీడు భూముల్లో జల సిరులు

- ఇక్రిసాట్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ విధానంతో సత్ఫలితాలు
- బుందేల్‌ఖండ్‌లో పైలట్ ప్రాజెక్టు విజయవంతం



సిటీబ్యూరో, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): నీరు లేక నెర్రలు తీసిన బుందేల్‌ఖండ్ భూములు ఇప్పుడు జల కళను సంతరించుకుంటున్నాయి. వట్టిపోయిన వ్యవసాయ బావులు, 50 అడుగుల లోతులోకి వెళ్లినా చుక్క నీరు వచ్చే పరిస్థితి లేకుండా తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల నడుమ కునారిల్లే చెరువులు, కుంటలలో నేడు ఇక్రిసాట్ జల సిరులు కురిపించింది. వారు చూపిన ల్యాండ్ మేనేజ్‌మెంట్ విధానాలు ఆ ప్రాంతంలో జల వనరులను వృద్ధి చేశాయి. యూపీలోని బుందేల్‌ఖండ్ కొండ ప్రాంతాలను ఇక్రిసాట్ భూగర్భ జల వనరులను మెరుగుపరిచేలా పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని అమలు చేసింది. వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవడం, ఇంకుడు గుంతలు, అదే విధంగా కెనాల్ల ద్వారా నీరు చెరువుల్లోకి వెళ్లే విధంగా సహజ నీటి ప్రవాహానికి వీలుగా నిర్మాణాలను చేపట్టారు. దీంతో వట్టిపోయిన వ్యవసాయ భూముల్లోకి నీరు రావడం మొదలైంది. ముఖ్యంగా భూగర్భ జలాల నీటి మట్టం పెరగడంతో ఇప్పుడు సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదైనా చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయని ఇక్రిసాట్ వర్గాలు తెలిపాయి.

షేర్లను ఒడిసిపట్టేద్దాం



ఐపీవో అలాట్‌మెంట్‌లో మీకున్న అవకాశాల్ని పెంచుకోండిలా

స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపట్ల ఆసక్తి ఉన్న మదుపరులకు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యతగల అంశమే. ఎందుకంటే ఈ ఆఫర్లు అనేకానేక ప్రయోజనాలను కలిగి ఉంటాయి. అయినప్పటికీ పెద్ద ఎత్తున డిమాండ్ కారణంగా ఈ పబ్లిక్ ఇష్యూల్లో షేర్లను దక్కించుకోలేకపోతుంటారు చాలామంది. అందుకే కొన్నిరకాల మార్గాల్లో ప్రయత్నిస్తే మదుపరులు తాముల అనుకున్నది సాధించవచ్చు.

ఇదీ సంగతి..

దేశీయ స్టాక్ మార్కెట్లు రోజుకో రికార్డు స్థాయిని తాకుతున్నాయి. ఒకప్పుడు స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్‌మెంట్‌పట్ల పెద్దగా ఆసక్తి చూపనివారే ఎక్కువ. కానీ ఇప్పుడు అంతా అమితాసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఈక్విటీ పెట్టుబడులపై పెరిగిన అవగాహనే ఇందుకు కారణం. ఇక ఏదైనా సంస్థ ఐపీవోకు వచ్చినప్పుడు అందులో షేర్లను కొనాలనుకుంటే మీ కుటుంబ సభ్యులందరి పేర్లపైనా దరఖాస్తు చేసుకోవాలి. గడువులోగా ఈ పని పూర్తిచేయాలి. ఇతరత్రా విషయాలకొస్తే..

బహుళ డీమ్యాట్ అకౌంట్లతో

ఒకటికి మించి డీమ్యాట్ అకౌంట్ల ద్వారా పలుమార్లు దరఖాస్తు చేసుకోవడం వల్ల కూడా షేర్లను పొందవచ్చు. మీ కుటుంబ సభ్యుల పేరిట ఉన్న డీమ్యాట్ ఖాతాలను ఇందుకు వాడుకోండి. దీనివల్ల రష్ ఎక్కువగా ఉన్నప్పటికీ దేనికో ఒకదానికి మీ షేర్ల అలాట్‌మెంట్ జరుగుతుంది. అయితే దరఖాస్తు సమయంలో మీకున్న అన్ని డీమ్యాట్ ఖాతాల వివరాలను పేర్కొనడం తప్పనిసరి.

ఆఖరుదాకా ఆగవద్దు

ఐపీవో వచ్చినప్పుడు గంటల వ్యవధిలోనే రష్ పెరుగుతూ ఉంటుంది. కాబట్టి సమయం ఉన్నదికదా అని ఆఖరు గంటదాకా వేచిచూడవద్దు. చాలావరకు ఐపీవోలు 2 నుంచి 5 రోజుల వ్యవధితో పబ్లిక్ ఇష్యూలకు వస్తూంటాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. రోజులు గడుస్తున్నకొద్దీ సర్వర్లు హ్యాంగైపోవచ్చు. దీనివల్ల మీ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

సాంకేతిక సమస్యలపై..

దరఖాస్తు ఫారాల్లో బ్యాంక్/డీమ్యాట్ ఖాతాలు, ఇతరత్రా వివరాలను తప్పుగా పేర్కొనవద్దు. ఒకటికి రెండుసార్లు పరిశీలించి సరైన వివరాలనే ఇవ్వాలి. లేదంటే మీ అప్లికేషన్లు తిరస్కరణకు గురవుతాయి. ఐపీవోల్లో చాలావరకు బిడ్లు ఇలానే పోతుంటాయి.

మాతృ సంస్థలకు మద్దతుగా

మాతృ సంస్థల్లో మీకు షేర్లున్నట్టైతే వాటి అనుబంధ కంపెనీలు ఐపీవోలకు వచ్చినప్పుడు తప్పక దరఖాస్తు చేసుకోండి. మీ విశ్వసనీయత, దీర్ఘకాలిక అంకితభావం కారణంగా షేర్ల కేటాయింపుల్లో మీకు తొలి ప్రాధాన్యత దక్కగలదు. ఉదాహరణకు ఆర్ఐఎల్‌లో మీకు షేర్లున్నట్టైతే ఆ సంస్థకు అనుబంధంగా ఉన్న రిలయన్స్ జియో, రిలయన్స్ ఫ్రెష్, రిలయన్స్ జ్యుయెల్లర్స్ సంస్థలు ఐపీవోలకు వస్తే వాటి కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు మీకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది.

చివరగా..

ప్రస్తుతం ఐపీవో మార్కెట్ సందడిగా ఉన్నది. అనేక రంగాల్లోని కంపెనీలు, స్టార్టప్‌లు నిధుల సమీకరణ కోసం పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. కాబట్టి ఈక్విటీ మార్కెట్లలో మదుపుపై ఆసక్తి ఉన్నవారు పెద్దపెద్ద సంస్థలను కాకుండా.. చిన్నచిన్న సంస్థలను ఎంచుకొంటే లాభదాయకం. నష్టాలు వాటిల్లినా పెద్దగా అవి మన పెట్టుబడులకున్న అవకాశాల్ని దెబ్బతీయవు.

గరిష్ఠ ధరకే బిడ్డింగ్

ఐపీవోల్లో షేర్ల ధరల శ్రేణిని గమనించే ఉంటారు. రూ.70-75, రూ.150-160, రూ.500-515 ఇలా రకరకాల బ్యాండ్లలో ఈ ధరలను ప్రకటిస్తారు. ఇందులో మీరు గరిష్ఠ ధరలకు బిడ్డింగ్ చేసినప్పుడే మీకు షేర్లను దక్కించుకోవడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. ఉదాహరణకు ఐపీవో ప్రైస్ బ్యాండ్ రూ.92-97 మధ్య ఉన్నది. అప్పుడు రూ.97కు షేర్లను కొంటామని మీరు బిడ్లను దాఖలు చేయాలి. తొలి ప్రాధాన్యతగా మిమ్మల్ని పరిగణిస్తారు.



ఒక్క లాట్‌కే దరఖాస్తు

ఐపీవోలో అలాట్‌మెంట్ దక్కాలంటే సింగిల్ లాట్‌కే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. అప్పుడే మీకున్న అవకాశాలు పెరుగుతాయి. సాధారణంగా చిన్న రిటైల్ మదుపరులను ప్రోత్సహించడానికి అలాట్‌మెంట్లలో వారికి తగిన ప్రాధాన్యాన్నిస్తారు. కనుక ఒక్క లాట్‌లోనే దరఖాస్తు చేసుకున్నవారికి ప్రయోజనం ఉంటుంది. ఒక్కో లాట్‌లో సాధారణంగా 100 షేర్లుంటాయి.



ఆర్థిక లక్ష్యాలకు అవరోధాలివే..


ప్రతీ ఒక్కరికీ వారివారి ఆర్థిక లక్ష్యాల సాధనకు నగదే ప్రధానం. కానీ ఆ నగదు పొదుపు విషయంలో అనేక అడ్డంకులు వస్తున్నాయి. అందుకే పట్టుదల, క్రమశిక్షణ, సరైన వ్యూహాలుండాలి. అప్పుడే ఫైనాన్షియల్ గోల్స్ సాకారం కాగలవు. అసలు ఆర్థిక లక్ష్యాల సాధనను ఏవి పక్కదారి పట్టిస్తున్నాయో చూస్తే..

క్రమశిక్షణారాహిత్యం

క్రమశిక్షణ లేకపోవడం వల్ల ఆర్థిక లక్ష్యాల సాధన జటిలంగా మారుతుంది. ఉదాహరణకు మార్కెట్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్ కనిపించిందని, ఇప్పుడున్న ఫోన్ బాగున్నా కొనేయడం అక్షరాలా దుబారానే. అలాగే అనవసరపు టూర్లతోనూ లేనిపోని ఖర్చే. ఇలాంటివన్నీ చాపకింద నీరులా మీ ఆర్థిక లక్ష్యాలను దెబ్బతీస్తాయని మరువద్దు.

ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకొని మన ఆదాయాలను పెంచుకుంటూపోవాలి. లేకపోతే మన సంపాదన, పొదుపును పెరిగే ధరలు మింగేస్తాయి. అది పిల్లల చదువుకయ్యే ఖర్చులు కావచ్చు లేదా మనం కొనాలనుకునే ఇల్లు కావచ్చు ఏదైనాసరే రోజులు గడుస్తున్నకొద్దీ మరింత ఎక్కువగా నగదును పెట్టాల్సి వస్తుందని మరువద్దు.



అత్యవసరాలు

జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేం. ముఖ్యంగా వైద్యవసరాలు ఎలా ఉంటాయో కూడా తెలియదు. అనుకోని ఆరోగ్య సమస్యలతో కూడా ఆర్థిక లక్ష్యాలు దెబ్బతింటాయి.

మార్కెట్ ఒడిదొడుకులు

మార్కెట్‌లో నెలకొనే ఒడిదొడుకులు కూడా ఆర్థిక లక్ష్యాలకు ఆటంకమే. పెట్టిన పెట్టుబడుల్లో రాబడులు తగ్గి అనుకున్న స్థాయిలో నగదు సమీకరణలు కష్టమవుతాయి. కాబట్టి మన చేతిలో లేనివాటికి మనం ఏమీ చేయలేం. ఉన్నవాటికైనా జాగ్రత్తతో ముందుకెళ్తే అనుకున్నది సాధిస్తాం.

మదుపర్లూ అప్రమత్తత అవసరం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు ఆల్‌టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకే పెద్దపీట వేస్తున్నారు. గత వారం ట్రేడింగ్‌లో శుక్రవారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,360, నిఫ్టీ 375 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీగానే ఎగిశాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,653.37 పాయింట్లు ఎగబాకి తొలిసారి 84వేల మార్కును దాటి ఆల్‌టైమ్ హై 84,544.31 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 434.45 పాయింట్లు ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 25,790.95 దగ్గర ముగిసింది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందంటూ మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉన్న విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 25,400 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 26వేల మార్కును నిఫ్టీ తాకవచ్చు. 26,100-26,400 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.



ఇంటికీ బీమా రక్షణ

గృహమే కదా స్వర్గసీమ అన్నారు పెద్దలు. మరి ఆ ఇంటికీ రక్షణ ఉండాలి కదా. అందుకే ఇండ్లకూ ఇన్సూరెన్స్‌లొచ్చేశాయ్. గృహ బీమాను ప్రాపర్టీ ఇన్సూరెన్స్ లేదా హోమ్ ఓనర్ ఇన్సూరెన్స్‌గా కూడా పిలుస్తారు. ఎక్స్‌టీరియర్-ఇంటీరియర్ డ్యామేజీలకు కవరేజీనిస్తుంది. ఇంట్లోని వస్తుసామాగ్రికి కూడా బీమా రక్షణ లభిస్తుంది. ఇంట్లో దురదృష్టవశాత్తూ జరిగే ఏదైనా ప్రమాదాలకూ వర్తిస్తుంది. హోమ్ ఇన్సూరెన్స్ సదుపాయాన్ని ఎస్బీఐ, శ్రీరామ్ జనరల్, బజాజ్ అలియాంజ్, భారతీ యాక్సా, రాయల్ సుందరం, రిలయన్స్, రహేజా క్యూబీఈ, ఓరియంటల్, న్యూ ఇండియా అష్యూరెన్స్, నేషనల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరాలీ, చోళమండలం వంటి సంస్థలు అందిస్తున్నాయి. ఇండ్ల యజమానులు, అద్దెకుండే వారు ఈ బీమాను తీసుకోవచ్చు. కొన్ని సంస్థలు హౌజింగ్ సొసైటీలకూ బీమాను కల్పిస్తున్నాయి. తీవ్రవాదుల దాడి, భూకంపాల్లో ధ్వంసమైనా బీమాను ఇస్తామని మరికొన్ని సంస్థలు ప్రకటిస్తున్నాయి.

కవరేజీ ఇలా..

షరతులు, ప్రీమియంలనుబట్టి ఆయా సంస్థలు.. అగ్ని ప్రమాదాలు, డాక్యుమెంట్ల నష్టం, దొంగతనాలు, గృహోపకరణాల డ్యామేజీ, వ్యక్తిగత ప్రమాద బీమా, అద్దె ఎగవేత, పెంపుడు జంతువుల సంరక్షణ, ఇల్లు పూర్తిగా దెబ్బతింటే ప్రత్యామ్నాయ వసతి ఖర్చులు, బ్యాగేజీ నష్టం, థర్డ్ పార్టీ-ఎంప్లాయ్ లయబిలిటీస్, ఎలక్ట్రికల్ ఫెయిల్యూర్ కవరేజీలను అందిస్తున్నాయి. ఇంట్లోని విలువైన ఎలక్ట్రిక్-ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫర్నీచర్, ఆభరణాలకూ బీమా కవరేజీ ఉంటుంది. ప్రకృతి విపత్తుల్లో ధ్వంసమైనా, అల్లర్లతో ప్రభావితమైనా ఇన్సూరెన్స్‌ను పొందవచ్చు. ఒకవేళ గృహ రుణం పరిధిలో ఇల్లు ఉన్నట్టైతే ప్రీమియంలు అధికంగా ఉంటాయి.

పాలసీ కాలపరిమితి

గృహ బీమా పాలసీలు దీర్ఘకాలానికిగాను కొనుక్కోవచ్చు. అలాగే కనిష్ఠంగా ఏడాది కాల పరిమితితో కూడా తీసుకోవచ్చు. ఇండిపెండెంట్ హౌజ్‌లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లకు అనుగుణంగా ఈ పాలసీల కవరేజీని ఎంచుకోవచ్చు. నివాస ప్రాంతాన్నిబట్టి, పాలసీ వ్యవధి ఆధారంగా ప్రీమియంలుంటాయి. అయితే వాటిల్లిన నష్టానికి కారణం ఉద్దేశపూర్వక చర్యేనని తేలితే బీమా వర్తించదు.

'పుష్పక్' ప్రయాణికులకు 10% రాయితీ

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం ఎంతోమంది ప్రయాణికులు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు పుష్పక్ బస్సుల్లో వెళ్తుంటారు. వారి కోసం బస్సు టికెట్ ధరలో 10శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్టు టీజీఎస్ఆర్టీసీ ప్రకటించింది. ముగ్గురు లేదా అంతకన్నా ఎక్కువ మంది కలిసి గ్రూప్‌గా వెళ్తే.. వారికి అదనంగా మరో 10 శాతం కలిపి మొత్తం 20 శాతం డిస్కౌంట్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ఆఫర్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు వర్తించనున్నట్టు తెలిపింది.

అయోధ్యలో పూజలకు శంకరాచార్య తిరస్కరణ

అయోధ్య: రామ జన్మభూమిలోని రామాలయంలో పూజలు చేసేందుకు ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్మఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి ఆదివారం తిరస్కరించారు. నిర్మాణం పూర్తి కాని దేవాలయంలో తాను పూజలు చేయనని చెప్పారు. అవిముక్తేశ్వరానంద ఆదివారం అయోధ్య నుంచి గో ధ్వజ స్థాపన భారత్ యాత్రను ప్రారంభించారు. అయోధ్యలోని సాధు, సంతులతో సమావేశమయ్యారు. గో రక్షణ కోసం చట్టాలను ఆమోదించాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో ఉగ్ర కలకలం

- సిటీలో 6 నెలలు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మకాం
- స్వాతంత్ర్య దినోత్సవాల్లో భారీ విధ్వంసానికి కుట్ర
- ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులకు చిక్కిన అబ్దుల్ రిజ్వాన్
- సైదాబాద్ శంకేశ్వర్‌బజార్‌లో ఎన్ఐఏ సోదాలు



ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించిన సైదాబాద్ శంకేశ్వర్‌బజార్‌లోని గ్రీన్ వ్యూ అపార్టుమెంట్.

హైదరాబాద్ సిటీబ్యూరో/సైదాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో తాజాగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోదాలు నిర్వహించడం కలకలాన్ని రేపింది. దేశంలో విధ్వంసాలకు కుట్ర పన్నిన కేసులో పట్టుబడిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అబ్దుల్ రిజ్వాన్ అలీని వెంటబెట్టుకుని ఆదివారం ఉదయం ముంబై నుంచి 3 వాహనాల్లో వచ్చిన ఎన్ఐఏ అధికారులు.. హైదరాబాద్ పోలీసుల సహకారంతో సైదాబాద్ శంకేశ్వర్‌బజార్‌లోని గ్రీన్‌వ్యూ అపార్టుమెంట్‌లో గంటకుపైగా తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాల తయారీలో నిష్ణాతుడైన రిజ్వాన్‌కు అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో సంబంధాలున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఐసిస్ తరఫున పుణె నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న రిజ్వాన్ గతంలో కొంత కాలంపాటు సైదాబాద్‌లో ఉన్నట్టు ఎన్ఐఏ విచారణలో తేలడంతో అతని వివరాల కోసం గ్రీన్‌వ్యూ అపార్ట్‌మెంట్ యజమానితోపాటు ఆ చుట్టుపక్కల వారిని ఎన్ఐఏ అధికారులు ఆరా తీశారు. సైదాబాద్‌లోని కుర్మగూడ ప్రాంతానికి చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, ప్రస్తుతం పాకిస్థాన్‌లో తలదాచుకున్న ఫర్హతుల్లా ఘోరీతో రిజ్వాన్‌కు పరిచయం ఉన్నది. ఈ నేపథ్యంలో ఘోరీ ఈ ఏడాది మార్చిలో రిజ్వాన్‌ను హైదరాబాద్ పంపడంతో అతను సైదాబాద్‌లో కిరాయి ఇండ్లను వెతికాడు. శంకేశ్వర్‌బజార్‌లోని గ్రీన్‌వ్యూ అపార్టుమెంట్‌లో 'టూ-లెట్' బోర్డును చూసి ఆ ఫ్లాట్ యజమానిని సంప్రదించాడు. బట్టల వ్యాపారం చేస్తున్నానంటూ నమ్మించి రూ.4 వేలకు ఫ్లాట్‌ను కిరాయికి తీసుకున్నాడు. 6 నెలలపాటు అక్కడే ఉండి తరచూ కేరళ, ఉత్తరప్రదేశ్‌కు రాకపోకలు సాగించిన రిజ్వాన్.. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భారీ విధ్వంసం సృష్టించాలని ప్లాన్ చేశాడు. అందులో భాగంగా గత నెల మొదటి వారంలో హస్తినకు వెళ్లిన రిజ్వాన్‌ను ఢిల్లీ-ఫరీదాబాద్ సరిహద్దు ప్రాంతంలోని గంగాబక్ష్ వద్ద ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 30 బోర్ పిస్టల్, 3 కార్ట్రిడ్జ్‌లు, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, రిజ్వాన్‌పై పుణెలో నమోదైన కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తున్నది. రిజ్వాన్‌పై రూ.3 లక్షల రివార్డు ప్రకటించిన ఎన్ఐఏ పీటీ వారెంట్‌పై అతడిని అరెస్టు చేసి విచారణ జరపడంతో గతంలో 6 నెలలపాటు హైదరాబాద్‌లో ఉన్నట్టు వెల్లడించాడు.

రిజ్వాన్ నేపథ్యం ఇదీ..



ఢిల్లీ పోలీసులకు చిక్కిన అబ్దుల్ రిజ్వాన్ 2015-16లో డిగ్రీ పూర్తి చేశాడు. ఆ సమయంలో ఐసిస్ వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు చూసి ఆకర్షితుడయ్యాడు. అనంతరం సొంత రాష్ట్రమైన జార్ఖండ్ నుంచి ఢిల్లీకి వచ్చి షహీన్‌బాగ్‌లో స్థిరపడిన రిజ్వాన్.. 2017లో అక్కడ షానవాజ్ అనే ఉగ్రవాదితో పరిచయం పెంచుకున్నాడు. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సేకరించడం, యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడంతోపాటు ఐసిస్ మాడ్యూల్‌ను యూపీ, ఉత్తరాఖండ్, జార్ఖండ్, మహారాష్ట్రకు విస్తరించడంలో కీలకపాత్ర పోషించాడు. నిరుడు జూన్‌లో పుణె పోలీసులు షానవాజ్ గ్యాంగ్‌లోని పలువురిని అరెస్ట్ చేసినప్పటికీ రిజ్వాన్ తప్పించుకున్నాడు. దీంతో రిజ్వాన్‌ను ఎన్ఐఏ మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదిగా గుర్తించి అతనిపై రూ.3 లక్షల రివార్డు ప్రకటించింది.



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న కృష్ణయ్య, బీసీ నేతలు

బీసీ రిజర్వేషన్లు పెంచకుంటే యుద్ధమే

- మొక్కుబడిగా కులగణన చేస్తామంటే ఒప్పుకోం
- 42 శాతం పెంచాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం నేత ఆర్ కృష్ణయ్య
- తెలంగాణ చివరి ఓసీ సీఎం రేవంత్‌రెడ్డే: తీన్మార్ మల్లన్న

ఖైరతాబాద్, సెప్టెంబర్ 22 : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధం తప్పదని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని హోటల్ అశోకాలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడమే లేదని చెప్పారు. మొక్కుబడిగా కులగణన చేస్తామంటే ఒప్పుకునేది లేదని, 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేమెంతో మాకంత అన్న నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే అవుతారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర క్యాబినెట్‌లోనూ బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర నాయకులు లాల్‌కృష్ణ, వివిధ బీసీ సంఘాల నాయకులు వేముల వెంకటేశ్, గుజ్జ సత్యం, ఎర్ర సత్యనారాయణ, శ్రీనివాస్, జనార్దన్, జయంత్‌రావు, జగన్‌మోహన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్తకు 1.43 కోట్ల కుచ్చుటోపీ

మంచిర్యాలలో సైబర్ మోసం

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 22: మంచిర్యాలలో భారీ సైబర్ మోసం వెలుగుచూసింది. ఓ వ్యాపారవేత్తకు ఫోన్ చేసి బెదిరించి రూ.1.43 కోట్లు లూటీ చేసిన ఘటన ఆలస్యంగా బయటపడింది. ఆదివారం రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, సీఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన ఓ ప్రముఖ వ్యాపారవేత్తకు గత జూలై 22న గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'హలో నేను ముంబై పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్న. మీపై మనీ లాండరింగ్ కేసు నమోదైంది. ఈ కేసు నుంచి బయటపడాలంటే మేం చెప్పిన ఖాతాకు డబ్బు పంపించాలి. మీ డబ్బును చెక్ చేసిన తర్వాత తిరిగి మీ అకౌంట్‌కు పంపిస్తాం. లేదంటే జైలుకు వెళ్లక తప్పదు' అంటూ బెదిరించడంతో బాధితుడు వణికిపోయాడు. భయంతో అతడు చెప్పిన విధంగా రూ.1,43,75,000 పలు దఫాలుగా బదిలీ చేశాడు. డబ్బులు తిరిగి తన ఖాతాకు రాకపోవడంతో మోసపోయినట్టు గుర్తించాడు. అప్పట్లోనే 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయగా సైబర్‌క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. బాధితుడు మనీ ట్రాన్స్‌ఫర్ చేసిన బ్యాంక్ అకౌంట్ మహారాష్ట్రలోని వాసిం జిల్లాకు చెందిన సంతోశ్ శ్రీకృష్ణ నాగల్కర్‌దిగా గుర్తించారు. మహారాష్ట్రకు వెళ్లి ముఠా సభ్యుడిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతని అకౌంట్‌కు వచ్చిన డబ్బులు మరో ఖాతాకు బదిలీ అయిన విషయం తెలుసుకున్నారు. తాను కమీషన్ మాత్రమే తీసుకుంటానని, డబ్బులు తీసుకునేది వారే వారని చెప్పాడు. అతడి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని, అసలు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. ఈ నిందితుడి ఖాతా ద్వారా ఇప్పటివరకు 18 సైబర్ నేరాలు జరిగినట్టు పోలీసులు గుర్తించారు.

ఆ సినిమా ఆడొద్దు ఎంఎన్ఎస్ హెచ్చరిక

ముంబై, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : పాకిస్థానీ నటుడు ఫవాద్ ఖాన్ చిత్రం 'లెజెండ్ ఆఫ్ మౌలా జాట్'ను మహారాష్ట్రలో విడుదల చేయరాదని ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్‌థాకరే హెచ్చరించారు. పాకిస్థానీ నటుల చిత్రాలను భారతదేశంలో ఎందుకు విడుదల చేయడానికి అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. సకాలంలో చర్యలు తీసుకుని, ఈ సినిమా విడుదల కాకుండా చూడాలని ముఖ్యమంత్రి, హోం మంత్రి, డీజీపీలను కోరారు. కళకు సరిహద్దులు తెలియవని, అయితే, భారతదేశాన్ని ద్వేషించే దేశం ఏదైనా, ఆ దేశ చిత్రం మహారాష్ట్రలో విడుదల చేయకూడదని అన్నారు. థియేటర్ల యజమానులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ సినిమా విడుదలయ్యే సమయానికి నవరాత్రి ఉత్సవాలు మొదలవుతాయన్నారు.

• రామప్ప ఉపాలయంలో గుప్తనిధుల వేట



ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయ ఉపాలయం గొల్లగుడిలో దుండగులు గుప్తనిధుల కోసం ఆలయ పైకప్పు ధ్వంసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రామప్ప దేవాలయానికి పడమర వైపు గల రామప్ప చెరువుకు వెళ్లే దారిలోని గొల్లగుడి పైకప్పు భాగంలో రెండు చోట్ల రాళ్లను తొలగించారు. గుప్తనిధుల కోసమే దుండగులు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పురావస్తు శాఖ సిబ్బంది ఆదివారం శుభ్రం చేయడానికి వెళ్లగా ఆలయంలో ధ్వంసం అయినట్టు గ్రహించి ఉన్నతాధికారులకు సమాచారం అందించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. -వెంకటాపూర్

గిరిజన గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించండి

- జేఏసీతో కలిసి నిరసన కార్యచరణకు ప్రణాళిక
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశలవారీగా నిరసనలు
- గిరిజన గురుకుల ఉపాధ్యాయ సంఘం వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గిరిజన గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు కొన్ని రోజులుగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్లు పరిష్కారానికి దశలవారీగా నిరసన తెలుపాలని నిర్ణయించారు. అయితే గిరిజన గురుకుల ఉపాధ్యాయులు జేఏసీగా ఏర్పడి ఉమ్మడి సమస్యల పరిష్కారానికి సర్కారును డిమాండ్ చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం గురుకుల ఉపాధ్యాయులకు సంబంధించి రెండు జేఏసీలు ఏర్పడ్డాయి. అందులో ఒక జేఏసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులను సంప్రదిస్తూ వినతి పత్రాలు అందజేస్తున్నది. మరో జేఏసీ ఒకటి రెండు రోజులలో తమ డిమాండ్ల సాధనకు సర్కారుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు ప్రకటించబోతున్నది. గిరిజన సంక్షేమ గురుకులాలతోపాటు అన్ని సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని గురుకులాల్లో పాత టైంటేబుల్‌ను అమలు చేయాలని, విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచాలని, 010 పద్దు కింద సొసైటీ టీచర్లకు జీతాలు చెల్లించాలని, కామన్ సర్వీసు రూల్స్‌ను అమలు చేయాలని, ఇలా అనేక సమస్యలు పరిష్కారానికి ఈ రెండు జేఏసీలు పోరాడుతున్నాయి.

ఫీజు ఇవ్వలేదని కుట్లు తొలగింపు

కామారెడ్డిలో ప్రైవేట్ దవాఖాన పైశాచికం

కామారెడ్డి, సెప్టెంబర్ 22: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడికి కుట్లు వేసినందుకు ఫీజు చెల్లించకపోవడంతో.. వేసిన కుట్లను తొలగించారు ఓ ప్రైవేట్ దవాఖాన సిబ్బంది. ఈ అమానవీయ ఘటన కామారెడ్డి కేంద్రంలో ఆదివారం చోటుచేసున్నది. పట్టణానికి చెందిన శ్రీను అనే యువకుడు బైక్ అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. రక్తస్రావం కావడంతో స్థానిక ప్రైవేట్ దవాఖానకు వెళ్లి, డాక్టర్ (కన్సల్టేషన్) ఫీజు రూ. 300 చెల్లించి చూపించుకున్నాడు. ప్రమాదంలో తగిలిన గాయాలకు దవాఖాన సిబ్బంది కుట్లు వేశారు. అయితే కుట్ల వేసినందున డబ్బులు అడిగారు. తన వద్ద నగదు లేకపోవడంతో క్రెడిట్ కార్డు ద్వారా ఫీజు తీసుకోవాలని చెప్పడంతో దవాఖాన సిబ్బంది నిరాకరించారు. అంతటితో ఆగకుండా సిబ్బంది యువకుడితోపాటు వెంట ఉన్న స్నేహితులపై దాడికి పాల్పడ్డారు. దీంతో యువకుడి బంధువులు దవాఖాన వద్ద ఆందోళనకు దిగడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. చివరికి దవాఖాన సిబ్బంది యువకుడికి వేసిన కుట్లను విప్పేసి పంపించి వారిలోని పైశాచికత్వాన్ని చాటుకున్నారు. అనంతరం సదరు యువకుడిని స్నేహితులు ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు.

విద్యాశాఖకు కొత్తబాస్‌లు

- ఇది వరకు ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయిలో నిర్ణయాలు
- ఇప్పడేమో క్యాబినెట్ సబ్ కమిటీ.. విద్యాకమిషన్‌లు

హైదరాబాద్, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ): ఇప్పుడు విద్యాశాఖకు కొత్తబాస్‌లొచ్చారు. కొత్తగా వచ్చారంటే బదిలీపై వచ్చారని కాదు.. వారు వచ్చింది విద్యాశాఖ నిర్ణయాల్లో జోక్యం చేసుకునే విషయంలో. ఇంతకు ఎవరంటే వారు... ముగ్గురు మంత్రుల నేతృత్వంలోని క్యాబినెట్ సబ్‌కమిటీ ఒకటి కాగా, విద్యా కమిషన్ మరోటి. ప్రభుత్వ స్థాయిలో ఏదైనా కీలక నిర్ణయం తీసుకోవాలంటే ఇదివరకు అధికారులు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రతిపాదనలు పంపించేవారు. వాటిని విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలనకు పంపించేవారు. ఇవి ఆమోదం పొందడమో.. లేక తిరస్కరణకు గురవడమో జరిగేవి. కానిప్పుడు కొత్తగా విద్యాసంస్కరణలపై ముగ్గురు మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఇటీవలే విద్యా కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీంతో విద్యాశాఖకు కొత్త బాస్‌లొచ్చినట్లైంది. ఇక నుంచి ఎలాంటి కొత్త నిర్ణయాలు తీసుకోవాలన్నా.. ఈ రెండింటి పరిశీలనకు పంపాల్సి ఉంది. వీటి ఆమోదం తీసుకున్న తర్వాతే అవి కార్యరూపందాల్చుతా యి. ఇలా కొత్త బాస్‌లు, రెండు, మూడు అంచెల్లో చర్చించి నిర్ణయాలు తీసుకోవడంతో పలు కీలక నిర్ణయాలు ఆలస్యమయ్యే అవకాశముందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఎంప్లాయిస్ జేఏసీలో 205 సంఘాలు

- రేపు జేఏసీ కార్యవర్గ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఏర్పడిన తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీలో 205 సంఘాలు భాగస్వామ్యమయ్యాయి. ఉమ్మడి ఏపీలో 117 సంఘాలు ఉండగా, తాజాగా 205 సంఘాలు తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీలో చేరినట్టు తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయిస్ జేఏసీ కార్యవర్గ సమా వేశాన్ని 24న బాగ్‌లింగంపల్లిలోని సుందయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశం అనంతరం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సన్మాన సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంగళవారమే జేఏసీ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటుచేస్తామని, అనంతరం జిల్లా జేఏసీలు ఏర్పాటవుతాయని తెలిపారు.

ఇరాన్ బొగ్గు గనిలో భారీ పేలుడు

51మంది కార్మికులు మృతి

టెహరాన్, సెప్టెంబర్ 22: ఇరాన్‌లోని ఓ బొగ్గు గనిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం రాత్రి దక్షిణ ఖోర్సాన్ ప్రావిన్స్‌లోని బొగ్గు గనిలో భారీ పేలుడు సంభవించి, 51మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారని ఆ దేశ ప్రభుత్వ మీడి యా ఆదివారం తెలిపింది. మడాంజూ అనే కంపెనీ ఆధ్వర్యంలోని బొగ్గు గని బీ, సీ బ్లాకుల్లో మీథేన్ వాయువు లీకై, పేలుడు సంభవించిందని, గని లోపల శిథిలాల కింద 24 మంది చిక్కుకుపోయారని తెలిసింది. గనిలో మొత్తం 69మంది కార్మికులు పనిచేస్తున్నారని స్థానిక మీడియా పేర్కొన్నది.

దామగుండం అడవిని రక్షించుకుందాం

- 12 లక్షల చెట్ల నరికివేతతో అటవీ విధ్వంసం
- అడవిని పెంచాకే రాడార్ కేంద్రం పెట్టుకోవాలి
- నాడు బీఆర్ఎస్ వ్యతిరేకిస్తే.. కాంగ్రెస్ అనుమతి
- ఢిల్లీ దాకా పరిరక్షణ ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం
- సేవ్ దామగుండం జేఏసీ ధర్నాలో వక్తల పిలుపు



ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న వక్తలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 22: వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం పరిధిలోని దామగుండం అడవిని పరిరక్షించుకుందామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆ అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు పేరుతో 12 లక్షల చెట్ల నరికివేత నిర్ణయాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. సేవ్ దామగుండం జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు, పౌరసంఘాల, విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ, ఉద్యోగ, న్యాయ, కార్మిక, సామాజిక మహిళా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ హైడ్రా పేరుతో చెరువులను కుంటాలను కాపాడుతున్నామని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. తన సొంత జిల్లాలోనే ఇంత విధ్వంసం జరుగుతుంటే పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. దామగుండం అడవిని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కోరారు. పర్యావరణాన్ని, అభివృద్ధిని బ్యాలెన్స్ చేయకపోతే వయనాడ్, ఉత్తరాఖండ్ వంటి ప్రకృతి విలయాలు చూడాల్సి వస్తుందని మాజీ ఎమ్మెల్సీ ప్రొపెసర్ నాగేశ్వర్ హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి పర్యావరణ నష్టం రిపోర్టు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. మొట్టమొదట 12 లక్షల మొక్కలు నాటి అది అడవైన తర్వాతే నేవీ రాడార్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని సూచించారు. అడవినే ఒక ఆస్తిగా చూడాలని ప్రముఖ పర్యావరణ వేత్త దుశ్చర్ల సత్యనారాయణ కోరారు. 1956లో తెలంగాణలో ఆంధ్ర రాష్ట్రం కలిసిన తర్వాతే ప్రకృతి విధ్వంసం మొదలైందని, ఇది భవిష్యత్తు తరాల సమస్య అని చెప్పారు. హైదరాబాద్ వాసులు మాస్కులు పెట్టుకొని బతికే పరిస్థితులను రానీయొద్దని దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కోరారు.

తెలంగాణ ఊటీని కాపాడుకుందాం: మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్

తెలంగాణ ఊటీ అయిన దామగుండాన్ని కాపాడుకుందామని, దానికి బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉంటుందని ఆ పార్టీ పరిగి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్ తెలిపారు. రాడార్ కేంద్రం ఏర్పాటు కోసం 2018లో కేంద్ర ముందుకొస్తే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆపిందని చెప్పారు. కానీ రేవంత్‌రెడ్డి సర్కారు మాత్రం అధికారంలోకి వచ్చిన వెంటనే దాని ఏర్పాటుకు సంతకం పెట్టిందని విమర్శించారు. ఢిల్లీకి వెళ్లి ధర్నా చేయడానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. 12 లక్షల చెట్లను నరకడం దుర్మార్గమని, అడవిని రక్షించే దిశగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇక్కడితో అపపకుండా ఢిల్లీ వరకు ఉద్యమాన్ని తీసుకువెళ్లాలని దామగుండం జేఏసీ ఈ సందర్భంగా తీర్మానించింది. కార్యక్రమంలో దామగుండం జేఏసీ కోఆర్డినేటర్లు రామన్న మాదిగ, జర్నలిస్టులు తులసీ చందు, గీత, సిరాజ్, దామగుండం రామలింగేశ్వర ఆలయ పూజారి సత్యానంద స్వామి, సంధ్య, విమలక్క, దామగుండం మాజీ సర్పంచ్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



వరదలో చిక్కుకున్న పశువుల కాపరులను పొక్లెయినర్ సహాయంతో కాపాడిన పోలీసులు

మూసీలో చిక్కుకున్న పశువుల కాపరులు

ఇద్దరిని కాపాడిన పోలీసులు • హెచ్చరికలు లేకుండానే గేట్లు ఎత్తిన అధికారులు

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 22(నమస్తే తెలంగాణ) : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యం పశువుల కాపరుల ప్రాణాల మీదకు తెచ్చింది. ముందస్తు హెచ్చరికలు లేకుండా అధికారులు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో దిగువ ప్రాంతంలో ఉన్న పశువుల కాపరులు వరదలో చిక్కుకుపోయారు. హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో మూసీ ప్రాజెక్టు అధికారులు ఆదివారం మధ్యాహ్నం కేవలం సైరన్ మోగించి మూడు గేట్లు ఎత్తి నీటిని వదిలారు. ఇది తెలియని మూసీ పరీవాహక ప్రాంతంలోని గ్రామాల పశువుల కాపరులు మేతకు, ఇసుక వ్యాపారులు వాగులో ఇసుక తీసేందుకు వెళ్లారు. గేట్లు ఎత్తడంతో ఒక్కసారిగా వచ్చిన వరద వారిని చుట్టుముట్టింది. కేతపల్లి మండలం భీమారం వద్ద దిగువ ప్రాంతంలో ఒక్కసారిగా నీరు చేరడంతో మధ్యలో పశువుల కాపరులు గంగయ్య, బాలయ్య చిక్కుకుపోయారు. వాగు మధ్యలో ఉన్న పెద్ద బండ రాయిని ఎక్కి సహాయం కోసం ఆర్తనాదాలు చేశారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాలతో స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. మూడు గంటలపాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి పశువుల కాపరులను పొక్లెయినర్ సాయంతో బయటకు తీసుకురావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే 20 బర్రెలతోపాటు ట్రాక్టర్ వరదలో కొట్టుకుపోయినట్టు సమాచారం.



తిమ్మాయిపల్లి చెరువులోకి ట్యూబ్‌పై వెళ్తున్న వాటర్‌మెన్ కురుమయ్య

చెరువు మధ్యలో బోరుకు మరమ్మతులు

- ట్యూబ్‌పై నీటిలోకి వెళ్లి పనులు
- వాటర్‌మెన్ చొరవకు ప్రశంసలు

మూసాపేట(అడ్డాకుల), సెప్టెంబర్ 22 : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లిలో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వెంటనే స్పందించిన వాటర్‌మెన్ పెద్ద కురుమయ్య ఆదివారం లారీ ట్యూబ్‌పై చెరువు మధ్యలోకి వెళ్లి బోరు మోటర్‌కు విద్యుత్ సరఫరా అందించారు. అలాగే బోరుకు మరమ్మతు చేసి వాటర్ ట్యాంకుకు నీటి సరఫరా ప్రారంభించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.

1.93 లక్షల చెట్లే తొలగింపు

- దామగుండం అడవుల్లో తొలగించే సంఖ్య ఇదే
- 12 లక్షల చెట్ల తొలగింపు అంటూ అసత్య ప్రచారం
- రాడార్ ఏర్పాటుతో కోల్పోయే చెట్లను పునరుద్ధరిస్తాం
- తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధానాధికారి డోబ్రియాల్



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా దామగుండం అడవుల్లో తూర్పు నౌకాదళ రాడార్ స్టేషన్‌ను నెలకొల్పేందుకు 12 లక్షల చెట్లను తొలిగించనున్నారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధానాధికారి రాకేశ్ మోహన్ డోబ్రియాల్ తెలిపారు. ఫారెస్ట్ అడ్వైజరీ అథారిటీ 1,93,562 చెట్లను మాత్రమే రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం తొలిగిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాడార్ ఏర్పాటుకోసం 12 లక్షల చెట్లను తొలిగించనున్నారని వస్తున్న వార్తలు నిరాధారమైనవనీ, అసంబద్ధమైనవని చెప్పారు. రాడార్ ప్రాజెక్టు నిర్మాణ కోసం కేటాయించిన మొత్తం అటవీ భూముల్లో 48 శాతం విస్తీర్ణం మాత్రమే రాడార్ స్టేషన్ నిర్మాణానికి ఉపయోగిస్తారని, మిగతా 52 శాతం విస్తీర్ణంలోని అటవీ సంపదకు ఎలాంటి హానీ జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో కోల్పోనున్న 1,93,562 చెట్లకు బదులుగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అడవుల్లోని 2,348 హెక్టార్లలో విస్తరించి ఉన్న 17,55,070 చెట్లను అటవీశాఖ పునరుద్ధరించనున్నదని డోబ్రియాల్ తెలిపారు. ఈ ప్రాంతంలో 500 ఏండ్లుగా కొలువై ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా తరలిస్తున్నారనే వాదననూ డోబ్రియాల్ ఖండించారు. ఈ ప్రాంతంలో 32 ఎకరాల 10 గుంటల్లో విస్తరించిన ఈ ఆలయంతోపాటు, అనుబంధంగా ఉన్న కొలను అలాగే కొనసాగుతాయని, ఆలయాన్ని సందర్శించే భక్తులకు నేవీ అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని స్పష్టం చేశారు.

‘రాడార్ స్టేషన్’తో పెనుముప్పు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తేతెలంగాణ) : వికారాబాద్ జిల్లా దామగుండంలో రాడార్ స్టేషన్ నిర్మాణంతో పర్యావరణానికి పెనుముప్పు కలుగనున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అటవీ ప్రాంతంలోని 3 వేల ఎకరాల్లో రాడార్ స్టేషన్ నిర్మిస్తే.. లక్షలాది వృక్షాలు, వన్యప్రాణులకు నష్టం వాటిల్లే ప్రమా దం పొంచిఉందని ఆవేదన వ్యక్తంచేశారు. వేరేచోట నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.



హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ చెరువుకు పడిన గండి

బూరుగడ్డ చెరువుకు మళ్లీ గండి

నిలిచిన రాకపోకలు

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 22: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామ నల్లచెరువుకు శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మళ్లీ గండిపడింది. గత నెల 24న కురిసిన వర్షాలతో వరద ప్రవాహానికి నల్లచెరువుకు గండి పడటంతో గోపాలపురం– బూరుగడ్డ గ్రామాల మధ్యగల రోడ్డు కొట్టుపోయింది. దాంతో పదిరోజులపాటు రాకపోకలు నిలిచిపోయి సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందిపడ్డారు. మంత్రి ఉత్తమ్ ఆదేశాలతో ఆ తర్వాత అధికారులు తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. కాగా శనివారం కురిసిన వర్షపు నీటితోపాటు నాగార్జునసాగర్ జలాలు వచ్చి చేరడంతో వరద పెరిగింది. కట్ట తెగిపోయే ప్రమాదం ఉండటంతో జేసీబీతో కొంత భాగాన్ని తొలగించి గండి పెట్టి నీటిని దిగువకు వదిలారు. గండి పెరిగి కర్కకాయలగూడెం, మాచవరం, బూరుగడ్డ గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. త్వరగా మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పీఆర్సీ మరింత ఆలస్యం!

- ఈ నెలాఖరుతో ముగియనున్న కమిటీ గడువు
- మరో 3 నెలలు పొడిగించే అవకాశం
- జాప్యంపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల గుర్రు

హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వేతన సవరణకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నది. తాజా సమాచారం ప్రకారం పీఆర్సీ నివేదిక సమర్పణకే మరో మూడు నుంచి ఆరు నెలల సమయం పట్టనున్నది. ఇప్పటికే పీఆర్సీ జాప్యంతో సర్కారుపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు గుర్రుగా ఉన్నాయి. కమిటీ గడువును పొడిగించే అంశం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. ఉద్యోగుల వేతన సవరణ సిఫారసులకు 2023 అక్టోబర్ 2న గత కేసీఆర్ ప్రభుత్వం పీఆర్సీ కమిటీని నియమించింది. ఈ కమిటీ 6 నెలల్లోపు పూర్తి నివేదిక ఇవ్వాలని అప్పట్లో ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఈ గడువు ఈ ఏడాది ఏప్రిల్ 2తో ముగియాల్సి ఉండగా, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో కమిటీ గడువును మరో ఆరు నెలలు పొడిగించగా ఈ నెలాఖరుతో ముగియనున్నది. పీఆర్సీ కమిటీ తొలుత ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నుంచి ఆ తర్వాత ప్రభుత్వ శాఖలతో సంప్రదింపులు చేపట్టింది. ఒక్క ఆర్థికశాఖతో మాత్రమే సంప్రదింపులు జరపాల్సి ఉన్నది. ఆ తర్వాత ఫిట్‌మెంట్ సహా పలు అంశాలపై ప్రభుత్వ వైఖరిని తెలుసుకొని కమిటీ పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేస్తుంది. దీనికోసమే ఇంకొంత కాలం పడుతుంది. తక్షణమే పీఆర్సీ నివేదికను తెప్పించుకుని, మెరుగైన ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని కోరుతున్నాయి.

గురుకులాల నిర్వహణకు కామన్ డైరెక్టరేట్

టీజీపీఏ అధ్యక్షుడు అజయ్‌కుమార్ సూచన • మైనారిటీ విభాగం రాష్ట్ర కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని గురుకుల సొసైటీల నిర్వహణ కోసం కామన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటుచేయాలని తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రౌతు అజయ్‌కుమార్ సూచించారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన టీజీపీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో గురుకులాల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కారాలపై చర్చించారు. గురుకుల సొసైటీలలో ఏకరూప పనివేళలు, పనివిధానం అమలుచేయాలని అజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలను పెంచాలని కోరారు. అనంతరం మైనారిటీ విభాగం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిమ్మల జితేందర్, ప్రధాన కార్యదర్శిగా రంగు స్వప్న, వైస్ ప్రెసిడెంట్ వెంకటయ్య, జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీనివాసులు, కోశాధికారి వస్కుల రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీధర్, కార్యదర్శిగా జహిరున్నీసా, సంయుక్త కార్యదర్శి రమేశ్, మహిళా విభాగం ప్రెసిడెంట్‌గా సుధారాణి, సెక్రటరీ మోనికా సోని, సలహాదారులుగా చందర్‌రెడ్డి, కల్పన, అధికార ప్రతినిధిగా బాలకృష్ణ ఎన్నికయ్యారు. టీజీపీఏ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రాంబాబు, కోశాధికారి రాజేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల ప్రకాశ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీ భిక్షపతి, నీరజ తిరుపతి పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ఆదరించకపోతే స్థిరాస్తి జప్తు

అక్రమంగా పట్టా చేసుకుంటే కేసు నమోదు • ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర వెల్లడి



కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, సెప్టెంబర్ 22: వివాహం అనంతరం కుమారులు తల్లిదండ్రులను పట్టించుకోకపోతే స్థిరాస్తులను జప్తు చేస్తామని ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారసత్వంగా ఆస్తిని అక్రమంగా పట్టా చేసుకొని వ్యవసాయం చేస్తున్న వారిపై 1977 చట్టాన్ని అమలు చేస్తూ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన మామిడిశెట్టి చిన్న మల్లయ్యకు ఇద్దరు కుమారులు ఉండగా, మల్లయ్యకు సంబంధించిన వ్యవసాయ భూమిని కొడుకులు అక్రమంగా పట్టా చేసుకొని తల్లిందండ్రులను పట్టించుకోలేదు. దీంతో తండ్రి మల్లయ్య రెవెన్యూ అధికారులను సంప్రదించారు. భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నట్టు అధికారుల విచారణలో తేలడం తో 1977 చట్టం ప్రకారం భూమి తిరిగి మల్లయ్యకు చెందేలా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. దీంతోపాటు 2007 సీనియర్ పౌరుల పోషణ చట్టం ప్రకారం తల్లిదండ్రుల పోషణ భారం తీసుకోవాలని అతని కుమారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.



మొదటి బహుమతి పొందిన కోటేశ్వర్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి



రెండో బహుమతి పొందిన ఉమాదేవికి మెమెంటో అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

తెలుగుభాషను పరిరక్షించుకోవాలి

- స్వదేశం కంటే విదేశాల్లోనే పండుగలకు పట్టం
- గ్రంథాలయాలు విద్యార్థుల ప్రగతికి సోపానాలు
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి
- ‘నమస్తే తెలంగాణ - ముల్కనూరు ప్రజాగ్రంథాలయం’ జాతీయ స్థాయి కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 22: తెలుగు భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆకాంక్షించారు. ‘నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజాగ్రంథాలయం’ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి 2023–24 కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు అధ్యక్షతన ఆదివారం జరిగింది. అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు పండుగలను మన ప్రాంతంలోకంటే విదేశాల్లో నివసిస్తున్న తెలుగువారు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రంథాలయాలు విద్యార్థుల ప్రగతికి సోపానాలుగా నిలుస్తాయని చెప్పారు. ఇక్కడ చదువుకుని హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వేముల శ్రీనివాసులు ముల్కనూరు ప్రజాగ్రంథాలయానికి చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ ప్రాంత అభివృద్ధికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, అల్గిరెడ్డి విశ్వనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దుగ్గిరాల వెంకట్రావు, శ్రీరంగారావు, వొడితెల రాజేశ్వర్‌రావు, కెప్టెన్ లక్ష్మీకాంతారావు పార్టీలకతీతంగా పనిచేశారని కొనియాడారు. ముల్కనూరులో ప్రజాగ్రంథాలయం స్థాపించి పదేండ్లు పూర్తికావడం అభినందనీయమని అన్నారు. అమెరికా వంటి దేశాల్లో పిల్లలకు తెలుగునేర్పించడం కోసం ప్రత్యేకంగా టీచర్లను ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు మాట్లాడుతూ.. స్నేహితుల సహాయంతో తాము స్థాపించిన ముల్కనూరు ప్రజాగ్రంథాలయం పలువురు విద్యార్థుల విజయానికి దోహదపడటం సంతోషంగా ఉన్నదని అన్నారు. ఈ గ్రంథాలయాన్ని వినియోగించుకుని ఇప్పటి వరకు 30 మంది వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. అంతకుముందు కోడూరి రాజయ్య స్మారకార్థం నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో విజేతలకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. చివరలో కథలపోటీల విజేతలకు ఆహుతుల చేతులమీదుగా బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో నమస్తే తెలంగాణ బతుకమ్మ ఫీచర్స్ ఇంచార్జి టీ నాగరాజు, ఇఫ్లూ ప్రొఫెసర్ తిరుమతి కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, మాజీ జడ్పీటీసీ వంగ రవి, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, మాజీ సర్పంచులు గూడెల్లి రాజిరెడ్డి, మాడుగుల కొమరయ్య, గ్రంథాలయ నిర్వాహకులు గొల్లపల్లి లక్ష్మయ్య, తాళ్ల వీరేశం, పల్లా ప్రమోద్ రెడ్డి, అయిత కిషన్‌ప్రసాద్, మూల శ్రీనివాస్, కోగూరి సుగుణాకర్, కరుణాకర్, మూల రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతో మానసిక వికాసం



మనిషి బతకడానికి కూడు, గూడు, గుడ్డ ఎలా అవసరమో మానసిక వికాసానికి సాహిత్యం కూడా అంతే అవసరం. సాహిత్యాన్ని బతికించాల్సిన అవసరం అన్ని వర్గాలపై ఉన్నది. ప్రజలకు, కవులకు మధ్య సంబంధాలను పటిష్ఠం చేస్తున్న నమస్తే తెలంగాణ–ముల్కనూరు ప్రజా గ్రంథాలయానికి అభినందనలు.

- ఎం కోటేశ్వర్‌రావు, విజేత (మొదటి బహుమతి)

సాహిత్య పీఠానికి అభినందనలు



కథలకు ఏకంగా యాభై వేల పారితోషికం ప్రకటించి సాహిత్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయ పీఠానికి కృతజ్ఞతలు. కనుమరుగవుతున్న సాహిత్యానికి ఊపిరిపోస్తున్న ఈ సంస్థలు భవిష్యత్తులోనూ ఇదే తరహా పోటీలను కొనసాగించాలి.

- సమ్మెట ఉమాదేవి, విజేత (రెండో బహుమతి)

మంచి పరిణామం

ప్రస్తుత సమాజంలో వేగం అలవాటైన సందర్భంగా కేవలం సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగుతూ సాహిత్య బీజాలను మరిచిపోతున్నారు. నమస్తే తెలంగాణ–ముల్కనూరు ప్రజా గ్రంథాలయం సంయుక్తంగా ఏటా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కథల పోటీల వల్ల సాహిత్యాభివృద్ధికి మంచి పరిణామం. పాఠశాల స్థాయిలోనే పిల్లలకు సాహిత్యం పట్ల ఆసక్తిని పెంచేలా కృషి చేయాలి.

- మైలవరపు విజయభాస్కర్, రచయిత

ఏటా కొనసాగిస్తాం..

నమస్తే తెలంగాణ–ముల్కనూరు ప్రజాగ్రంథాలయం జాతీయస్థాయి కథల పోటీల నిర్వహణ ఏటా కొనసాగిస్తాం. మేము చేపట్టిన ఈ ప్రయత్నం వల్ల ఎంతోమందిలో నిగూఢంగా దాగి ఉన్న సాహితీ చాతుర్యం బహిర్గతం అవుతుంది. దీంతో ఎన్నో అందమైన కథలు పాఠకులకు అందించడం జరుగుతుంది. కొత్త రచయితలు పుట్టుకొస్తున్నారు.

- తిగుళ్ల నాగరాజు, నమస్తే తెలంగాణ ఫీచర్స్ ఇన్‌చార్జి

వృద్ధులకు ఆరోగ్యబీమా.. ఉత్తిదేనా?

కేంద్ర ప్రభుత్వ పథకం అమలుపై సందేహాలు • ఆయుష్మాన్ భారత్‌కు దూరంగా ప్రైవేట్ దవాఖానలు


హైదరాబాద్, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా 70 ఏండ్లకు పైబడిన వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్టు చెప్పింది. దీనికి అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు సహకరించాలని కోరుతూ తాజాగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలకు లేఖ రాసింది. అయితే, ఈ పథకం అమలుపై వైద్య వర్గాల్లో అనుమానాలు తలెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ అమలవుతున్నా.. ప్రైవేట్ దవాఖానలు ఈ పథకం కింద రోగులకు చికిత్సలు అందించడం లేదు. ప్యాకేజీలు తక్కువగా ఉండటం, ముందుగా చికిత్స చేసి బిల్లుల కోసం ప్రభుత్వాల చుట్టూ తిరుగాల్సి రావడం వంటి కారణాలతో ప్రైవేట్ దవాఖానలు ఈ పథకాన్ని పట్టించుకోవడం లేదు. కేవలం ప్రభుత్వ దవాఖానల్లో మాత్రమే ఆయుష్మాన్ భారత్ అమలవుతున్నది. తెలంగాణలోనూ ఇదే పరిస్థితి. అతి తక్కువ దవాఖానలు మాత్రమే ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌ను అమలుచేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రైవేట్ దవాఖానల్లో ఆరోగ్యశ్రీ–ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసేలా ఒప్పించాలని, ఆ తర్వాతే వృద్ధులకు పథకాన్ని వర్తింపజేయాలని కోరుతున్నారు.

కథాసుధ

కలవరం పెట్టే కోరిక

ఓ రాజుకు రాత్రివేళల్లో తన రాజ్యం ఎలా ఉంటుందో చూడాలనిపించింది. అందుకని ఒకమంచి చలి కాలం రాత్రి ఓ వీధిలో నడుస్తూ ఉన్నాడు. అప్పుడు రాజుకు ఓ వృద్ధుడు ఇంటి ముందు చొక్కా వేసుకోకుండా పడుకుని ఉండటం కనిపించింది. దుప్పటి కూడా కప్పుకోకుండా అంత చలిలో అతను పడుకుని ఉండటం చూసి రాజు ఆశ్చర్యపోయాడు.'వణుకు' ఛాయలు ఆ వృద్ధుడి ముఖంలో కానీ, శరీరంలో కానీ ఎక్కడా కనిపించలేదు.
'నీకు చలి వేయడంలేదా?' అడిగాడు రాజు.
'అనిపించడం లేదు' బదులిచ్చాడు ఆ వృద్ధుడు.
'గడ్డ కట్టేంత తీవ్రమైన ఈ చలిలో దుప్పటి కప్పుకోకుండా పడుకోవడం మంచిది కాదు, నేను రేపు నీకొక దుప్పటి తెచ్చి ఇస్తాను. ఎముకలు కొరికే చలి బారినుంచి తప్పించుకోవచ్చు!' అని చెప్పి రాజు తన మందిరానికి వెళ్లిపోయాడు.
మర్నాడు తన పనుల హడావుడిలోపడి రాజు వృద్ధుడి విషయమే మరిచిపోయాడు. రెండు రోజుల తర్వాత రాజుకు ఆ వృద్ధుడి సంగతి గుర్తుకువచ్చింది. ఆ రోజు రాత్రి దుప్పటి తీసుకొని వృద్ధుడి దగ్గరికి వెళ్లాడు. వృద్ధుడి శరీరం సగానికి సగం కుంచించుకుపోయింది. చలికి అతను తీవ్రంగా వణికిపోతూ కనిపించాడు. రాజు అందించేలోగా దుప్పటిని లాక్కొని గబగబా కప్పుకొన్నాడు వృద్ధుడు. దిగ్భ్రాంతి చెందిన రాజు 'ఆ రోజు నేను నీ దగ్గరికి వచ్చినప్పుడు చలే లేదన్నావు, ఈరోజు దుప్పటి కోసం ఇంతలా వెంపర్లాడుతున్నావు కారణమేంటి?' అని అడిగాడు.
'రాజా మీరు నాకు దుప్పటి ఇస్తాననేంత వరకు నాకు ఆ స్పృహే లేదు. మీరు చలి, దుప్పటి గురించి చెప్పినప్పటి నుంచీ నాలో అవే ఆలోచనలు మొదలయ్యాయి. చలికి గజగజ వణకడం మొదలైంది. దుప్పటి మీద కలవరం పుట్టింది' అని సమాధానమిచ్చాడు.
'కోరికలు ఉంటే కంటి మీద కునుకు ఉండదు. కోరికలు లేకపోతే జగత్తు సైతం తృణప్రాయం' అని పండితులు చెప్పింది గుర్తుకు వచ్చింది రాజుకు. చిన్నగా అక్కడి నుంచి కదిలాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821





గీతాసారం

బంధనాల నుంచి విముక్తి వైపు..

నత్వేవాహం జాతు నాసం నత్వం నేమే జనాధిపాః
న చైవ న భవిష్యామః సర్వే వయ మతః పరమ్!
(భగవద్గీత 2-12)

'అర్జునా! నీవు, నేను, కనిపించే రాజులు.. మనమంతా గతకాలంలో ఉన్నాం.. భవిష్యత్తులోనూ ఉంటాం. అన్ని కాలాల్లోనూ ఉండే 'నేను' అనే 'ఆత్మ' శరీర పతనంతో నశించేది కాదు. ఈ సృష్టిలో ఉన్నది నశించదు. లేనిది కొత్తగా పుట్టదు' అని చెబున్నాడు శ్రీకృష్ణుడు. శిశిరంలో మోడువారిన వృక్షాలు వసంతంలో చిగురిస్తాయి. వసంతంలో చిగురించిన వృక్షాలు శిశిరంలో మోడువారుతాయి.
సృష్టిలో 'పదార్థం' ఉన్నప్పుడు దానికి 'వ్యతిరేక పదార్థం' కూడా ఉంటుంది. 'సకారాత్మక' సంఖ్య ఉంటే 'నకారాత్మక' సంఖ్య ఉంటుంది. అలాగే జనన మరణాల పేరుతో మార్పుచెందే శరీరం ఉన్నప్పుడు దానికి అతీతమై, మారనిది ఒకటి ఉంటుంది. అదే ఆత్మ!

జనన మరణాలతో సంబంధం లేకుండా ప్రతివ్యక్తిలో ఒక కేంద్రం ఉంటుంది. అది స్వచ్ఛమైనది.. శాశ్వతమైనది. దానినే పారమాత్మిక తత్త్వం అంటాం. అయితే మనలో చాలామంది జీవన కేంద్రంపై కాకుండా పైపై అంచులనే చూస్తూ జననమరణాలనే భ్రమలో బాధపడుతున్నారు. జాగ్రత్తగా పరిశీలిస్తే.. జగత్తంతా రెండు విధాలుగా కనిపిస్తుంది. మొదటిది ఆకారాలు, పేర్లు, రంగులు, పరిమాణాలు, అది ఉండే కాలం లాంటివి. రెండోది.. వాటిలోపల ఉండే వస్తువు లేదా దేనితో అది తయారు అవుతుందో అట్టి వస్తువు. ఉదాహరణకు మట్టితో కుండలను చేస్తాం. కుండ అనేది ఆకారం, పేరు, పరిమాణాలను బట్టి గుర్తిస్తున్నాం. కానీ, దానికి ఆధారమైనది మట్టే! కుండగా మారనంత వరకది మట్టి మాత్రమే! కుండ బద్దలయ్యాకా మళ్లీ మట్టే. కుండగా మారాక.. ఆ మట్టికి, జననం మరణం కాని కుండకు ఆధారమైన మట్టికి ఆ బద్దలవడం అనేది ఉండదు.
ప్రతివ్యక్తిలో 'విజ్ఞాన' పార్శ్వం ఉంటుంది. అలాగే 'అజ్ఞాన' పార్శ్వమూ ఉంటుంది. మన సహజస్థితి ఆనందమని జ్ఞానం చెబుతుంది. అయితే ఆనందం మనలోనే ఉన్నదనే సత్యాన్ని గుర్తించక, సౌకర్యంగా ఉన్నదనే భ్రాంతిలో అజ్ఞానాన్ని ఆదరిస్తూ.. మాయ, అహంకారం అనే ముసుగులను కప్పుకొని ఆనందాన్ని విస్మరిస్తున్నాం. మనమంతా జీవితాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నామా? ఆలోచించాలి. విషయాన్ని లోతుగా తరచి చూస్తేనే ఆనందాన్ని ఆస్వాదించ గలుగుతాం. చిత్రకారుడు ఒక చిత్తరువును చిత్రించే సమయంలో పలు కోణాలలో దర్శిస్తాడు.. పరిశీలిస్తాడు. దానికి సంబంధించిన వివిధ స్పందనలను ఆస్వాదిస్తాడు. ఆనందానికి అతీతమైన తన్మయస్థితిలో చిత్రించిన చిత్రం ఉదాత్తతను సంతరించుకుంటుంది. సాధారణ వ్యక్తి దృష్టికీ చిత్రకారుని దృష్టికీ భేదం ఉంటుంది.

ఒకరొక కార్యాన్ని సాధించారంటే దానిని ఎవరైనా సాధించగలరు. అయితే కార్యాన్ని ఆరంభించిన సమయంలో నేను అల్పుడనని దిగాలుపడినా, నా స్థితిగతులు కార్యసాధనకు సరిపోవని అధైర్యపడినా.. కార్యం విఘ్నమౌతుంది. తానెన్నడూ నశింపనని, తనకు ఇతరులకు భేదం లేదని తెలిసాక.. ఉత్సాహం కలుగుతుంది. ఉత్సాహం ధైర్యానికి ఊపిరులూదితే సాహసం ముందుకు వస్తుంది. బుద్ధి ప్రచోదన జరిగితే ఆత్మ విశ్వాసం వెలుగు చూస్తుంది. దానికి ప్రయత్నం తోడైతే కార్యం సాధ్యమవుతుంది. కార్యసాధన ఆనందాన్నిస్తుంది. కృష్ణుడీ చిన్న ధర్మసూక్ష్మాన్ని ఆధారం చేసుకొని అర్జునుడి ఎదలో ధైర్యాన్ని నింపి కార్యోన్ముఖుని చేశాడు. మనందరమూ మరణరహిత ఆనంద స్వరూపులమని, తెలిసి కర్తవ్యాన్ని నిర్వహించాలే కానీ, మనది కాని భయాన్ని ఆశ్రయించి జీవితాన్ని నిర్వీర్యం చేసుకోకూడదు. భయం పరిమితులను దాటిన వారే విజయ సాధకులుగా చరిత్రలో నిలుస్తారు.

... పాలకుర్తి రామమూర్తి



చెట్టు మీది పక్షి

ఓ చెట్టు మీద ఎంతో అందమైన పక్షి ఉంది. అది శాశ్వత సత్యమైన భగవంతుడనే పండును పొడుచుకుని తింటున్నది. భగవన్నామ స్మరణం అనే రసాన్ని తాగి ఆనందిస్తున్నది. దానికి ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు ఎగరాలనే కోరిక లేదు. తాను ఉన్నచోటనే తృప్తి చెందుతున్నది. అలాంటి పక్షికి ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు ఎగరడం వల్ల ఏమైనా ప్రయోజనం ఉంటుందా? అలా ఎగురుతూ ఉంటే ఏదో ఒకనాటికి దాని శక్తి ఉడిగిపోతుంది. చివరికి ఎగరడం అనేది దుర్భరంగా మారిపోతుంది. కాబట్టి, ఆ పక్షి భగవంతుడనే మధురఫలం ఉన్న చెట్టునే ఆశ్రయించుకుని ఉండాలి. ఆ చెట్టు ఆకులు ఎన్నటికీ రాలిపోవు; పైగా దాని కొమ్మలు ఎప్పుడూ తాజా పండ్లతో నిండి ఉంటాయి.

• గురు అమర్‌దాస్ (సిక్కుల మూడో గురువు)

ఇస్లాం బోధ

నైతికతే నిజమైన స్వేచ్ఛ!

చూపుల్లో సిగ్గు, బిడియాలు ఉట్టిపడాలి. లజ్జ అనే కాటుక కళ్లలో ప్రతిబింబించాలి. చూపుల బిడియం మనిషికి అత్యంత విలువైన ఆభరణం. చెడు చూపు వ్యక్తిత్వాన్ని దిగజారుస్తుంది. చూపులను కిందికి వాల్చి ఉంచడం వల్లనే మన హృదయాలు కాంతిరేఖలు అవుతాయి. ఎవరి చూపులైతే కిందికి వాలి ఉంటాయో అలాంటి వారిని ఏ శక్తీ అపమార్గం పట్టించలేదు. అలాంటి వారిని ఎలాంటి ప్రలోభాలు లొంగదీసుకోలేవు అనడానికి నిదర్శనమే ఈ సంఘటన.
ఒకానొకప్పుడు ఉమేర్ బిన్ హబీబీ.. రోమ్‌లో బానిసగా పట్టుబడ్డారు. ఈయన ఆరడుగుల అందగాడు. ఆయన అందచందాలకు ముగ్ధుడైన రోమ్ సర్దారు ఆ యువకుణ్ని లొంగదీసుకునేందుకు ఒక వ్యూహం పన్నాడు. ఒక అందమైన మహలును సిద్ధం చేశాడు. ఆ యువకుణ్ని అందులో బంధించి విలువైన మద్యం, రుచికరమైన మాంసాహారం, అందమైన యువతిని ఏర్పాటుచేశాడు. ఆ యువతి హబీబీని 'నీ కోరిక తీర్చుకో!' అన్నట్టుగా రెచ్చగొట్టసాగింది. హబీబీ దించిన తల ఎత్తలేదు. ఇలా మూడురోజులు, మూడు రాత్రులు గడిచాయి. తిండి తిప్పలు లేవు. మూడు రోజుల తర్వాత ఆ యువతి 'మూడు రోజులుగా ఏమీ తినకుండా ఎందుకింత మొండికేసి కూర్చున్నావు. కనీసం తల ఎత్తి కూడా చూడటం లేదు! అసలు నువ్వెవరు? ఇంత మంచి అవకాశాన్ని ఎందుకు జారవిడుచుకుంటున్నావు?' అని ప్రశ్నించింది. దానికి హబీబీ 'నా దేవుడు నన్ను ప్రతిక్షణం చూస్తున్నాడు. నేను ఈ పాడు పని చేసేందుకు సిగ్గుపడుతున్నాను. మూడు రోజులు కాదు ముప్పయ్ రోజులు నువ్విలా నా ముందు కూర్చున్నా నేను ఈ పాడు పని చేయలేను. ఎందుకంటే నా యవ్వనం అల్లాహ్ అప్పగింత. దానిపై మచ్చరానివ్వలేను' అన్న మాటలకు ఆ యువతి విస్తుపోయింది. 'నీలాంటి ఆణిముత్యాన్ని నేను చూస్తూ చూస్తూ చంపుకోలేను. నేను ఎలాగైనా నిన్ను ఇక్కడినుంచి బయటపడేస్తాను' అని చెప్పి అక్కడినుంచి బయటికి వచ్చింది. ఆ రోజు రాత్రి ఆ యువకుడిని అక్కడినుంచి తప్పించింది.
ఇదీ వ్యక్తిత్వమంటే. పరిస్థితులు ఎంతలా ప్రలోభపెట్టినా మన వ్యక్తిత్వాన్ని, మన చూపులు పక్కదారి పట్టరాదు. 'నువ్వు నీ యవ్వనాన్ని ఎలా గడిపావు' అన్నది ప్రళయ దినాన అల్లాహ్ అడిగే ఐదు ప్రశ్నల్లో ఒకటి. అందుకే యవ్వన జీవితాన్ని ఎలాంటి మచ్చలేకుండా గడపాలని చెబుతారు పెద్దలు. లజ్జ, సిగ్గు, బిడియం ఇవన్నీ ఇస్లామ్ ధర్మం నైతిక ఆభరణాలని ప్రవక్త చెప్పారు. 'ఇస్లామ్ ధర్మమనే వృక్షానికి 60కి పైగా కొమ్మలున్నాయి. వ్రీడ (లజ్జ) కూడా విశ్వాసానికి ఒక కొమ్మే' అనేవారు అందుకే ప్రవక్త (సఅసం). మహాప్రవక్త కాలంలో ఒక వ్యక్తి ఎంతో బిడియస్తుడిగా ఉండేవాడు. దానికి అతని సోదరుడు అతనిపై మండిపడేవాడు. ఇది గమనించిన దైవప్రవక్త (స), 'అతణ్ని కోపగించుకోకు. ఎందుకంటే సిగ్గుపడటం విశ్వాసంలో అంతర్భాగం' అని ప్రబోధించారు. ఇస్లామ్ ధర్మం అన్ని రకాల నీతి బాహ్యమైన పనుల నుంచి, దుర్గుణాల నుండి దూరంగా ఉండమని వారిస్తుంది. మనిషిలో సహజంగా ఉండే ఈ సిగ్గు, బిడియాలు మనిషిని అన్ని రకాల చెడులకు దూరంగా ఉంచుతాయి. లజ్జా గుణం మనిషికి ఆభరణం లాంటిదని, దీనివల్ల మనిషికి మేలు మాత్రమే కలుగుతుందని ప్రవక్త హితవుపలికారు. సిగ్గు, బిడియాలు వదిలేసిన నైతికత లేని స్వేచ్ఛ విశృంఖలతకు దారితీస్తుంది. నైతికతే నిజమైన స్వేచ్ఛకు పునాది అని ఉలేమాలు చెబుతారు!



... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

హైందవ సంస్కృతిలో అన్ని పండుగలకూ ప్రత్యేకత కనిపిస్తుంది. ప్రతీ పర్వం విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకొని ఉంటుంది. భాద్రపద కృష్ణ పక్షంలో వచ్చే మహాలయ పక్షాలు కూడా అలాంటివే! ఈ పక్షం రోజులు పితరులను తలుచుకోవాలని శాస్త్రం నిర్దేశించింది. అన్ని వర్గాల వారు తమ పెద్దలు మరణించిన తిథుల్లో తర్పణ, శ్రాద్ధకర్మలు ఆచరించాలని సూచించింది.



సందర్భం

పితరులను తలుచుకుందాం!

ఉత్తరాయణం దేవతల కాలమనీ, దక్షిణాయనం పితృకాలమని శాస్త్ర వచనం. ఆషాఢ మాసం కృష్ణ పక్షం మొదలు ఐదో పక్షం అంటే భాద్రపదం కృష్ణ పక్షం వరకు పితరులు చాలా కష్టపడుతూ, అన్నోదకాలు కాంక్షిస్తూ ఉంటారట. వారి క్షుద్బాధ తీర్చడానికి మహాలయ పక్షం అనువైన సమయంగా పేర్కొన్నారు. మహాలయ పక్షంలో 'దివే దివే గయాతుల్యమ్' అంటే ప్రతి రోజూ తర్పణం గానీ, పితరులు దూరమైన పుణ్యతిథి నాడు శ్రాద్ధం గానీ నిర్వహించినట్టయితే పితృదేవతలు సంవత్సరం వరకు సంతృప్తులు అవుతారని స్కాందపురాణం చెబుతున్నది. కన్య, తుల రాశుల్లో సూర్యుడు సంచరించే సమయంలో ప్రేతపురి శూన్యంగా ఉంటుందనీ, పితృదేవతలు అన్నం కోరుతూ వారి వారసుల ఇండ్ల చుట్టూ తిరుగుతారని మహాభారతంలో ఉటంకించారు. మహాలయ పక్షాల్లో తమ వారసులు శ్రాద్ధ కర్మలు ఆచరిస్తారని కొండంత ఆశతో ఉంటారట. వారసులు తమ యథాశక్తి శ్రద్ధగా శ్రాద్ధకర్మ ఆచరిస్తే పితరులు సంతోషించి తమ లోకాలకు వెళ్తారట. లేనిపక్షంలో వృశ్చికమాసం తర్వాత దేవతలతో సహా నిట్టూర్చి, శాపమిచ్చి తిరుగు ప్రయాణం అవుతారట.

మరణించిన వ్యక్తి తిథి నాడు తద్దినం పెట్టడం హిందూ సంప్రదాయంలో అనాదిగా వస్తున్న ఆచారం. తండ్రి మరణించిన తిథినాడు కొడుకు తన తండ్రి, తాత, ముత్తాతలను తలచుకొని పితృయజ్ఞాన్ని నిర్వహిస్తాడు. మరి పుత్రులు లేనివారి సంగతేమిటి? వారి కోసం శాస్త్రం ఓ మార్గాన్ని నిర్దేశించింది. కుటుంబాలలో ఏ కారణం చేతనో పెళ్లికాని సోదరి, సోదరులు మరణించి ఉండవచ్చు. పెళ్లయినా.. సంతానం లేక మరణించిన దంపతులూ ఉండవచ్చు. ప్రమాదాల్లో మరణించిన చిన్నపిల్లలు, యుద్ధాలలో ప్రాణాలు వదిలిన వాళ్లు, ఆత్మహత్య చేసుకున్నవాళ్లు, ప్రకృతి వైపరీత్యాల్లో కన్ను మూసిన వాళ్లు ఉండవచ్చు. అటువంటి వారికి తిలోదకాలు ఇచ్చి.. వారిని ఊర్ధ్వలోకాలకు పంపడం కోసం నిర్దేశించినవే మహాలయపక్షాలు.

- భాద్రపద బహుళ పక్షాన్ని మహాలయ పక్షమనీ, పితృపక్షమనీ అంటారు. భాద్రపద అమావాస్యను మహాలయ అమావాస్య అంటారు. మన రాష్ట్రంలో పెత్తులమాస అని పిలుస్తారు. పితృదేవతల అమావాస్య వాడుకలో పెత్తులమాస అయిందన్నమాట.
- క్రమం తప్పకుండా తద్దినాలు పెట్టేవారు కూడా పితృపక్షాల్లో ఆయా తిథులలో పితృకార్యాన్ని నిర్వహించాలి. మరణించిన వ్యక్తుల తిథి తెలియనివారు అమావాస్య నాడు పితృకార్యాన్ని నిర్వహించాలి. తండ్రి జీవించి ఉండి తల్లి మాత్రమే మరణించిన వారు భాద్రపద బహుళ నవమినాడు శ్రాద్ధ విధిని నిర్వహించాలి.
- వంశాచారంలో అగ్నిహోత్రం ఉన్నవారు స్వధాకారంతో అగ్నిహోత్రుడికి కవ్యములు సమర్పించాలి. అగ్నిదేవుడికి స్వాహాదేవి, స్వధాదేవి అని ఇద్దరు భార్యలు. అగ్నిదేవుడు స్వాహాదేవి సాయంతో స్వీకరించి దేవతలకు అందించే ఆహుతులను హవ్యములు అంటారు. స్వధాదేవి సాయంతో స్వీకరించి పితృదేవతలకు సమర్పించే ఆహుతులను కవ్యములు అంటారు. మిగిలిన పితృకార్యం అందరికీ సమానమే.

సర్వ కారుణ్యం..

కాలం చేసిన వంశస్థులతోపాటు, పుత్రులు లేని గురువులకు, స్నేహితులకు కూడా మహాలయ పక్షాల్లో తిలోదకాలతో పిండప్రదానం చేసే అర్హత, అధికారం కర్తకు ఉంటుంది. దీనినే సర్వ కారుణ్య తర్పణ విధి అంటారు. ఏ కారణంతోనైనా... తద్దినం పెట్టకపోతే.. ఆ దోషం మహాలయ పక్షాల్లో పితృవిధి నిర్వర్తిస్తే తొలగిపోతుందంటారు. ఈ పక్షాల్లో పితృదేవతలు ఆశతో తమ వారసుని ఇంటిని ఆవహించి ఉంటారని నమ్ముతారు. పితృవిధి నిర్వర్తించిన వారసుడిని మనసారా ఆశీర్వదించి, పిల్లాపాపలతో సంతోషంగా జీవించమని దీవిస్తారట.

- వైదిక విధానం వర్తించని వంశాల వారు తమ పూర్వికులను స్మరించుకొని బ్రాహ్మణులకు ఆహార పదార్థాలను, సంభావనను సమర్పిస్తే సరిపోతుంది.
- పితృకార్యాన్ని కర్త నివాసం ఉన్న ఇంట్లో నిర్వహించడమే పితృదేవతలకు ఆనందాన్ని ఇస్తుంది. ఆ ఇంటి కోడండ్లు వండి, వడ్డిస్తే భోక్తలను ఆవహించిన పితృదేవతలకు, విశ్వేదేవతలకు పరమానందం కలుగుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే మఠాలలో శ్రాద్ధకర్మను నిర్వహించాలి.
- దక్షిణాయనం పితృదేవతలకు సంతోషాన్నిచ్చే కాలమైతే, భాద్రపద బహుళ పక్షం వారికి మరింత ఆనందాన్ని ఇచ్చే సమయం. పితృదేవతలకు సంతోషాన్ని కలుగజేద్దాం. మన సంతానానికి మరిన్ని సుఖసంతోషాలను అందిద్దాం.

... శ్రీవర్ధన్

జీవేశ్వరులు పరబ్రహ్మామే

సత్యం జ్ఞానమనంతం యద్బ్రహ్మ తద్వస్తు తస్యతత్|
ఈశ్వరత్వం జీవత్వముపాధిద్వయ కల్పితం|| అంటుంది వేదాంత పంచదశి. సత్యం, జ్ఞానం, అనంతం అనే లక్షణాలతో పేర్కొన్న పరబ్రహ్మం ఏది కలదో అదే వస్తువు (పరమార్థం). ఆ పరబ్రహ్మం ఈశ్వరత్వం, జీవత్వం అనే రెండు ఉపాధులు కలిగి ఉంటుంది.
ప్రపంచం ఏర్పడేందుకు మూలకారణమైన ప్రకృతి త్రిగుణాత్మకమైంది. అంటే సత్వ, రజస్తమో గుణాలు కలది. జ్ఞానం, స్వచ్ఛత, శాంతి మొదలైన వృత్తులకు సత్వగుణం, కామం, క్రోధం మొదలైన వాటికి రజోగుణం, అలాగే మూఢత్వం, సోమరితనం మొదలైన వృత్తులకు తమోగుణాలు కారణాలు. శుద్ధ సత్త్వం అంటే రజస్తమో గుణాల కలయిక లేని నిర్మలమైన సత్వగుణమే 'మాయ'. ఈ మాయాశక్తి ఉపాధిగా కలవాడు ఈశ్వరుడు. ఇతడు సర్వనియామకుడు. సర్వజ్ఞుడు, శాసకుడు. మాయను అధీనంలో ఉంచుకొని ప్రపంచకార్యాలు నిర్వహించువాడు. మలిన సత్త్వం అంటే రజస్తమో గుణాల కలయిక కలిగినది. అవిద్య, అజ్ఞానం. వీటిని ఉపాధిగా కలవాడు జీవుడు. మాయకు వశుడు. మాయలో ప్రతిబింబించిన బ్రహ్మం ఈశ్వరుడు అయితే, అవిద్యలో ప్రతిబింబించే బ్రహ్మం జీవుడు. ఈ విధంగా ఒకే పరబ్రహ్మం ఉపాధి భేదం కారణంగా ఈశ్వరునిగా, జీవునిగా ఉన్నాడు.




... శివకుమార్

క్రీస్తు సందేశం

దేవుడు మాట్లాడతాడా?

ఔను ఇది సాధ్యమే! దేవుడు మాట్లాడతాడు. దేవుడు కనబడడు కదా మరి ఆయన మాట్లాడతాడు అని కోరుకోవడం అనౌచిత్యం కాదా, అదెలా సాధ్యం? దేవుడు మాట్లాడని, అది బైబిలు ద్వారా పలికాడనీ, బైబిలును ఆయన వాక్కుగా భావిస్తుంది క్రైస్తవం. కొండల మాటునుంచి, పొదల చాటు నుంచి, మేఘాల తెరల నుంచి దేవుడు తన స్వరాన్ని వినిపించాడు. మోషేకు పది ఆజ్ఞలు అందించిన దేవుడు. తన బలమైన స్వరాన్ని ప్రపంచానికి గట్టిగా వినిపించాడు. అది ఆది క్రైస్తవ్యానికి ఓ ప్రేమ పునాది వాక్యంగా, సేవా వారధిగా నిలిచిపోయింది. బాధల్లో ఉన్నవారికి ఎవరో ఓ పెద్దాయన పెద్ద మనసుతో సాయపడినప్పుడు 'దేవుడిలా వచ్చి కాపాడాడు' అని అంటారు. తనకు న్యాయం జరిగినప్పుడో, ఒక మోసగాడికి నష్టం జరిగినపుడో 'దేవుడున్నాడు' అని గట్టిగా నినదిస్తారు. సాధారణ స్థితి నుంచి మహోన్నతుడైన దేవుని స్థానం దాకా తాను చేసే సత్‌క్రియల ద్వారా మనిషి ఎదుగుతాడు అనే నీతిని అందించే సంఘటనలూ, సిద్ధాంతాలూ చాలానే ఉన్నాయి. మరో మనిషి రూపంలో వచ్చి దేవుడు సాయపడగలడంటే కూడా ఇదే పరమార్థం. దేవుడు ప్రేమమయుడు. అదే ప్రేమతో ప్రతివ్యక్తీ దేవుడిలా మారడానికి, దేవుడు అయిపోవడానికి.. దైవపీఠానికి పోటీ పడితే ప్రపంచమంతా దైవమయమై, ప్రేమమయమైపోదా? ప్రభువు ప్రాణత్యాగం ద్వారా మనతో దేవుడు చాలా మాట్లాడాడు. క్రీస్తు పరలోకం నుంచి మానవ లోకానికి వచ్చింది తన మహిమను ప్రకటించుకోడానికి కాదు, మనిషిని కూడా దేవునిగా మార్చేయడానికే!

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024



భారత్ స్వర్ణ చరిత్ర

45వ చెస్ ఒలింపియాడ్‌లో డబుల్ ధమాకా

ఓపెన్, మహిళల విభాగాల్లో స్వర్ణాలు



> అద్భుతమైన ఆటతీరుతో 45వ చెస్ ఒలింపియాడ్‌ను భారత్ కైవసం చేసుకుంది. సరికొత్త స్వర్ణ అధ్యాయాన్ని లిఖించిన భారత పురుషుల, మహిళల బృందానికి హ్యాట్సాఫ్! - కేటీఆర్

బుడాపెస్ట్ (హంగేరి): ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళ జట్లు సరికొత్త చరిత్రను లిఖించాయి. రెండు విభాగాల్లోనూ భారత్ అగ్రస్థానాన నిలిచి స్వర్ణాలు గెలుచుకుంది. బుడాపెస్ట్ వేదికగా జరిగిన 45వ చెస్ ఒలింపియాడ్ ఓపెన్ విభాగంలో దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద రమేశ్‌బాబు, విదిత్ గుజరాతితో పాటు తెలంగాణ యువ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసితో కూడిన భారత జట్టు 3.5–0.5తో స్లోవేనియాను ఓడించి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. యూఎస్ఏ, ఉజ్బెకిస్థాన్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మహిళ విభాగంలో ద్రోణవల్లి హారిక, వైశాలి రమేశ్‌బాబు, దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ బృందం 3.5–0.5తో అజర్‌బైజాన్‌ను చిత్తు చేసింది. కజకిస్థాన్, యూఎస్ఏ రజతం, కాంస్యం గెలిచాయి. 97 ఏండ్ల ఈ టోర్నీ చరిత్రలో స్వర్ణం గెలవడం భారత్‌కు ఇదే ప్రథమం. మెన్స్ కేటగిరీలో 2014, 2022 ఎడిషన్లలో భారత్ కాంస్యం గెలవగా ఉమెన్స్ కేటగిరీలో 2022లో కాంస్యం దక్కడమే ఇప్పటిదాకా అత్యుత్తమ ప్రదర్శన. ఒక చెస్ ఒలింపియాడ్ ఈవెంట్‌లో ఒకే దేశానికి (ఓపెన్, ఉమెన్) రెండు స్వర్ణాలు రావడం ఈ టోర్నీ చరిత్రలో ఇది రెండోసారి మాత్రమే.

ఓటమన్నదే లేకుండా..

సుమారు 190 దేశాలు పోటీపడ్డ చెస్ ఒలింపియాడ్‌లో భాగంగా భారత్ అపజయమే లేకుండా టైటిల్‌ను గెలిచింది. 11 రౌండ్లు ఉండే ఈ టోర్నీలో భారత పురుషుల బృందం వరుసగా 8 రౌండ్లు గెలిచింది. 9వ రౌండ్‌ను (ఉజ్బెకిస్థాన్) డ్రా చేసుకోగా 10వ రౌండ్‌లో టాప్‌సీడ్ అమెరికాను ఓడించింది. 11 రౌండ్లకు గాను భారత్ ఖాతాలో 21 పాయింట్లు (రౌండ్‌కు 2) దక్కడం విశేషం. మహిళల జట్టూ వరుసగా 8 రౌండ్లు నెగ్గి 9వ రౌండ్‌ను డ్రా చేసుకుంది. తిరిగి 10, 11 రౌండ్లలో పైచేయి సాధించింది. 11 రౌండ్లలో అమ్మాయిలు 19 పాయింట్లు దక్కించుకున్నారు.

బంగ్లాపై భారీ విజయం

280 పరుగుల తేడాతో టీమ్ఇండియా గెలుపు • అశ్విన్ ఆల్‌రౌండ్ షో • సిరీస్‌లో 1-0 ఆధిక్యం

ప్రత్యర్థి ఎవరైనా సొంతగడ్డపై తమకు ఎదురులేదని భారత క్రికెట్ జట్టు మరోసారి నిరూపించింది. చెన్నై వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో రోహిత్ సేన 280 పరుగులతో విజయదుందుభి మోగించింది. 515 పరుగుల ఛేదనలో బంగ్లా 234 పరుగులకే పోరాటాన్ని చాలించింది. ఆట మొదటి రోజు రెండు సెషన్లలో తడబడ్డా లోకల్ బాయ్ రవిచంద్రన్ అశ్విన్ వీరోచిత శతకానికి తోడు రవీంద్ర జడేజా నిలకడైన బ్యాటింగ్‌తో భారీ స్కోరు సాధించిన టీమ్ఇండియా.. ఆ తర్వాత ఎక్కడా ఆధిక్యాన్ని కోల్పోకుండా ఆధిపత్యం చెలాయించింది. నాలుగో ఇన్నింగ్స్‌లోనూ బంగ్లా పనిపట్టింది ఈ స్పిన్ ద్వయమే కావడం విశేషం. భారీ ఛేదనలో బంతి పేసర్లతో పాటు స్పిన్నర్లకూ అంతంత మాత్రంగానే అనుకూలించినా స్థానిక పరిస్థితులపై పూర్తిస్థాయి అవగాహన ఉన్న అశ్విన్.. ఆరు వికెట్లతో విజృంభించి బంగ్లాను చావుదెబ్బ కొట్టాడు. జడ్డూ కూడా తన స్పిన్ మాయతో ప్రత్యర్థి ఆట కట్టించడంతో భారత్ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది.



అశ్విన్ (6/88)



చెన్నై: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో భారత్ భారీ విజయం సొంతం చేసుకుంది. చెన్నైలోని చెపాక్ వేదికగా ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో టీమ్ఇండియా 280 పరుగుల తేడాతో గెలిచి రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాట్‌తో సెంచరీ చేసిన రవిచంద్రన్ అశ్విన్.. రెండో ఇన్నింగ్స్‌లో బంతి (6/88)తో ఆరు వికెట్లు పడగొట్టి బంగ్లా పని పట్టాడు. అశ్విన్‌కు తోడు అతడి సహచర స్పిన్నర్ రవీంద్ర జడేజా (3/58) రాణించడంతో 515 పరుగుల ఛేదనలో పర్యాటక జట్టు 234 పరుగులకే ఆలౌట్ అయి భారీ పరాభవాన్ని మూటగట్టుకుంది. భారీ ఛేదనలో ఆ జట్టు సారథి నజ్ముల్ హొసేన్ శాంతో (82) పోరాడినా అతడికి అండగా నిలిచేవారు కరువవడంతో బంగ్లాకు ఓటమి తప్పలేదు. మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షో తో అదరగొట్టిన రవిచంద్రన్ అశ్విన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ సిరీస్‌లో రెండో టెస్టు ఈనెల 27 నుంచి కాన్పూర్ వేదికగా జరుగనుంది.

రెండు గంటల్లోపే..

కొండంత లక్ష్యాన్ని కరిగించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 158/4 వద్ద నాలుగో రోజు ఆటను ఆరంభించిన బంగ్లా కనీస పోరాటం లేకుండానే రెండు గంటల్లోపే తోకముడిచింది. తొలి గంటలో శాంతో, షకిబ్ (25) కొంతసపు వికెట్లను కాపాడుకునే దశలో మరీ నెమ్మదిగా ఆడారు. కానీ డ్రింక్స్ తర్వాత కెప్టెన్ రోహిత్.. బంతిని అశ్విన్‌కు అందించడంతో బంగ్లా 'ఖేల్' ఖతం అయింది. అశ్విన్, జడ్డూ కలిసి 10 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు. అశ్విన్ తన తొలి ఓవర్ (ఇన్నింగ్స్ 52వ)లోనే షకిబ్‌ను పెవిలియన్‌కు పంపాడు. స్లిప్స్‌లో యశస్వీ అద్భుత డైవ్ క్యాచ్ పట్టడంతో 48 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇక ఆ తర్వాత వచ్చినోళ్లెవరూ రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. జడ్డూ బౌలింగ్‌లో లిటన్ దాస్ (1) రోహిత్‌కు క్యాచ్ ఇవ్వగా బంగ్లా భారీ ఆశలు పెట్టుకున్న మెహిది హసన్ మిరాజ్ (8)ను అశ్విన్ ఔట్ చేసి రెండో ఇన్నింగ్స్‌లో 'ఫైఫర్'ను పూర్తిచేసుకున్నాడు. జడేజా వేసిన 63వ ఓవర్లో హసన్ మహ్మూద్ (7) క్లీన్ బౌల్డ్ అవడంతో బంగ్లా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

సంక్షిప్త స్కోరు

భారత్: తొలి ఇన్నింగ్స్ – 376 ఆలౌట్,
బంగ్లాదేశ్: తొలి ఇన్నింగ్స్ – 149 ఆలౌట్,
భారత్: రెండో ఇన్నింగ్స్ – 287/4 డిక్లేర్డ్.
బంగ్లాదేశ్: రెండో ఇన్నింగ్స్ – 234 ఆలౌట్

రెండో టెస్టుకూ అదే జట్టు

బంగ్లాదేశ్‌తో కాన్పూర్ వేదికగా జరిగే రెండో టెస్టుకు భారత జట్టులో మార్పులేమీ లేవు. తొలి టెస్టుకు ఎంపిక చేసిన జట్టు సభ్యులనే రెండో టెస్టులోనూ కొనసాగిస్తున్నట్టు ఆదివారం బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, యశ్ దయాల్



అశ్విన్ రికార్డుల మోత

1 రెండుసార్లు ఒకే వేదికపై (టెస్టులలో) సెంచరీ చేసి ఐదు వికెట్లు తీసిన మొదటి ఆటగాడు. 2021లో ఇంగ్లండ్‌తో టెస్టులోనూ అతడు ఈ ఘనత సాధించాడు. అదీగాక ఒక టెస్టులో శతకంతో పాటు 'ఫైఫర్' సాధించిన ఆటగాళ్లలో ఇయాన్ బోథమ్ (5) తర్వాత రెండో స్థానంలో అశ్విన్ (4) నిలిచాడు.

2 టెస్టులలో అత్యధిక సార్లు (37) ఐదు వికెట్ల ఘనత సాధించిన రెండో బౌలర్. ఈ జాబితాలో ముత్తయ్య మురళీధరన్ (67) అందరికంటే ముందున్నాడు. ఈ క్రమంలో అతడు దివంగత షేన్ వార్న్ (37- ఆసీస్), రిచర్డ్ హ్యాడ్లీ (36- కివీస్)ను దాటేశాడు.

8 టెస్టులలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో అశ్విన్ స్థానం. 522 వికెట్లతో అతడు 8వ స్థానంలో నిలిచాడు. విండీస్ దిగ్గజం కోట్నీ వాల్ష్ (519)ను అధిగమించాడు.

టీమ్ఇండియా అరుదైన ఘనత

బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు విజయం అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌లో టీమ్ఇండియా అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. 92 ఏండ్ల భారత టెస్టు క్రికెట్ చరిత్రలో ఇప్పటిదాకా 580 టెస్టులు ఆడగా తొలిసారి ఓటముల కంటే విజయాల సంఖ్యను ఎక్కువగా నమోదుచేసింది. 580 టెస్టులలో 179 విజయాలు, 178 ఓటములు, 222 డ్రాలు చేసుకోగా ఒక మ్యాచ్ టై అయింది. ప్రపంచ క్రికెట్‌లో ఇలా అపజయాల కంటే విజయాలు ఎక్కువ నమోదుచేసిన దేశాలలో భారత్ నాలుగో స్థానంలో ఉంది.

అన్మోల్ ఖర్బ్‌కు రెండో టైటిల్



ఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ యువ సంచలనం అన్మోల్ ఖర్బ్ మరోసారి సత్తా చాటింది. కొద్దిరోజుల క్రితమే 'బెల్జియం ఇంటర్నేషనల్'ను గెలుచుకున్న 17 ఏండ్ల ఈ అమ్మాయి.. ఆదివారం లుబ్లిన్ (పోలండ్) వేదికగా ముగిసిన 'పోలిష్ ఇంటర్నేషనల్ 2024' మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్‌లో అన్మోల్.. 21–12, 21–8తో మిలెనా (స్విట్జర్లాండ్)ను ఓడించి వరుసగా రెండో టైటిల్ నెగ్గింది.

2 వికెట్లా? 68 పరుగులా?

గాలె: శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య గాలె వేదికగా జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా సాగుతోంది. 275 పరుగుల ఛేదనలో భాగంగా రెండో ఇన్నింగ్స్‌లో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 207/8గా నిలిచింది. ఆ జట్టు విజయానికి మరో 68 పరుగులు అవసరముండగా క్రీజులో రచిన్ రవీంద్ర (91 నాటౌట్), అజాజ్ పటేల్ (0 నాటౌట్) ఉన్నారు. లంక విజయానికి రెండు వికెట్ల దూరంలో ఉంది.

దులీప్ ట్రోఫీ విజేత ఇండియా 'ఏ'



అనంతపూర్: దేశవాళీ ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీని మయాంక్ అగర్వాల్ సారథ్యంలోని ఇండియా 'ఏ' దక్కించుకుంది. ఆట ఆఖరి రోజు 350 పరుగుల ఛేదనలో ఇండియా 'సీ'.. 217 పరుగులకు కుప్పకూలడంతో అగర్వాల్ సేన 132 పరుగుల తేడాతో విజయం సాధించింది. సాయి సుదర్శన్ (111) పోరాడినా 'సీ'కి పరాభవం తప్పలేదు. ప్రసిధ్ (3/50), తనుష్ (3/47) రాణించారు. మూడింటిలో రెండు మ్యాచ్‌లు గెలిచిన 'ఏ'.. 12 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా 'సీ' 9 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది.

ప్రతి జిల్లాకూ ప్రాతినిధ్యం ఉండాలి



టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర రెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి చెందాలంటే ప్రతి జిల్లాకూ అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన అకాడమీలు అవసరమని, రాష్ట్ర జట్టు అంటే అన్ని జిల్లాల నుంచి క్రికెటర్లకు ప్రాతినిధ్యం ఉండాలని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అధ్యక్షుడు, శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'తెలంగాణ క్రికెట్ దశ-దిశ' రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో గ్రామీణ క్రికెట్ సరైన ఆదరణను నోచుకోలేదని, రాష్ట్ర క్రికెట్ జట్టు అంటే ప్రతి జిల్లాకూ ప్రాతినిధ్యం ఉండేలా టీడీసీఏ తరపున రాజీలేని కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శాట్ చైర్మన్ కే. శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో గ్రామీణ క్రికెట్ కుంటుపడింది. జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి టీడీసీఏ సంకల్పం తీసుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం' అని అన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.